
రాజశేఖర చరిత్రము
రూ॥ 180/-
పేజీలు: 190
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★


ప్రపంచ జిడిపిలో 4వ స్థానం, తలసరి జిడిపిలో 136వ స్థానం


తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి

రైత్వారీ విధానం రూపశిల్పి సర్ థామస్ మన్రో

లోపలి పేజీల్లో

సంపుటి 08, సంచిక: 178 | బుధవారం | 28-05-2025 | మహబూబ్‌నగర్ | Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## బంగాళాఖాతంలో అల్పపీడనం



- ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు
- పలు జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసిన అధికారులు
- జూన్‌లో సాధారణం కన్నా అధిక వర్షపాతం : ఐఎండి

ప్రజాపక్షం/హైదరాబాద్/న్యూఢిల్లీ

పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడినట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు ప్రకటించారు. దీనికి అనుబంధంగా ఉన్న ఉపరితల ఆవర్తనం సగటు సముద్రమట్టం నుంచి 7.6 కిలో మీటర్ల ఎత్తు వరకు ఉండి, ఇది ఎత్తు పెరిగే కొద్దీ దక్షిణ దిక్కుకు వాలి ఉందని తెలిపారు. అల్పపీడనం కారణంగా రాష్ట్రంలో మూడు రోజుల పాటు రాష్ట్రంలో పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందన్నారు. మంగళవారం ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, మెదక్, సంగారెడ్డి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే తరువాయి 2లో

## కాళేశ్వరం కమిషన్ ముందుకు కెసిఆర్?

5న విచారణకు హాజరు

నేరుగానా లేక వీడియో కాన్ఫరెన్స్ ద్వారానా? అనే దానిపై కొరవడిన స్పష్టత

ప్రజాపక్షం/హైదరాబాద్

కాళేశ్వరం కమిషన్ విచారణకు హాజరు కావాలని మాజీ ముఖ్యమంత్రి, బిఆర్‌ఎస్ అధినేత కె.చంద్రశేఖర్ రావు నిర్ణయించుకున్నట్లు సమాచారం. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో అవినీతి, నిర్మాణ లోపాలపై విచారణకు ఏర్పాటు చేసిన జస్టిస్ పిసి ఘోష్ విచారణ కమిషన్ జూన్ 5వ తేదీన విచారణకు హాజరు కావాలని మాజీ సిఎం కెసిఆర్‌కు నోటీసులు జారీచేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో విచారణకు హాజరు కావాలని కెసిఆర్ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ వర్గాల సమాచారం. అయితే ఈ విచారణకు కెసిఆర్ నేరుగా హాజరు కావడమా లేక వీడియో కాన్ఫరెన్స్ ద్వారా లేక కమిషన్ అధికారులను తరువాయి 2లో



## మావోయిస్టుల మృతదేహాలను పోలీసులే
# దహనం చేయడం దారుణం

- ఏ ధర్మం ప్రకారం నక్సల్స్ మృతదేహాలను దహనం చేశారో చెప్పాలి
- మావోయిస్టుల శవాలను చూసి వణుకుతున్న మోదీ, అమిత్‌షా
- అలాంటి వారికి దేశాన్ని పాలించే నైతిక హక్కు లేదు
- వామపక్షాలు, శాంతిచర్చల కమిటీ నేతలు మండిపాటు



ప్రజాపక్షం/హైదరాబాద్

మావోయిస్టుల ఉద్యమం అంటేనే భయపడిన ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చివరికి వారి శవాలను చూసి కూడా వణికిపోతున్నారని, అలాంటి వారికి ఈ దేశాన్ని పాలించే నైతిక హక్కు లేదని వామపక్ష పార్టీల నాయకులు, శాంతి చర్చల కమిటీ నేతలు అన్నారు. అనుక్షణం శ్రీరాముడి నామం జపించే బిజెపి పాలకులకు రావణుడు యుద్ధంలో మరణిస్తే ఆయన దహన సంస్కారాలకు సంబంధించి రాముడు చేసిన హితబోధ తెలియదా అని ప్రశ్నించారు. ఎన్‌కౌంటర్లలో మరణించిన మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతో పాటు మరో 6 మంది మావోయిస్టుల మృత దేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించకుండా పోలీసులే దహనం చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. హిందుత్వం పేరుతో ఊరేగే బిజెపి పాలకులు మరి ఏ ధర్మం ప్రకారం మావోస్టుల మృతదేహాలను దహనం చేశారో తరువాయి 2లో

> మావోయిస్టులు మృత దేహాలను ఏ ప్రమాణాలు పాటించి పోలీసులే దహనం చేశారో చెప్పాలి. మావోయిస్టుల మృతదేహాలను అప్పగిస్తే స్థానిక రాష్ట్రాల్లో శాంతి భద్రతల సమస్య వస్తుందని కేంద్రం ప్రకటించడమంటే ఈ సమాజం కోసం పోరాడుతున్న మావోయిస్టుల ఉద్యమానికి మద్దతు పలుకుతున్నట్లే కదా! ప్రజా మద్దతు ఉన్న మావోయిస్టులతో చర్చలు జరిపేందుకు కేంద్రం ఎందుకు వెనకడుగు వేస్తుంది? ఆదివాసీల ఉద్యమం ఇప్పటిది కాదు.. 200 ఏళ్ల నుంచి ఉంది. భారత స్వాతంత్ర్య పోరాటమంతా ఉద్యమాలమయమే. అభివృద్ధి పేరుతో ప్రజలను మభ్యపెడుతూ అడవిని నాశనం చేస్తూ పర్యావరణానికి విఘాతం కలిగిస్తోంది. ఇదే జరిగితే భవిష్య త్‌లో మానవాళి ఉనికే ప్రమా దంలో పడనుంది.
>
> – ప్రొఫెసర్ హరగోపాల్



## వ్యవసాయ అధికారులు
# అప్రమత్తం

రైతులకు అసౌకర్యం కలగకుండా స్థానిక అవసరాలను ముందుగానే గుర్తించాలి

- ప్రతి జిల్లాలో పర్యవేక్షణ కోసం ప్రత్యేక అధికారిని నియమించాలి
- నకిలీ విత్తనాలు అమ్మేవారిపై కఠినచర్యలు తీసుకోవాలి
- అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం
- ఇప్పటివరకు అత్యధికంగా 64.50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్

నకిలీ విత్తనాలు అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. అవసరమైతే అలాంటి వారిపై పీడీ చట్టాన్ని ప్రయోగించాలని ఆయన స్పష్టం చేశారు. అలాగే నకిలీ విత్తనాల గురించి రైతులకు అవగాహన కల్పించాలని, జిల్లా కలెక్టర్లు క్షేత్ర స్థాయికి వెళ్లి పరిస్థితిని బట్టి చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లు, ఇందిరమ్మ ఇళ్లు, భూభారతి, వానాకాలం తరువాయి 12లో

## మావోయిస్టులకు
# కొత్త దళపతి ఎవరు?



- తీవ్రస్థాయిలో చర్చోపచర్చలు
- తెరపైకి తిరుపతి, మల్లోజుల వేణుగోపాల్ పేర్లు
- తెలుగేతర నాయకత్వానికి అవకాశం
- హిడ్మాకు సిఎంసి బాధ్యతలు

ప్రజాపక్షం/భద్రాచలం

మావోయిస్టు పార్టీ కొత్త దళపతి ఎవరు అనేదానిపై తీవ్ర చర్చోప చర్చలు సాగుతున్నాయి. సిపిఐ మావోయిస్టు కేంద్ర ప్రధాన కార్యదర్శి మల్లోజుల వేణుగోపాల్ ఎన్‌కౌంటర్ అనంతరం మావోయిస్టు పార్టీలో అధినాయకుడు ఎవరు అనేది అంతుపట్టకుండా ఉంది. ప్రస్తుతం మావోయిస్టులు ఎదుర్కొంటున్న గడ్డు పరిస్థితులను ధీటుగా ఎదుర్కొని, భుజస్కందాలపై పార్టీని మోయగల సమర్థుడు చాలా అవసరం. అదే అంశంపై విప్లవోద్యమ సానుభూతిపరుల్లో పోలీస్ ఇంటెలిజెన్స్ వర్గాలు కూడా చర్చించుకుంటున్నట్లు తెలుస్తోంది.

**అనుభవం, అర్హత**

నంబాల కేశవరావు మృతి తర్వాత ఆ స్థానం భర్తీ కావాలంటే అనుభవంతో పాటు అర్హత కూడా అంతే ముఖ్యం. పార్టీని ధీటుగా ఎవరు నడిపిస్తారు అనేది అత్యంత కీలకం. దండకారణ్యంలో పాగా వేసిన పారా మిలిటరీబలగాలు అడవిని జల్లెడ పడుతున్నాయి. ఇలాంటి కిష్టమైన పరిస్థితుల్లో పెద్దదిక్కు ఎంపిక తీవ్ర క్లిష్టంగా మారింది. ఆపరేషన్ దూకుడుపై ఉండటంతో దానిని ఎదుర్కొనే సత్తా ఉన్న నేత అవసరం.

**తెరపైకి ఆ ఇద్దరి పేర్లు**

తెలంగాణ ప్రాంతానికి చెందిన ఇద్దరు సీనియర్ల పేర్లు బాగా వినిపిస్తున్నాయి. వారు జగిత్యాలకు చెందిన తిప్పరి తిరుపతి, పెద్దపల్లికి చెందిన మల్లోజుల వేణుగోపాల్. అయితే 62 ఏళ్ల వయస్సున్న తిరుపతి దళిత వర్గానికి చెందిన వాడు కావడంతో ఆదివాసీలతో పాటు దళితులని పెద్ద ఎత్తున పార్టీలో రిక్రూట్ చేసి ముందుకు తీసుకెళతాడని కొందరి వాదన, ఆయన ప్రస్తుతం తరువాయి 2లో

## రాజీవ్ యువ వికాసంలో
# గిగ్ వర్కర్లకు అవకాశం

జూన్ 2న మంజూరు పత్రాలు పంపిణీ : డిప్యూటీ సిఎం భట్టి



ప్రజాపక్షం / హైదరాబాద్

పట్టణ ప్రాంతాల్లోని యువత గిగ్ వర్కర్లుగా ఉపాధి పొందేందుకు ద్విచక్ర వాహనాలు కొనుగోలు చేసుకునేందుకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారని, రాజీవ్ యువ వికాసంలో వారికి అవకాశం కల్పించేలా చూడాలని అధికారులను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. రాజీవ్ వికాసం కింద అవకాశం కల్పించాలని యువత సంక్షేమ శాఖల కార్పొరేషన్లకు దరఖాస్తులు చేసుకున్నారని, ఆ దరఖాస్తులన్నింటిని తరువాయి 2లో

## ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసిలను
# విద్యకు దూరం చేసే కుట్ర

- అర్హులైన అభ్యర్థులను ఉద్దేశ్యపూర్వకంగానే అనర్హులుగా ప్రకటిస్తున్నారు
- ఈ పద్ధతి మనువాదం తాలూకా కొత్త రూపం ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ విమర్శ



**న్యూఢిల్లీ :** బిజెపి సర్కార్‌పై కాంగ్రెస్ అగ్రనేత, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శలు గుప్పించారు. ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి వర్గాలకు చెందిన అర్హులైన అభ్యర్థులను విద్య, రాజకీయాల నుంచి దూరంగా ఉంచడానికే ఉద్దేశపూర్వకంగా అనర్హులుగా (నాట్ ఫౌండ్ సూటబుల్) ప్రకటిస్తున్నారని ఆరోపించారు. అర్హత కలిగిన అభ్యర్థులను అనర్హులు అని తిరస్కరించే పద్ధతి మనువాదం తాలుక కొత్త రూపమని విమర్శించారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో ట్వీట్ పోస్ట్ చేశారు. 'నాట్ ఫౌండ్ సూటబుల్ అనేది ఇప్పుడు మనువాదం కొత్త రూపం. ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసిల అర్హులైన అభ్యర్థులను ఉద్దేశపూర్వకంగా అనర్హులుగా ప్రకటిస్తున్నారు. తద్వారా వారిని విద్య, రాజకీయం నుంచి దూరం చేస్తున్నారు. సమానత్వానికి సాధనంగా అంబేడ్కర్ తీసుకొచ్చిన విద్య అనే ఆయుధాన్ని మోదీ ప్రభుత్వం బలహీనపరుస్తోంది. ఢిల్లీ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ల రిజర్వ్‌డ్ పోస్టులలో 60 శాతానికి పైగా, అసోసియేట్ ప్రొఫెసర్ల రిజర్వ్‌డ్ పోస్టులలో 30 శాతానికి పైగా ఖాళీలు ఉన్నాయి. వాటిని ఖాళీగా తరువాయి 2లో

## స్థానిక సంస్థల్లో అవగాహన ఉంటే ఓకే.. లేదంటే..
# ఒంటరి పోటీకైనా సిద్ధం



- స్థానిక సంస్థల్లో సుపరిపాలన కోసం 73, 74వ రాజ్యాంగ సవరణలను అమలు చేయాలి
- కూనంనేని సాంబశివరావు, చాడ వెంకటరెడ్డి డిమాండ్
- సిపిఐ కరీంనగర్ జిల్లా 23వ మహాసభలు ప్రారంభం

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి

సుపరిపాలన కోసం రాజీవ్‌గాంధీ తెచ్చిన 73, 74వ రాజ్యాంగ సవరణలను స్థానిక సంస్థల్లో అమలు చేయాలని కోరారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల్లో ఒంటరిగానైనా పోటీ చేయాలని, కలిసి వచ్చి సీట్ల కేటాయింపులో అవగాహన చేసుకుంటే మంచిదని, లేదంటే తమ సత్తా ఏంటో చూపించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో అవినీతి పాటు రేషన్‌కార్డుల పంపిణీలో అలసత్వం పెరిగిందన్నారు. మంగళవారం సిపిఐ కరీంనగర్ జిల్లా 23వ మహాసభలు కరీంనగర్‌లోని మధుగార్డెన్‌లో ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రారంభ సూచికగా ఏర్పాటు చేసిన పార్టీ పతాకాన్ని సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ ఎంపిపి వేముల వెంకట్రాజం ఆవిష్కరించారు. ప్రజా ఉద్యమాల్లో అసువులు బాసిన అమరవీరుల స్మారకార్థం ఏర్పాటు చేసిన అమరుల స్మారక స్థూపం చిహ్నాన్ని సిపిఐ సీనియర్ నాయకులు శ్రీరాముల రాంచంద్రం ప్రారంభించారు. అమరవీరులకు కూనంనేని సాంబశివరావు, చాడ వెంకటరెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్, జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి తరువాయి 12లో



## గోవా నుంచి హైదరాబాద్‌కు కొకైన్

ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు చిక్కిన గ్యాంగ్

ప్రజాపక్షం/హైదరాబాద్

వ్యాపారంలో మంచి లాభాలను ఆర్జిస్తున్నాడు. తరచు గోవాకు వెళ్లి వస్తు ఉండడంతో డ్రగ్స్‌కు అలవాటు పడ్డాడు. ఈ డ్రగ్స్ అలవాటును తనతోపాటు తన స్నేహితులకు అలవాటు చేశాడు.. చేస్తున్న వ్యాపారానికి మరింత లాభాలు ఆర్జించడానికి గోవా టూ హైదారాబాద్ డ్రగ్స్ తరువాయి 12లో

## కలకత్తా హైకోర్టుకు
# జస్టిస్ సుజయ్‌పాల్ బదిలీ

తెలంగాణ హైకోర్టుకు ముగ్గురు జడ్జిల బదిలీ

దేశవ్యాప్తంగా 21 న్యాయమూర్తుల బదిలీలకు కొల్లీజియం సిఫార్సు

**న్యూఢిల్లీ :** తెలంగాణ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా వ్యవహరిస్తున్న జస్టిస్ సుజయ్ పాల్ కలకత్తా హైకోర్టుకు బదిలీ అయ్యారు. కర్నాటక హైకోర్టు నుంచి జస్టిస్ సి.సుమలత, జస్టిస్ లలిత కన్నెగంటి, పట్నా హైకోర్టు నుంచి తరువాయి 2లో



## పహల్గామ్‌లో జమ్మూ కశ్మీర్ కేబినెట్ భేటీ

**పహల్గామ్ :** ఉగ్రదాడి జరిగిన పహల్గామ్‌లో మంగళవారం జమ్మూ కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా నేతృత్వంలో మంత్రివర్గ సమావేశం జరిగింది. ఇది కేవలం సాధారణ పరిపాలనాపరమైన కసరత్తు కాదని, ఉగ్రవాదుల పిరికి చర్యలకు తాము భయపడబోమనే స్పష్టమైన సంకేతమని జమ్మూ కశ్మీర్ సిఎం కార్యాలయం 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. శాంతి శత్రువులు ఎన్నటికీ మా నిబద్ధతను శాసించలేరని, జమ్మూ కశ్మీర్ దృఢంగా, బలంగా, నిర్భయంగా నిలిచి ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే అల్తాఫ్ కాలూ నేతృత్వంలో వివిధ వర్గాల ప్రతినిధులు స్థానిక సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్ళారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి పహల్గాంకు వచ్చిన పర్యాటకులను సిఎం ఒమర్ అబ్దుల్లా సాయంత్రం కలిసారు. వారి రాకతో జమ్మూ కశ్మీర్ పర్యాటక సామర్థ్యం పట్ల విశ్వాసం పునరుద్ధాటిస్తున్నదని పేర్కొన్నారు. అంతకుముందు నున్వాన్ బేస్ క్యాంప్ వద్ద అమర్‌నాథ్ యాత్ర ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## పెద్ద నోట్లు రద్దుతోనే అవినీతి నిర్మూలన

డిజిటల్ కరెన్సీ ప్రవేశపెట్టాలని ప్రధానికి నివేదిక

**రాష్ట్రం (ఎపి) ఫస్ట్ మన సంకల్పం**

టిడిపి మహానాడులో ఎపి సిఎం చంద్రబాబునాయుడు




**కడప :** 'డిజిటల్ కరెన్సీ ప్రవేశ పెట్టమని ప్రధానికి నివేదిక ఇచ్చాను. దీని వల్ల అక్రమార్కులను తేలిగ్గా పట్టుకోవచ్చని చెప్పాను. ప్రజాసేవే పరమావధిగా పనిచేయాలి. పెద్ద నోట్లు రద్దు చేస్తేనే దేశంలో అవినీతి పోతుంది. పార్టీలకు విరాళం ఇవ్వాలన్నా నేరుగా ఫోన్ ద్వారా అకౌంట్‌లోకి డబ్బు చెల్లించవచ్చు' టిడిపి జాతీయ అధ్యక్షుడు, ఎపి సిఎం చంద్రబాబు చెప్పారు. అభివృద్ధి, సంక్షేమం, సంస్కరణలు, సుపరిపాలనకు టిడిపినే ట్రెండ్ సెట్టర్ అన్నారు. రాష్ట్రం (ఆంధ్రప్రదేశ్) ఫస్ట్ మన సంకల్పం అని, పాజిటీవ్ పాలిటిక్స్ మన విధానమని చెప్పారు. 1982లో ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమం మొదలు... నిన్నటి విధ్వంస పాలన వరకూ రాజీలేని పోరాటం చేశామన్నారు. మంగళవారం కడపలో మహానాడు అట్టహాసంగా ప్రారంభమైంది. తొలిరోజు సమావేశంలో పార్టీ క్యాడర్‌ను ఉద్దేశించి చంద్రబాబు ఉద్వేగంగా ప్రసంగించారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పించి, జ్యోతిని వెలిగించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నా, అధికారంలో ఉన్నా మహానాడు అంటే అదే జోరు. అదే హోరు అని అన్నారు. '43 ఏళ్ల ప్రస్థానంలో దేశంలో ఏ పార్టీ ఎదుర్కోని సంక్షోభాలు ఎదుర్కొన్నాం. పార్టీ పని అయిపోయిందని మాట్లాడినవారి పనే అయిపోయింది. కానీ టిడిపి జెండా రెపరెపలాడుతూనే ఉంది. గత వైసిపి తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## అమెరికా 'గోల్డ్ డోమ్'తో అంతరిక్ష అణుయుద్ధమే

**ప్యాంగ్‌యాంగ్ :** అమెరికా కొత్తగా ఏర్పాటు చేయాలని తలపెట్టిన అత్యాధునిక గగనతల రక్షణ కవచ వ్యవస్థ 'గోల్డ్ డోమ్' ప్రాజెక్టు వల్ల అంతరిక్ష అణుయుద్ధ ప్రమాదం తలెత్తుతుందని ఉత్తర కొరియా దేశాధినేత కిమ్ జోంగ్ ఉన్ ఆందోళన వ్యక్తం చేశారు. ట్రంప్ భవిష్యత్తులో అంతరిక్షాన్ని కూడా యుద్ధ కేంద్రంగా మార్చేసేందుకే ఈ ప్రాజెక్టును ప్రకటించారని విమర్శించారు. తన పదవీకాలం ముగిసేనాటికి ఈ గోల్డ్ డోమ్ రక్షణ వ్యవస్థను భవిష్యత్ అమెరికా భద్రత నిమిత్తం ఏర్పాటు చేస్తానని ట్రంప్ ప్రకటించడంవల్ల ప్రపంచదేశాలలో ఆయుధపోటీ విపరీతంగా పెరిగిపోతుందని కిమ్ చెప్పారని ఉత్తర కొరియా విదేశాంగ మంత్రిత్వశాఖ పేర్కొంది. ఖండాంతర క్షిపణులు, ఇతర రకాల క్షిపణుల దాడుల నుండి అమెరికాకు పూర్తి రక్షణ కల్పించేందుకు ఈ గోల్డ్ డోమ్ రక్షణ కవచం ప్రాజెక్టును కొద్దిరోజుల క్రితం ట్రంప్ ప్రకటించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే తమ అణువ్యవస్థలు బలహీనపడినట్లేనని, ఇక అప్పుడు తమదేశం ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తుందని కొరియా నేషనల్ యూనిఫికేషన్ సంస్థ సీనియర్ విశ్లేషకుడు హాంగ్ మిన్ అన్నారు.

## ఉక్రేన్‌పై భద్రతామండలిలో చర్చిద్దాం : రష్యా

### యూరప్ ఆటంకంగా మారిందని విమర్శ





**మాస్కో :** ఉక్రేన్ యుద్ధ సమస్యపై ఐక్యరాజ్యసమితి భద్రతామండలి సమావేశం ఏర్పాటు చేయాలని రష్యా ప్రభుత్వం కోరింది. బహుశా ఈ సమావేశం మే 30వ తేదీన నూటికి నూరుపాళ్ళు జరిగే అవకాశం ఉంది. ఉక్రేన్ సమస్యను పరిష్కరించడానికి యూరప్ దేశాలు ఆటంకంగా మారాయనీ, ఈ సమస్యను సమగ్రంగా చర్చించడానికి భద్రతామండలి సమావేశం ఏర్పాటు చేయాలని ఐక్యరాజ్యసమితిలో రష్యా ఎఫ్‌డిపిఆర్ (ఫస్ట్ డిప్యూటీ పర్మినెంట్ రిప్రజెంటేటివ్) ద్మీత్రీ పోలియాన్‌స్కీ విజ్ఞప్తి చేశారు. ఉక్రేన్‌లో యుద్ధాన్ని పరిష్కరించేందుకు చేస్తున్న ప్రయత్నాలను యూరప్ దేశాలు వమ్ము చేస్తున్నాయని ద్మీత్రీ పోలియాన్‌స్కీ విమర్శించారు. "ఉక్రేన్‌లో నెలకున్న మానవతాబీభత్స పరిస్థితులను చర్చించేందుకు ఈనెల 29వ తేదీ మధ్యాహ్నం 12.30 గంటలకు సమావేశం నిర్వహించాలని ఉక్రేన్‌లో యుద్ధాన్ని ప్రోత్సహిస్తున్న యూరప్ దేశాలు భద్రతామండలిని కోరాయి, వారు అడిగారు కదా, మేం కూడా అదే పద్ధతులలో ఒక సమావేశం ఏర్పాటు చేయాలని భద్రతామండలిని కోరుతున్నాం, మేం కూడా ఉక్రేన్‌ను రెచ్చగొడుతున్న యూరప్ దేశాల గురించి మాట్లాడతాం, ప్రపంచశాంతికి యూరప్ దేశాలు పెద్ద ప్రమాదంగా మారాయి, ఉక్రేన్ సమస్యను పరిష్కరించి శాంతిని సాధించేందుకు వీలుగా జరుగుతున్న ప్రయత్నాలకు యూరప్ దేశాలు అడ్డం పడుతున్నాయి, దీనిని భద్రతామండలిలో బాహాటంగా చర్చించాలి, నాకు తెలిసి మే 30వ తేదీన సాయంత్రం 4.30 గంటలకు ఈ సమావేశం జరుగుతుంది, ఆరోజు భద్రతామవండలికి గ్రీస్ దేశ ప్రతినిధి అధ్యక్షత వహిస్తారు'' అని ద్మీత్రీ పోలియాన్‌స్కీ టెలిగ్రామ్ ఛానల్‌లో రాశారు. ఇస్తాంబుల్‌లో చర్చల ఫలితాలు ఏమిటో క్షుణ్ణంగా తెలుసుకోవాలని ఐక్యరాజ్యసమితిలో ఎదురుచూస్తున్న రష్యా వ్యతిరేకులు ఉక్రేన్ సమస్యను అమెరికా ఆలోచనాధోరణికి సంబంధం లేకుండా క్రియాశీలంగా రావణాకాష్టంలా మండుతూనే ఉంచేందుకు ప్రయత్నం చేస్తున్నారని సోలియాన్‌స్కీ విమర్శించారు. మే 11వ తేదీన చర్చలకు పుతిన్ ప్రతిపాదించారు.

ఈ చర్చల ప్రతిపాదనను అంగీకరించాలని ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని ట్రంప్ కోరారు. వారి ఆమోదం మేరకు ఇస్తాంబుల్‌లో మే 16 వ తేదీన రష్యా, ఉక్రేన్ మధ్య మొదటిసారి ముఖాముఖీ చర్చలు జరిగాయి. ఈ చర్చలు జరగాలంటే 30 రోజుల కాల్పుల విరమణకు అంగీకరించాలని జెలెన్‌స్కీ ముందస్తు షరతు విధించారు. కానీ సైనికుల పరస్పర మార్పిడి ఒప్పందం తప్ప శాంతి చర్చలు విఫలమయ్యాయి.

**99 ఉక్రేన్ డ్రోన్లు కూల్చేసిన రష్యా**

ఏడు ప్రాంతాలలో గతరాత్రి ఉక్రేన్ డ్రోన్ల దాడి చేసిందని రష్యా రక్షణమంత్రిత్వశాఖ ప్రకటించింది. ఈ డ్రోన్లలో 99 డ్రోన్లను రష్యా సైన్యం కూల్చివేసిందని తెలిపింది. ఈ డ్రోన్లలో 56 డ్రోన్లు సరిహద్దు బెల్గరోడ్‌లో దాడి చేశాయనీ, సోమవారం రాత్రి 10.30 గంటలకు వాటన్నింటినీ కూల్చేశామని రష్యా ప్రకటించింది. వోరోనెజ్ ప్రాంతంలో 25 డ్రోన్లను కూల్చివేశామని చెప్పింది. ఇదిలా ఉండగా ఉక్రేన్ రాజధాని కీవ్‌పై గడచిన మూడేళ్ళలో ఎన్నడూలేని స్థాయిలో దాడులు చేసి భారీ నష్టం చేయడాన్ని ఆ దేశాధ్యక్షుడు జెలెన్‌స్కీ తీవ్రంగా వ్యతిరేకించారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్‌ట్రంప్ సహా ఇతరదేశాలన్నీ మౌనం పాటిస్తున్నాయనీ, ఈవిధంగా మౌనం పాటించడమంటే రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు మరింత ప్రోత్సాహం ఇచ్చినట్లే అవుతుందని హెచ్చరించారు.

మరోవైపు ఉక్రేన్‌కు ఆయుధాల సరఫరా కొనసాగించాలని యూరప్‌దేశం జర్మనీ ఒక తీర్మానం చేసింది. అదేవిధంగా ఎఫ్–16 విమానాలను ఉక్రేన్‌కు పంపినట్లు డచ్ ప్రభుత్వం కూడా ప్రకటించింది. జర్మన్ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్ కూడా ఒక ప్రకటన చేస్తూ ఉక్రేన్‌కు తక్కువ తీవ్రతగల ఆయుధాలు పంపాలనే షరతులేమీ లేవని అన్నారు. భారీ ఆయుధాలను కూడా ఉక్రేన్‌కు పంపుతామన్నారు. రష్యా అధ్యక్ష ప్రతినిధి ద్మీత్రీ పెస్కోవ్ దీనిని తీవ్రంగా వ్యతిరేకించారు. ఉక్రేన్–రష్యా యుద్ధంలో యూరప్ ప్రత్యక్షంగా పరోక్షంగా జోక్యం చేసుకుంటూనే ఉందని విమర్శించారు.

## అమెరికా ముసాయిదా పత్రానికి హమాస్ అంగీకారం?



**గాజా :** ఒకవైపు గాజాలో ఇజ్రాయెల్ భారీ ఎత్తున గతంకంటే భిన్నంగా దాడులు కొనసాగిస్తుంటే, మరోవైపు దోహాలో మధ్యవర్తుల ప్రమేయంతో హమాస్‌తో శాంతి ఒప్పంద చర్చలు కూడా కొనసాగుతున్నాయి. ఐతే ఈ శాంతి చర్చల ఫలితాలపై పరస్పర విరుద్ధ ప్రకటనలు వెలువడుతున్నాయి. అమెరికా ప్రతిపాదించిన 60 రోజుల కాల్పుల విరమణ ఒప్పందానికి హమాస్ అంగీకరించిందని కొత్తగా ఒక వార్త వెలువడింది. రెండు విడతలుగా 10 మంది బందీలను విడుదల చేసేందుకు కూడా ఇజ్రాయెల్ అంగీకరించింది! హమాస్ కూడా పదిరోజులక్రితం దోహాలో మధ్యవర్తుల ద్వారా చర్చలు జరుగుతున్నాయని ప్రకటించింది. శాంతి ఒప్పందానికి తాము సిద్ధంగా ఉన్నామని కూడా ప్రాథమికంగా పేర్కొంది. మరోవైపు ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నేతన్యాహూ ఒక ప్రకటన చేస్తూ, హమాస్ బందీలుగా తీసుకువెళ్ళిన ఇజ్రాయెలీ పౌరులను వెనక్కు తీసుకొచ్చితీరుతామని ప్రతిజ్ఞ చేశారు. బందీలు సజీవులుగా ఉన్నా, నిర్జీవులుగా ఉన్నాగానీ వారందరినీ స్వదేశానికి తీసుకువచ్చేదాకా విశ్రమించబోమన్నారు. దేశంలో నేతన్యాహూకు బందీల కుటుంబసభ్యుల సంఘాల ద్వారా తీవ్రమైన ఒత్తిడి వస్తున్నది. వారు రోజువారీ ప్రాతిపదికపై దేశంలో ప్రదర్శనలు, నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. హమాస్ ఉగ్రవాదులవద్ద బందీలలో 29 మంది ఇంకా సజీవంగా ఉన్నారని ఇజ్రాయెల్ భావిస్తోంది. ఇదిలా ఉండగా, గాజాలో ప్రజలకు ఆహార పంపిణీని ఐక్యరాజ్యసమితి నిబంధనల మేరకు పంపిణీ చేయలేమని చేతులు ఎత్తేసి ఒక ప్రైవేటు సంస్థ వెనక్కు తగ్గిన వెంటనే అమెరికా మద్దతుతో మరో ప్రైవేటు సంస్థ రంగంలోకి దిగింది. గాజా హ్యూమానిటేరియన్ ఫౌండేషన్ ఆహార సరఫరాలను సురక్షిత ప్రాంతాలకు తరలించిందని ఆ ఫౌండేషన్ ప్రకటించింది.




## లివర్‌పూర్ విక్టరీ పరేడ్‌పై కారు దాడి
### 50 మందికి గాయాలు

**లివర్‌పూల్ :** బ్రిటన్ లివర్‌పూల్‌లో ఫుల్‌బాల్ క్లబ్ ప్రీమియర్ లీగ్‌లో విజయం సాధించినందుకు సోమవారం రాత్రి సంతోషంగా సెలబ్రేషన్స్ చేసుకుంటున్న సమయంలో ఒక కారు వేగంగా వారిమధ్యలోకి దూసుకువచ్చింది. ఈ కారు ఢీకొన్న ఘటనలో దాదాపు 50 మంది గాయపడ్డారు. వీరిలో 27 మందికి ఆసుపత్రిలో ఇన్‌పేషంట్లుగా చేర్చి చికిత్సలు చేస్తున్నారు. డ్రైవరును అరెస్టు చేసినట్లు బాధితులు గట్టిగా నమ్ముతున్నారు. ఈ ఘటనతో బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్‌మర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కారు దాడి ఘటనపై దర్యాప్తుకు ఆదేశించారు. దీనికి సంబంధించిన తాజా సమాచారాన్ని ఎప్పటికప్పుడు తాను తెలుసుకుంటున్నాననీ, యావత్ దేశం బాధితులవెంట ఉందని, వారికి అండగా ఉందని స్టార్‌మర్ ఒక ప్రకటనలో చెప్పారు. సంతోషంగా సెలబ్రేషన్స్ చేసుకుంటున్న ఆ ప్రాంతమంతా ఈ కారుదాడితో అరుపులు, కేకలు, ఏడ్పులతో నిండిపోయింది. ఐతే దీనివెనుక ఉగ్రవాదుల హస్తం ఉందని అనుకోవడంలేదని పోలీసులు చెప్పారు. రెండు సంవత్సరాలక్రితం ఇజ్రాయెల్‌లోకి ఉగ్రవాదులు మోటారు సైకిళ్ళపై ఒక సంగీత వేడుకలోకి దూసుకొచ్చి కాల్పుల బీభత్సం సృష్టించారు. ఇది గాజాలో యుద్ధానికి దారితీసింది. అప్పటినుండి ఇలాంటి ఘటనలు ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలలో జరుగుతూనే ఉన్నాయి. కారు వేగంగా దూసుకొస్తున్న సమయంలో చాలామంది ముందుగానే ప్రమాదాన్ని ఊహించి దూరంగా పారిపోయారు. కొంత మంది తృటిలో తప్పించుకున్నారు. ఈ ఘటనతో జనం బెంబేలెత్తారు. బాధితులు కోలుకోవాలని కోరుతూ మంగళవారంనాడు లివర్‌పూల్ మెట్రోపాలిటన్ కెథెడ్రెల్‌లో ప్రార్థనలు జరిగాయి.

## హార్వర్డ్ నిధులు ట్రేడ్స్ స్కూల్స్‌కి ఇచ్చేస్తా : ట్రంప్

**న్యూయార్క్ :** హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో తొంభైశాతంమంది విద్యార్థులు విదేశీయులేనని, వారివల్ల అల్లర్లు, సమస్యలు వస్తున్నాయని విమర్శలు చేస్తూ ఆంక్షలు విధించిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మంగళవారంనాడు మరో కొత్త ప్రకటన చేశారు. హార్వర్డ్ విశ్వవిద్యాలయానికి ఇవ్వకుండా స్తంభింపజేసిన వందలకోట్ల డాలర్లను అమెరికావ్యాప్తంగా ఉన్న వాణిజ్య పాఠశాలలకు పంపిణీ చేస్తానని హెచ్చరించారు. ట్రంప్ పెట్టిన షరతులు అంగీకరించేందుకు తిరస్కరించిన హార్వర్డ్ విశ్వవిద్యాలయం నిర్వాహకులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ట్రంప్, హార్వర్డ్ నిర్వాహకులమధ్య ప్రతిరోజూ ఏదోఒక రూపంలో ఈ సమస్యపై వాగ్వాదం చెలరేగుతున్నది. ట్రంప్ చేసిన తాజా హెచ్చరికతో ఈ వివాదం మరింద ముదరింది. 300 కోట్ల డాలర్ల నిధులను అమెరికాలోని అనేక రాష్ట్రాలలో ఉన్న వాణిజ్య పాఠశాలలకు మళ్ళిస్తానని ట్రంప్ సోషల్ మీడియా వేదికగా పోస్టింగ్ పెట్టారు. ఈ నిధులను ఈ విధంగా ఖర్చుచేయడం అమెరికాకు ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు.

## రికార్డ్ బ్రేక్ చేసిన నేపాలీ 'ఎవరెస్ట్‌మ్యాన్'



**కాట్మండు :** పర్వతారోహణలో ఆరితేరిన దిట్ట 'ఎవరెస్ట్‌మ్యాన్', నేపాలీ షెర్పా 31వ సారి ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించి తన పూర్వ రికార్డును తానే అధిగమించారు. 55 ఏళ్ళు వయసుగల నేపాలీ షెర్పా కమీ రీటా భారత సైనిక అధికారుల బృందానికి మార్గదర్శకత్వం వహించడంద్వారా మరోసారి ప్రపంచంలో అత్యంత ఎత్తైన ఎవరెస్టును అధిరోహించారు. ఆయన ప్రసిద్ధ ఎవరెస్టు పర్వతారోహకుడుగా ఇప్పటికే ప్రపంచఖ్యాతి పొందారు. ఈ విధంగా ఆయన 31వసారి ఎవరెస్టును అధిరోహించి రికార్డుల్లోకి ఎక్కారు. నేపాలీ కాలమానం ప్రకారం మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు ఈ బృందంలో కలిసి షెర్పా కమీ రీటా 8,849 మీటర్ల ఎత్తుగల ఎవరెస్టు శిఖరాగ్రానికి చేరుకున్నారు. "కమీ రీటా ఎవరెస్టు అధిరోహణ చరిత్ర గురించి ప్రపంచానికి ఎవరూ కొత్తగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. ఆయన కేవలం నేపాలీ జాతీయ పర్వతారోహకులకు హీరో మాత్రమేకాదు, ఎవరెస్టు పర్వతాధిరోహణకు ఆయన ఒక ప్రపంచ జ్ఞాపికగా మారారు'' అని సెవెన్ సమ్మిట్ ట్రెక్స్ అనే సాహసకృత్యాల సంస్థ ప్రకటించింది. 1994లో మొదటిసారి కమిరిటా ఒక పర్వతారోహణబృందానికి మార్గదర్శిగా వెళ్ళారు.

ఈనాటివరకూ ప్రతి సంవత్సరం ఒకసారి ఆయన ఎవరెస్టు పర్వతారోహణ చేస్తూ ఆ శిఖరాగ్రాన్ని సందర్శిస్తూనే ఉన్నారు. ఆయనతోపాటే గైడ్‌గా వ్యవహరించే మరో నేపాలీ షెర్పా పసంగ్ దవా ఇప్పటివరకూ 29 సార్లు ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించారు. తానెంతో సంతోషంగా ఉన్నాననీ, తన పర్వతారోహణ ద్వారా నేపాలీ దేశానికి ప్రపంచ వ్యాప్తంగా గొప్ప గుర్తింపు లభించిందని షెర్పా కమి రిటా అన్నారు. నేపాల్‌లోని సోలుకుంబూ జిల్లా థేమ్ లో 1970 జనవరి 17వ తేదీన కమీ రీటా జన్మించారు.

చెప్పాలని డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్ధూంభవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్యపద్మ, సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, శాంతి చర్చల కమిటీ నాయకులు రిటైర్డ్ జస్టిస్ బి.చంద్రకుమార్, ప్రొఫెసర్ జి.హరగోపాల్, వామపక్షాల నాయకులు జాన్‌వెస్లీ సిపిఐ(ఎం), చలపతి సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ, సిహెచ్.మురహరి(ఎస్‌యుసిఐ), ఎ.జానకిరాములు (ఆర్‌ఎస్‌పి), వనం సుధాకర్, ఎంసిపిఐ(యు), హన్మేష్ (మాస్ లైన్), తదితరులు మాట్లాడారు.

ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన మావోయిస్టుల మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించకుండా పోలీసులే దహన సంస్కారాలు నిర్వహించడం అమానవీయమని కూనంనేని సాంబశివరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సంఘటనలను సుప్రీంకోర్టు సుమోటాగా స్వీకరించి న్యాయ విచారణకు ఆదేశించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ దేశ ప్రజలను కాల్చి చంపిన ఉగ్రవాదులపై పోరు పేరుతో పాకిస్తాన్‌తో యుద్ధమంటే ఈ దేశ ప్రజలంతా ఏకతాటిపైకి వచ్చి మద్దతు పలికితే ప్రధాని మోదీ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు లొంగిపోయి శత్రు దేశంతో కాల్పుల విమరణ ఒప్పందం చేసుకున్నారని, ఇది బిజెపి పాలకుల నైజమని విమర్శించారు. కగార్ ఆపరేషన్ పేరుతో దేశ ప్రజలైన 800 మందిని కేంద్ర ప్రభుత్వం అంతమొందించిందని, చివరికి మావోయిస్టుల మృతదేహాలను కూడా వారి కుంటుంబాలకు అప్పగించకుండా కేంద్రం అత్యంత క్రూరంగా వ్యవహరించిందన్నారు. అన్ని మతాలు, కులాలు వర్గాల

### చేయడం దారుణం
(మొదటి పేజీ తరువాయి)

ప్రజలకు సమాన హక్కులను కల్పించిన రాజ్యాంగం ద్వారా చట్టబద్ధంగా ఎన్నికైన కేంద్ర ప్రభుత్వానికి రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరించే హక్కు ఎవరిచ్చారని ప్రశ్నించారు. ప్రజల హక్కుల కోసం పోరాడుతున్న మావోయిస్టులను కేంద్ర బలగాలను ఉపయోగించి తుపాకి మడమలతో ముఖాలపై గుద్ది గుద్ది చంపడం ఏమిటని, వారు ఏమి ద్రోహం చేశారని ప్రశ్నించారు. 'ఒక వైపు మావోయిస్టులు గానీ, మరోవైపు ఎన్‌కౌంటర్ల పేరుతో కేంద్ర బలగాలు గానీ ఎవరు చంపినా తప్పే. అయితే మావోయిస్టులు తప్పులు చేస్తే వారిని చట్టబద్ధంగా శిక్షించే అధికారం ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలకు ఉంది. కానీ ఇందుకు విరుద్ధంగా ఎన్‌కౌంటర్ల పేరుతో మావోయిస్టులను చంపివేయడం అంటే మావోయిస్టులకు, ప్రభుత్వానికి ఏమి తేడా ఉంది' అని కూనంనేని సాంబశివరావు ప్రశ్నించారు. ఈ దేశ ప్రజలైన మావోయిస్టులను కాల్చి చంపి శత్రు దేశాలపై విజయం సాధించినట్లుగా దేశ ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సంబురాలు చేసుకుంటారా, అది అసలు కనీస మానవత్వం ఉన్న మనుషులు చేసే పనేనా అని ప్రశ్నించారు. మావోయిస్టుల ఎన్‌కౌంటర్ జరిగిన మరసటి రోజే కేంద్ర అటవీ పర్యావరణశాఖ కార్పొరేట్ కంపెనీకి అడవిని దారదత్తం చేస్తూ ఉత్తర్వులను జారీ చేసిందని, దీనిని బట్టే కేంద్ర ప్రభుత్వ వైఖరి స్పష్టమవుతుందని కూనంనేని పేర్కొన్నారు.

పశ్యపద్మ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కగార్



జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ దేశంలో అనేక ఘర్షణలు జరిగాయని, అనేక మంది చనిపోయారని, కానీ శవాలను అడ్డం పెట్టుకుని రాజకీయాలకు పాల్పడిన చరిత్ర ఎక్కడా లేదన్నారు. ఒక్కరు చనిపోతే సంబురాలు చేసుకోవడం, ఇది గర్వకారణమని చెప్పడం బిజెపి పాలకులకు మాత్రమే చెల్లిందని పేర్కొన్నారు. మనిషి బతికున్నంత వరకు మాత్రమే శత్రువని, చనిపోయిన తర్వాత శత్రుత్వం అనేది మనుస్సులో ఉండకూడదని రాముడు విభూషణడికి చేసిన హితబోధ రావణాసురుడి అంత్యక్రియలకు అదేశించిన అంశం తెలుస్తుందన్నారు.

ఆపరేషన్ పేరుతో కేంద్ర ప్రభుత్వం సృష్టిస్తున్న నరమేధాన్ని ఇప్పటికైనా నిలిపివేసి మావోయిస్టులతో శాంతి చర్చలు జరిపి ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నెల్లికంటి సత్యం మాట్లాడుతూ ప్రాణాలతో పట్టుబడిన మావోయిస్టులను పైశాచికంగా కాల్చి చంపుతూ ఆటవిక పాలన కొనసాగిస్తున్న కేంద్ర ప్రభుత్వ తీరును వామపక్షాలు తీవ్రంగా ఖండిస్తున్నాయన్నారు. జాన్ వెస్లీ మాట్లాడుతూ ఎన్‌కౌంటర్ల పేరుతో హత్యలకు పాల్పడిన వారితో పాటు మావోయిస్టుల ఏరివేతకు సమయం నిర్ణయించి ప్రోత్సహించిన హోంమంత్రి చట్టప్రకారం జైళ్లలో ఉండాలన్నారు. ఆదివాసీల సమస్యలను పరిష్కరించకుండా మావోయిస్టులను చంపేసి అడవి సంపదను కార్పోరేట్ శక్తులకు అప్పగించడానికి చేస్తున్న కుట్రలను ట్రంప్ చెబితే తప్ప కేంద్ర ప్రభుత్వం ఆపేలా లేదని ఎద్దేవా చేశారు.

### బంగాళాఖాతంలో అల్పపీడనం
(మొదటి పేజీ తరువాయి)

అవకాశముందన్నారు. ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేశామన్నారు. బుధవారం జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, సిద్ధిపేట, జనగాం జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశముందన్నారు. ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేశామన్నారు. గురువారం ఖమ్మం, భాద్రాద్రి కొత్తగూడెం, ములుగు, జయశంకర్ భూపాపల్లి జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశమున్నట్లు చెప్పారు. గంటకు 40 కి.మీ. నుంచి 50 కి.మీ వేగంతో ఈదురుగాలు వీచే అవకాశం ఉందన్నారు. రాగల మూడు రోజులు గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 5 నుంచి 7 డిగ్రీలు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందన్నారు.

**హైదరాబాద్ తాకిన నైరుతి రుతుపవనాలు..**

నైరుతి రుతుపవనాలు తెలంగాణను తాకాయని, ఒకటి, రెండు రోజుల్లో తెలంగాణ మొత్తం విస్తరిస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి ధర్మరాజు తెలిపారు. తెలంగాణలోకి ఈసారి నైరుతి రుతుపవనాలు ప్రవేశించాల్సిన సమయం కంటే 17 రోజులు ముందుగానే ప్రవేశించాయన్నారు. హైదరాబాద్ నగరాన్ని రుతు పవనాలు తాకాయి. దీంతో నగరంలో ఎప్పుడైనా భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు చెప్పారు. నగరంలో పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పలు ప్రాంతాల్లో 40 నుంచి 60 మి.మీ. వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందన్నారు.

**జూన్‌లో సాధారణం కన్నా అధిక వర్షపాతం : ఐఎండి**

భారతీయ వాతావరణ శాఖ మంగళవారం కీలక ప్రకటన చేసింది. దేశవ్యాప్తంగా జూన్‌లో సాధారణం కన్నా అధిక వర్షపాతం నమోదు కానున్నట్లు చెప్పింది. జూన్ నెలలో సుమారు 108 శాతం వర్షం నమోదు అయ్యే అవకాశాలు ఉన్నట్లు ఐఎండి పేర్కొంది. అయితే ఈ వర్షాకాలంలో దేశవ్యాప్తంగా 106 శాతం వర్షపాతం ఉంటుందని, సగటును 87 సెంటీమీటర్ల వర్షం కురవనున్నట్లు ఐఎండి చెప్పింది. మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్‌కు చెందిన కార్యదర్శి ఎం రవిచంద్రన్ మీడియా సమావేశంలో మాట్లాడారు. వర్షాకాలానికి చెందిన కోర్ జోన్‌లో ఈసారి సాధారణం కన్నా ఎక్కువ ర్షం నమోదు అవుతుందన్నారు. మాన్‌సూన్ కోర్ జోన్‌లో మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశా ప్రాంతాలు వస్తాయి. నైరుతి రుతుపవనాల సమయంలో ఈ ప్రాంతానికి ఎక్కువ శాతం వర్షం వస్తుంది. ఈ ప్రాంతంలోని వ్యవసాయం మొత్తం నైరుతి మీద ఆధారపడి ఉంటుంది. వాయువ్య భారతంలో ఈసారి సాధారణ స్థాయి వర్షం ఉండనున్నది. ఈశాన్యలో ఈసారి సాధారణం కన్నా తక్కువ వర్షం ఉంటుందని ఐఎండి పేర్కొంది. సెంట్రల్‌తో పాటు దక్షిణ ద్వీపకల్ప భాగంలో సాధారణం కన్నా ఎక్కువ స్థాయిలో వర్షం పడనున్నట్లు ఐఎండి డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ మహాపాత్ర తెలిపారు.

### విద్య దూరంచేసే కుట్ర
(మొదటి పేజీ తరువాయి)

ఉంచారు. ఇక్కడే కాదు. ప్రతిచోటా అదే కుట్ర జరుగుతోంది. ఐఐటిలు, కేంద్ర విశ్వవిద్యాలయాల్లోనూ ఇదే పరిస్థితి. ఎన్‌ఎఫ్‌ఎస్ పేరుతో కేంద్రం రాజ్యాంగంపై దాడి చేస్తోంది. సామాజిక న్యాయానికి ద్రోహం చేస్తోంది' అని అన్నారు. రిజర్వేషన్లు పొందడం అనేది ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసిల హక్కు అని రాహుల్ పేర్కొన్నారు. 'నేను డియుఎస్‌యు విద్యార్థులతో మాట్లాడాను. ఇప్పుడు మనమందరం కలిసి బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ రిజర్వేషన్ వ్యతిరేక చర్యలకు రాజ్యాంగ శక్తితో సమాధానం ఇద్దాం. హిందూత్వ ప్రాజెక్ట్ పునాదులు ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసిల చరిత్రను తుడిచివేయడమే. 90 శాతం చరిత్ర మన పుస్తకాలలో ఎందుకు లేదు? మన బుక్స్‌లో 10 శాతం చరిత్ర మాత్రమే ఎందుకు ఉంది?. ఉదాహరణకు మన హిస్టరీ బుక్స్‌లో 3,000 ఏళ్లుగా దళితులను అంటరానివారిగా చూశారని, వారిని గౌరవించలేదని, మన సమాజంలో వారికి స్థానం ఇవ్వలేదని ఎందుకు లేదు?' అనిరాహుల్ ప్రశ్నించారు.

**ఢిల్లీ యూనివర్సిటీని సందర్శించిన రాహుల్ :** మే 22న రాహుల్ గాంధీ ఢిల్లీ యూనివర్సిటీని సందర్శించారు. విశ్వవిద్యాలయం నార్త్ క్యాంపస్‌లో పలువురు ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి విద్యార్థులతో ముఖాముఖిలో పాల్గొన్నారు. విద్యాపరమైన సమస్యలపై వారితో చర్చించారు. అయితే, రాహుల్ అకస్మిక పర్యటనపై ఢిల్లీ యూనివర్సిటీ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఎటువంటి సమాచారం లేకుండా విశ్వవిద్యాలయానికి వచ్చేశారని పేర్కొంది. ఇలా రెండో సారి చేశారని ఓ ప్రకటనను విడుదల చేసింది.

### కాళేశ్వరం కమిషన్ ముందుకు కెసిఆర్?
(మొదటి పేజీ తరువాయి)

ఫామ్‌హౌజ్‌కు రావాలని కోరడమా అనే దానిపై మాత్రం స్పష్టత రావాల్సి ఉంది. మాజీ సిఎం తర్వాత 6వ తేదీన మాజీ మంత్రి హరీశ్‌రావుకు, 9వ తేదీన మరో మాజీ మంత్రి ఈటల రాజేందర్‌కు కమిషన్ విచారణకు హాజరు కావాలని ఇప్పటికే నోటీసులు జారీచేసింది.

### జస్టిస్ సుజయ్‌పాల్ బదిలీ
(మొదటి పేజీ తరువాయి)

జస్టిస్ అభిషేక్‌రెడ్డిలు తెలంగాణ హైకోర్టుకు బదిలీ అయ్యారు. దేశవ్యాప్తంగా వివిధ హైకోర్టుల నుంచి 21 మంది న్యాయమూర్తులను ఇతర హైకోర్టులకు బదిలీ లేదా స్వంత హైకోర్టులకు బదిలీ చేస్తూ సుప్రీం కోర్టు కొల్లీజియం సిఫార్సు చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్ నేతృత్వంలోని కొల్లీజియం సోమవారం నాడు సమావేశమై ఈ మేరకు సిఫార్సు చేసినట్లు సుప్రీం కోర్టు వెబ్‌సైట్‌లో ప్రకటను జారీ చేశారు. ఇందులో భాగంగా మద్రాస్ హైకోర్టు నుంచి జస్టిస్ బట్టు దేవానంద్‌ను ఎపి హైకోర్టుకు బదిలీ చేశారు.

### కొత్త దళపతి ఎవరు?
(మొదటి పేజీ తరువాయి)

మిలటరీ సెంట్రల్ కమీషన్ బాధ్యతల్లో ఉన్నారు. అగ్రవర్ణానికి చెందిన మల్లోజుల వేణుగోపాల్ వయసు కూడా 70 సం.లు. కాగా ఈయన స్వయానా సీనియర్ నాయకుడు మల్లోజుల కోటేశ్వరరావు సోదరుడు. కోటేశ్వరరావును ఇప్పటికి కూడా పెద్దనాయకునగా మావోయిస్టు పార్టీ భావిస్తుండటంతో పాటు సీనియర్ల మద్దతు కూడా లభించే అవకాశం ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. వేణుగోపాలరావు అలియాస్ సోను ప్రస్తుతం పార్టీ సైద్ధాంతిక విభాగానికి చీఫ్‌గా పనిచేస్తున్నారు. ఇప్పుడు వయస్సు మీదపడ్డ వారు ఆయుధాలు వదలి జనజీవన స్రవంతిలో కలిసేందుకు సిద్ధంగా లేరనే వాదన కూడా ఉంది. దీంతో సీనియార్టీ ప్రాతిపదికన పగ్గాలు కట్టబెడతారని భావిస్తున్నారు. వయోభారం. అనారోగ్య సమస్యలు, క్లిష్ట పరిస్థితుల సవాళ్ల నడుమ ఆపార్టీ దళపతి ఎంపిక కత్తిమీద సాములా మారింది.

**కేంద్రకమిటీలో తగ్గిన సభ్యుల సంఖ్య**

మావోయిస్టు పార్టీ అవతరించిన రోజులకు ఇప్పుడు కేంద్రకమిటీతో పాటు పోలిట్‌బ్యూరోలో సభ్యుల సంఖ్య తగ్గిపోయింది. మావోయిస్టు పార్టీ అవతరించిన రోజుల్లో 34 మంది సభ్యులు ఉండగా 16 మంది పోలిట్ బ్యూరో సభ్యులు ఉండేవారు. ప్రస్తుతం కేంద్ర కమిటీలో కేవలం 17 మంది సభ్యులు మాత్రమే ఉండగా, పోలిట్‌బ్యూరోలో కేవలం ఐదుగురు మాత్రమే ఉన్నటు తెలుస్తోంది. పార్టీ మాజీ చీఫ్ ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి, మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ అభయ్, తిప్పరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ, మిసేర్ బెస్రా, పశ్చిమ బెంగాళ్‌కు చెందిన రాంజా,ఝూర్ఖాండ్‌కు చెందిన మిసేర్‌బెస్రా ఉన్నారు. పై ముగ్గురు తెలంగాణ ప్రాంతం వారు. వీరే కాకుండా కేంద్రకమిటీలో తెలంగాణకు చెందిన మల్లా రాజిరెడ్డి, కడారి సత్యనారాయణ రెడ్డి, గాజర్ల రవి, మోడెం బాలకృష్ణ, పల్లూరి ప్రసాదరావు, సాగా హన్మంతు, కట్టా రామచంద్రారెడ్డి, పోతుల కల్పన ఉండగా, ఏపికి చెందిన తెంటు లక్ష్మీ నర్సింహాచలం, ఝూర్ఖాండ్‌కు చెందిన వివేక్ చంద్రయాదవ్, పరిరాం మాంజీ, పశ్చిమబెంగాళ్‌కు చెందిన రాంజా,సబ్యసాచి గోస్వామి ఉన్నారు. పలు సంఘటనలు అనేక సమీకరణాల నేపథ్యంలో మావోయిస్టు పార్టీ అవతరించిన నాటి నుండి నేటి పరిస్థితులను పోలిస్తే కేంద్ర కమిటీలోని సభ్యులు సంఖ్య దాదాపు సగమే. ఇదిలా ఉండగా పోలిట్ బ్యూరోలోని ఒకరు కేంద్ర కార్యదర్శి అయ్యే ఛాన్స్ కనిపిస్తోంది. కాగా ప్రస్తుతం కేంద్రకమిటీలోని నేతలంతా 1980 దశకంలో ఉధ్యంలోనికి అడుగుపెట్టిన వారే.

**తెలుగేతర నాయకత్వానికి అవకాశం**

మావోయిస్టు పార్టీ అగ్రనేతగా తెలుగేతర వ్యక్తికి అవకాశం దొరకొచ్చేనే వాదన వినిపిస్తోంది. మావోయిస్టు కేంద్రకార్యదర్శిగా వరుసుగా రెండు సార్లు తెలుగురాష్ట్రాలకు చెందన ఉండటంతో ఈ సారి మార్పు చేసే అవకాశం ఉన్నటు తెలుస్తోంది. ఇందులో భాగంగా పశ్చిమబెంగాళ్‌కు చెందిన రాంజా పేరును పరిశీలనలోకి తీసుకోవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గడిచిన దశాబ్దకాలంగా మావోయిస్టు పార్టీకి ఆదివాసీలు, ప్రధానంగా మహిళలు వెన్నుదన్నుగా ఉన్నారు. ఆపరేషన్ కగార్ మొదలైన నాటి నుండి ఎక్కువగా మహిళా మావోయిస్టులే యుద్ధంలో ప్రాణాలు కోల్పోతున్నారు. దీంతో సెంట్రల్ రీజన్ బ్యూరోగా ఉన్న మాధవి అలియాస్ సుజాత పేరు కూడా ప్రతిపాదనకు వచ్చే ఛాన్స్ ఉన్నట్లు భావిస్తున్నారు. మరో ప్రక్క ఛత్తీస్‌గఢ్‌లో పూంవర్తికి చెందిన మాడావి హిడ్మాకు సెంట్రల్ మిలటరీ కమీషన్ (సిఎంసి) బాధ్యతలు అప్పగింస్తారని ప్రచారం సాగుతుండగా, ఈయన ప్రస్తుతం పిఎల్‌జిఏ బెటాలియన్ 1కి కమాండర్‌గా ఉన్నారు.

ప్రస్తుతం మావోయిస్టు పార్టీ ఎదుర్కొంటున్న పరిస్థితుల దృష్ట్యా వారు ప్రాణాలు కాపాడుకోవడమే ఏకైక లక్ష్యంగా ఉంది. అబూజ్మడ్ అడవుల్లో తలదాచుకున్న మావోయిస్టులు అగ్రనేతలు ప్రస్తుతం అష్ట దిగ్బంధంలో చిక్కుకున్నారు. బస్తర్ రీజన్‌లో బలగాల నిర్భంధం పెరగడంతో అక్కడ ఉండలేక, బయకు వెళ్లలేక తీవ్ర సంక్లిష్ట పరిస్థితుల్లో ఉండగా లొంగిపోవడమా, ప్రాణాలు కోల్పోవడమా అనేలా ఉంది. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో మావోయిస్టు పార్టీ కొత్తదళపతి ఎంపిక ఎంతో కీలకం.

### గిగ్ వర్కర్లకు అవకాశం
(మొదటి పేజీ తరువాయి)

పరిశీలించి సంబంధిత జిల్లా కలెక్టర్లకు వెంటనే పంపేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం జూన్ 2న రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారులకు మంజూరు పత్రాల (సాంక్షన్ లెటర్ల) పంపిణీ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో మంగళవారం రాజీవ్ యువ వికాసం పథకం అమలు ప్రగతిని డిప్యూటీ సిఎం సమీక్షించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం మాట్లాడుతూ జూన్ 10 నుంచి 15వ వరకు జిల్లా, నియోజకవర్గ స్థాయిలో ఓకే సారీ రాష్ట్రవ్యాప్తంగా శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. జూన్15వ తేదీ తర్వాత గ్రౌండింగ్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ప్రతి నెలా ఈ కార్యక్రమం చేపట్టి దశలవారీగా పూర్తి చేయాలని, జిల్లా ఇన్చార్జి మంత్రులు, కలెక్టర్లతో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు సమన్వయం చేసుకోవాలన్నారు. గత పదేళ్లలో సంక్షేమ శాఖలను, రాష్ట్ర యువతను గాలికి వదిలేసారని డిప్యూటీ సిఎం విమర్శించారు. దేశ చరిత్రలోనే ఇది ఒక రికార్డు, ఏ రాష్ట్రంలోను ఒక సంవత్సరంలో స్వయం ఉపాధి కోసం రూ.8 వేల కోట్లు ఖర్చు చేసిన దాఖలాలు లేవని ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం గుర్తుచేశారు. ఇంతటి గొప్ప కార్యక్రమం ఇందిరమ్మ రాజ్యంలో సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ద్వారానే సాధ్యమైందన్నారు. ఈ పథకాన్ని విజయవంతం చేసేందుకు వారం కిందనే ఎస్‌ఎల్‌బిసి సమావేశం నిర్వహించామని, ఆ తర్వాత సంక్షేమ శాఖ అధికారులు బ్యాంకర్లతో తరచూ మాట్లాడుతూ ఈ స్వయం ఉపాధి పథకాన్ని చివరి దశకు చేర్చారని అభినందించారు. ఉన్నతస్థాయి సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ఆర్థికశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్‌కుమార్ సుల్తానియా, ఎస్‌సి కార్పోరేషన్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్, బిసి సంక్షేమ శాఖ కమిషనర్ బాల మాయాదేవి, మైనారిటీ సంక్షేమ శాఖ కమిషనర్ యాస్మిన్ భాషా, డిప్యూటీ సిఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## ఆ నలుగురు తప్ప ఎవరూ మిగలరు

ఫిషర్‌మెన్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బిఆర్‌ఎస్ గురించి 10 నిమిషాలు ఆలోచిస్తే బిఆర్‌ఎస్ పార్టీలో ఆ నలుగురు తప్ప ఎవరూ మిగలరని ఫిషర్‌మెన్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ అన్నారు. గాంధీ భవన్‌లో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాము ఇంకా ఏమి అనుకోలేదని, తాము అనుకుంటే బిఆర్‌ఎస్ ఊహించిన దానికంటే ఎక్కువ పరిణామాలు ఉంటాయని, కెటిఆర్ భాషలోనే తమ సమాధానం ఉంటుందన్నారు. బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ మాటలు అదుపులో పెట్టుకుని పొదుపుగా మాట్లాడాలన్నారు. తెలంగాణ రాజకీయ వ్యవస్థలో కెటిఆర్ అజ్ఞాని అని, తెలంగాణకు కెటిఆర్ శకుని పాత్ర పోషిస్తున్నాడన్నారు. తెలంగాణ భవన్‌లో కూర్చొని చిల్లర మాటలు మాట్లాడుతున్నారన్నారు. డ్రగ్స్ టెస్టుకు సిద్ధమా అనే ఛాలెంజ్‌కు భయపడ్డ కెటిఆర్‌కు రేవంత్ రెడ్డిని, కాంగ్రెస్‌ను విమర్శించే నైతిక హక్కు లేదన్నారు. తెలంగాణ సమాజాన్ని పదేళ్లు కొరివి దెయ్యం మాదిరిగా పీల్చుకుని తిన్నది బిఆర్‌ఎస్ పార్టీయేనన్నారు.

## సిఆర్ ఫౌండేషన్‌లో డాక్టర్లకు సిపిడి క్లాసులు ఏర్పాటు




**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** ప్రపంచ ఫ్యామిలీ డాక్టర్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని కొండాపూర్‌లోని చంద్ర రాజేశ్వర్‌రావు ఫౌండేషన్ ఫర్ సోషల్ ప్రోగ్రెస్ (సిఆర్ ఫౌండేషన్)లోని సిఆర్ పాలి క్లినిక్‌లో ప్రపంచ డాక్టర్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిఆర్ పాలి క్లినిక్ డాక్టర్ కె.రజనీ కార్యక్రమంలో పాల్గొని తెలంగాణ ఫ్యామిలి డాక్టర్స్‌ను అహ్వానించి తెలంగాణ ఎఎఫ్‌పిఐ, సిఆర్ పాలి క్లినిక్ ఆధ్వర్యంలో డాక్టర్స్ చాప్టర్ క్లాసెస్, సిపిడి క్లాసులను నిర్వహించారు. అనంతరం విచ్చేసిన ప్రముఖ డాక్టర్ల సలహాలు, సూచనలు ప్రతి ఒక్కరితో పంచుకున్నామని దీని ద్వార రోగులకు అవసరమైనటువంటి చికిత్సలు, మెలుకువలు ప్రతి డాక్టర్ గ్రహించారని తెలిపారు. కార్యక్రమంలో సిఆర్ పాలి క్లినిక్ అడ్వైజర్ డాక్టర్ బి రంగారెడ్డి పాల్గొని తన సందేశాన్ని అందించగా డాక్టర్ గిరిజ, డాక్టర్ కవిత, ఇతర డాక్టర్లు ఒక్కొక్క అంశం గురించి వివరించారు. తదుపరి సందేశాలను వివరించి ప్రతి డాక్టరును సన్మానించారు.కార్యక్రమంలో ప్రముఖ డాక్టర్లు పాల్గొన్నారు.

# మరణం మొదటిది కాదు.. ద్రోహం కొత్త కాదు

### మావోయిస్టు అంతర్థాన చర్చ దశాబ్దాలది

ఇప్పుడు దేశంలో, రాష్ట్రంలో భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ఉద్యమం, మనుగడ భవిష్యత్తు చర్చ సాగుతుంది. కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజ్ ఎన్‌కౌంటర్ తర్వాత ఈ చర్చ మరింత పదునెక్కింది. ఒక ద్రోహి దళం నుంచి పారిపోయి పోలీసులకు సమాచారం ఇవ్వడం వల్లనే ఈ నష్టం జరిగిందని మావోయిస్టు పార్టీ విడుదల చేసిన లేఖలో పేర్కొన్నారు. ఐదున్నర దశాబ్దాల సాయుధ పోరాటంలో నంబాల కేశవరావు మరణం మొదటిది కాదు. లేఖలో పేర్కొన్నట్లు ద్రోహం కొత్తది కాదు. హత్యలు విజేతను తేల్చలేవని తెలిసినా అటు మావోయిస్టులు ఇటు పోలీసులు ఈ పంథాను వీడడం లేదు. కొందరిని హతమారిస్తే సమసమాజం రాదన్న వాస్తవాన్ని మావోయిస్టులు, కొందరిని ఎన్‌కౌంటర్‌తో విప్లవోద్యమాన్ని ఆపలేమని పోలీసులు తెలుసుకోలేకపోతున్నారు. ఒకవేళ తెలిసినా ఆ పంథాను వీడడం లేదు. 1999లో నల్లా ఆదిరెడ్డి, యర్రం సంతోష్‌రెడ్డి, శీలం నరేష్‌లు ఎన్‌కౌంటర్‌లో మరణించినప్పుడు అప్పటి పీపుల్స్ వార్ మనుగడపై తీవ్ర చర్చ సాగింది. అప్పుడే ముప్పాల లక్ష్మణ్‌రావు, గణపతి లొంగిపోతున్నారని పీపుల్స్‌వార్‌ది గత చరిత్రే అన్నారు. ఇప్పటి అమిత్‌షా మాదిరే అప్పటి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి చెన్నమనేని విద్యాసాగర్‌రావు రాష్ట్ర హోంమంత్రి దేవేందర్‌గౌడ్‌లు ఆలోచించారు. ఆదిరెడ్డి ప్రభృతులు ఎన్‌కౌంటర్ తర్వాత మల్లోజుల కోటేశ్వరరావు, మల్లా రాజిరెడ్డి, నంబాల కేశవరావు లాంటి వారు ఎదిగి నాయకత్వ స్థానాల్లోకి వచ్చారు. ఉద్యమ వారసులు ఏరి అన్న ప్రశ్నకు సమాధానంగా నిలిచారు. ఇదే సమయంలో కెఎస్ వ్యాస్, పరదేశీ నాయుడు, ఉమేష్‌చంద్ర మొదలైన పోలీస్ అధికారులను హతమార్చిన తర్వాత సాయుధోద్యమానికి ఒరిగింది లేదు. పోలీసులు ఇన్ఫార్మర్లను ఏర్పాటు చేసుకుని దళాలను మట్టు పెట్టాలనే యోచనలో తాత్కాలిక ఫలితాలు వచ్చి ఉండవచ్చు కానీ దళాలను తుద ముట్టించడం సాధ్యం కాలేదు. ఇన్‌ఫార్మర్లను హతమార్చిన తర్వాత మావోయిస్టులకు ఆ ఇబ్బంది తొలగి పోలేదు. ద్రోహం, విప్లవోద్యమ పంథా నుంచి వెనుతిరగడం లాంటివి ఇప్పటి మావోయిస్టులకైనా అప్పటి పీపుల్స్ వార్‌కైనా కొత్త కాదు. సాయుధోద్యమానికి ప్రతీకగా చెప్పుకునే కొండపల్లి సీతారామయ్య, కెజి సత్యమూర్తి లాంటి వారు బయటకు వచ్చిన తర్వాత ఇంకెక్కడి పోరాటం అన్నవారు లేకపోలేదు. ఉద్యమ తొలి నాళ్లలోనే పంచాది కృష్ణమూర్తి, వెంపటాపు సత్యం లాంటి వారు ఎన్‌కౌంటర్‌లో మరణించిన నిలదొక్కుకున్నారు. అనేక మంది లొంగిపోయారు. దళాన్ని మొత్తం మట్టుపెట్టి పోలీసుల పంచన చేరిన సమ్మయ్యలు, నాయక్‌లు పీపుల్స్‌వార్‌కు చెందిన వారే. పీపుల్స్ వార్ నేతలను చంపి పోలీసులకు లొంగిపోయి హల్‌చల్ చేసిన మాజీ నక్సల్స్ ఎందరో ఉన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఆ పేర్లను ఇంకా ప్రజలు మరిచిపోలేదు. అందుకే ద్రోహం మావోయిస్టులకు కొత్త కాదు. ఎదురుదెబ్బ తగిలిన ప్రతిసారి మావోయిస్టు ఉద్యమంపై చర్చ సాగుతూనే ఉంది. అలాంటి పరిస్థితులు ఏర్పడిన ప్రతిసారి ఉద్యమం నిలదొక్కుకున్నది. కానీ ఇప్పుడు పరిస్థితి గతానికి భిన్నంగా ఉంది. కేంద్ర ప్రభుత్వం ఔనన్నా కాదన్నా సైనిక బలగాలతో అంతర్ యుద్ధానికి తెర లేపింది. వేల సైన్యాలు దండకారణ్యాన్ని జల్లెడ పడుతున్నాయి. మావోయిస్టుల ఏరివేత, భూగర్భ సంపద వెలికితీత ఏక కాలంలో జరిగేందుకు కేంద్ర ప్రభుత్వం సమాయత్తం అయింది. అనుకూల పరిస్థితుల నేపథ్యంలో మావోయిస్టులు శాంతి చర్చల డిమాండ్ తెరపైకి వచ్చింది. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరి తీవ్ర విమర్శలకు తావిస్తుంది. ఆపరేషన్ కగార్ తర్వాత మూడు విషయాలకు సంబంధించి ఫలితాలు ఎలా ఉంటాయన్నది కూడా చర్చనీయాంశాలుగా మారాయి. ఒకటి 2026 మార్చి 31 నాటికి మావోయిస్టు ఉద్యమం అంతమవుతుందా...?, రెండవది ఆదివాసీల మనుగడ కొనసాగుతుందా...? అడవిపై మాత్రమే ఆధారపడి బతికే గిరిజనులు పచ్చటి అడవిలో యంత్రాల రణగొణ ధ్వనుల మధ్య ఎలా బతుకుతారు అన్నది కూడా చర్చగా సాగుతుంది. ఇప్పటికే 200 హెక్టార్లలో భూ గర్భ గనుల వెలికితీతకు అడవిని శుభ్రం చేస్తున్నారన్న వార్త నేపథ్యంలో ఆక్సిజన్ హబ్‌గా చెప్పుకునే దండకారణ్యం అన్న మాట గతమే అవుతుందా. మొత్తంగా విజేతను తేల్చని యుద్ధంలో ఇప్పుడు ప్రభుత్వానిది పైచేయిగా ఉంది. నక్సలిజం శాంతిభద్రతల సమస్యగా కాకుండా సామాజిక, ఆర్థిక కోణంలో చూసినప్పుడే ఈ సమస్యకు పరిష్కారం తప్ప లేనట్లయితే నడుస్తూనో, పరిగెడుతూనో ఉద్యమం కొనసాగుతూనే ఉంటుంది.



– ఏనుగు వెంకటేశ్వరరావు, ఖమ్మం

# 'కగార్ ఆపరేషన్'పై న్యాయ విచారణ జరపాలి






ఎన్‌కౌంటర్‌లను సుప్రీంకోర్టు సుమోటోగా తీసుకోవాలి

బూటకపు ఎన్‌కౌంటర్ వల్లే శవాలను ఇచ్చేందుకూ భయం

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

హామీల అమలుకు పోరాడాలి : సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి

**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కగార్ ఆపరేషన్‌పై న్యాయ విచారణ జరపాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. మంగళవారం హనుమకొండ జిల్లా సిపిఐ మహాసభల రెండవ రోజు హసన్‌పర్తి మండల కేంద్రంలో జరిగిన ప్రతినిధుల సభను ఉద్దేశించి కూనంనేని సాంబశివరావు మాట్లాడారు. కేంద్రం చేసిన బూటకపు ఎన్‌కౌంటర్‌లపై సుప్రీంకోర్టు సుమోటోగా తీసుకోవాలని కోరారు. చత్తీస్‌ఘడ్‌లో జరిగింది బూటకపు ఎన్‌కౌంటర్ అయినందువల్లనే నక్సల్ శవాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించేందుకు భయపడుతున్నారని విమర్శించారు. ఈ దేశ పౌరులను చంపిన టెర్రరిస్టులను పట్టుకోవడంలో బిజెపి ప్రభుత్వం విఫలం అయిందని, అందుకే దేశ పౌరులైన మావోయిస్టులను చంపి ప్రధాని నరేంద్ర మోడీ సంబురాలు చేసుకుంటున్నారని అన్నారు. సిపిఐ ఆవిర్భవించి ఈ ఏడాది డిసెంబర్ 25 నాటికి వందేళ్లు కావస్తుందని, వందేళ్ల ముగింపు బహిరంగ సభను ఖమ్మంలో ఐదు లక్షల మందితో నిర్వహించనున్నట్లు తెలిపారు.

**హామీల అమలుకు పోరాడాలి : చాడ వెంకట్ రెడ్డి**

తొలుత సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి ప్రతినిధుల సభను ప్రరంభించి ప్రసంగించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీల అమలుకు పోరాడాలని అన్నారు. అలాగే ఆపరేషన్ కగార్ పేరుతో, వక్ఫ్ బిల్లు పేరుతో దాడి తీవ్రం చేస్తూ ముస్లింలు, క్రిష్టియన్‌లను, కమ్యూనిస్టులను శత్రువులుగా చూస్తున్నారన్నారు.

**వరంగల్‌ను రెండవ రాజధానిగా ప్రకటించాలి : తక్కళ్లపల్లి**

రెండవ రోజు సిపిఐ మహాసభల సందర్భంగా జరిగిన ప్రతినిధుల సభను ప్రారంభించిన అనంతరం సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంలో మన పాత్ర ఉందని, అసెంబ్లీలో సిపిఐకి ఒక్క ఎమ్మెల్యే ఉన్నప్పటికీ ప్రజల సమస్యలపై గళమెత్తడంలో ముందున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేదంటే సిపిఐ ఆద్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. హైదరాబాద్ తరువాత అతిపెద్ద నగరంగా ఉన్న వరంగల్ ను రాష్ట్ర రెండో రాజధానిగా ఏర్పాటు చేసేందుకు అసెంబ్లీలో తీర్మానం చేయాలని, హైదరాబాద్ మాదిరిగా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షుడు నేదునూరి రాజమౌళి మాట్లాడుతూ హసన్ పర్తి మండలంలో అనేక పోరాటాలు నిర్వహించిన చరిత్ర సిపిఐకి ఉందన్నారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి ఇప్పటి వరకు పార్టీ నిర్వహించిన కార్యకలాపాల నివేదికను ప్రవేశ పెట్టారు. తొలుత సిపిఐ జిల్లా మహాసభల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సిపిఐ పతాకాన్ని సీనియర్ నాయకులు మోతె లింగారెడ్డి ఎగురవేశారు. ఈ మహాసభకు అధ్యక్షవర్గంగా మంచాల రమాదేవి, బత్తిని సదానందం, మెట్టు శ్యామ్ సుందర్ రెడ్డి, ఉట్కూరి ప్రణీత్ గౌడ్, వేల్పుల సారంగపాణి, మాలోతు శంకర్ వ్యవహరించగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి, వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి, జిల్లా మాజీ కార్యదర్శి సిరబోయిన కర్ణాకర్, జిల్లా సహాయ కార్యదర్శులు షేక్ బాష్ మియా, పనాస ప్రసాద్, తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి, ఎన్.అశోక్ స్టాలిన్, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

### సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శిగా కర్రె భిక్షపతి




హనుమకొండ జిల్లా సిపిఐ కార్యదర్శిగా కర్రె భిక్షపతి తిరిగి ఎన్నికయ్యారు. హసన్‌పర్తి మండల కేంద్రంలో రెండు రోజుల పాటు జరిగిన పార్టీ ద్వితీయ జిల్లా మహాసభలలో కర్రె భిక్షపతి రెండవ సారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయనతో పాటు జిల్లా సహాయ కార్యదర్శులుగా తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్ తిరిగి ఎన్నికయ్యారు. జిల్లా కార్యవర్గ సభ్యులుగా 17 మంది, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా 45 మందిని ఏకగ్రీవంగా మహాసభలలో ఎన్నుకున్నారు.

## రేపు ఉద్యోగుల సబ్ కమిటీ సమావేశం



ఉద్యోగుల సమస్యలను డిప్యూటీ సిఎం భట్టికి వివరించిన అధికారులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఈనెల 29న సబ్ కమిటీ సమావేశం నిర్వహిస్తాం, ఆ సమావేశంలో ఉద్యోగ సంఘాలు లేవనెత్తిన అంశాలు, వాటి పరిష్కారానికి సంబంధించిన సమాచారాన్ని సబ్ కమిటీ సమావేశంలో వివరించాలని అధికారుల కమిటీని రాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రి, ఉద్యోగుల సమస్యల పరిష్కార సబ్ కమిటీ చైర్మన్ మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఇటీవల సిసిఎల్‌ఎ కార్యదర్శి నవీన్ మిట్టల్, పంచాయత్ రాజ్ సెక్రెటరీ లోకేష్ కుమార్, ట్రాన్స్‌కో సిఎండి కృష్ణ భాస్కర్‌లతో కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ఇటీవల ఉద్యోగ సంఘాల నేతలతో సమావేశమై వారి సమస్యలపై విజ్ఞాపనలు స్వీకరించారు. ఉద్యోగ సంఘాలు లేవనెత్తిన సమస్యలకు సంబంధించిన సమాచారాన్ని మంగళవారం ప్రజాభవన్‌లో డిప్యూటీ సిఎం, ఉద్యోగుల సమస్యల పరిష్కార సబ్ కమిటీ చైర్మన్ మల్లు భట్టి విక్రమార్కకు వివరించారు.

## భారతదేశ సంస్కృతీ సంప్రదాయాలు ప్రపంచానికి ఆదర్శం

కంది ఐఐటి 'కల్చరల్ ఫెస్ట్'లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



**ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి :** దేశ సంస్కృతి సంప్రదాయాలు ప్రపంచానికి ఆదర్శమని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. కంది ఐఐటి కల్చరల్ ఫెస్ట్‌కు ముఖ్య అతిథిగా పాల్గొని కల్చరల్ ఫెస్ట్‌ను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ భారత సంస్కృతి సంప్రదాయాలలోనే సమాఖ్య విదానం ధర్మం ఉందన్నారు. గురువు దీపం లాంటి వారు అని ప్రపంచంలో ఎక్కడ లేని విధంగా గురు శిష్య బంధం ఉందని తెలిపారు. భారతదేశం 5000 సంవత్సరాల చరిత్ర కలిగి ఉందన్నారు. కల్చరల్ ఫెస్ట్ అనేది ఒక ఉద్యమంగా కొనసాగుతుందన్నారు. భారతదేశ సాంప్రదాయాల్లో కుటుంబ పెద్దలకు, గురువులను గౌరవించే పద్దతి ఉందన్నారు. ఈ ఫెస్ట్‌లో 240 మంది కళాకారులు పాల్గొంటున్నారని దేశ వ్యాప్తంగా వివిద కళలో ప్రముఖులు పాల్గొంటున్నారని తెలిపారు. జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ భారత దేశం అనేది ప్రపంచంలోనే అత్యంత పురాతనమైన వైవిద్యభరితమైన సంస్కృతుల కలయికగా నిలిచిందని భారతీయ సంస్కృతి అనేది మతాలు, భాషలు, వర్ణాలు, కులాలు ,ప్రాంతాలు కలిసిన సమ్మేళనమని అన్నారు. కరీంనగర్‌లో తాను మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న కాలంలో కూచిపూడి నృత్యాన్ని నేర్చుకునే వీలు కలిగిందని గుర్తు చేసుకున్నారు. శాస్త్రీయ సాంస్కృతిక విలువల ద్వారా గురువుకి ,దేవుడికి ,భూమాతకు కృతజ్ఞత తెలుపుకునే అవకాశం పరోక్షంగానే కలుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఐటి హైదరాబాద్ డైరెక్టర్ బీ.ఎస్ మూర్తి పద్మవిభూషణ్, పండిట్, హరిప్రసాద్, చౌరసియా, పద్మభూషణ్ డాక్టర్‌లతో పాటు 200 మంది సంగీత ప్రముఖులు పాల్గొన్నారు.

## జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు

బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జూన్ 2వ తేదీన తెలంగాణ వ్యాప్తంగా ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు నిర్వహించాలని పార్టీ శ్రేణులకు బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. అన్ని జిల్లా కార్యాలయాలతో పాటు నియోజకవర్గాలు, మున్సిపాలిటీలు, పట్టణాలు, మండలాల్లో జాతీయ జెండాను, పార్టీ పతాకాన్ని ఎగరేసి పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించాలన్నారు. పార్టీ సీనియర్ నాయకులు, శ్రేణులంతా పాల్గొనాలని, ప్రజలతో కలిసి అవతరణ వేడుకలు ఘనంగా జరపాలని కోరారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జూన్ 2వ తేదీన పార్టీ వ్యవస్థాపక సభ్యులు, శాసనమండలిలో ప్రతిపక్ష నేత మధుసూదన చారి పాల్గొని జాతీయ జెండాను, పార్టీ పతాకాన్ని ఆవిష్కరిస్తారని, ఈ వేడుకల్లో పార్టీ సీనియర్ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. అమరుల త్యాగాలు, ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థుల పోరాటాలు, సబ్బండ వర్గాల సమిష్టి కృషితోనే ఆరు దశాబ్దాల కల సాకారం అయిందన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ చేసిన ప్రతి ఆలోచన అనేక రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర సర్కార్‌కు కూడా దిక్సూచిగా నిలిచిందన్నారు. తెలంగాణ గడ్డపై పురుడు పోసుకున్న రైతు బంధు, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ వంటి పథకాలు దేశానికే దారిచూపే దీపస్తంభంలా నిలవడం ప్రతి తెలంగాణ బిడ్డకు గర్వకారణమని కెటిఆర్ అన్నారు.

## రాష్ట్ర కీర్తిని ప్రతిబింబించేలా అవతరణ వేడుకలు

ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ఆవిర్భావ విజయోత్సవాలను తెలంగాణ కీర్తి ప్రతిబింబించేలా నిర్వహించాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించి ప్రణాళికా బద్ధంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. మంగళవారం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సమన్వయ సమావేశం జరిగింది. జూన్ 2న రాష్ట్ర అవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా సిఎం రేవంత్ రెడ్డి అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పించడం, పెరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న జెండా వందనం, మార్చ్ ఫాస్ట్, ప్రసంగం, అధికారులకు మెడల్స్ పంపిణీ కార్యక్రమాలపై ఈ సందర్భంగా డిప్యూటి సిఎం సమీక్ష నిర్వహించారు. సిఎం రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు ప్రధానంగా హైదరాబాద్ ఆ తర్వాత జిల్లా కేంద్రాల్లో ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రాల్లో ఇంఛార్జీ మంత్రు లు, ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లోను రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల నిర్వాణపై సమీక్షించారు. ఈసారి అవతరణ ఉత్సవాలకు రాష్ట్ర అతిథులుగా జపాన్ మేయర్, మిస్ వరల్డ్ విజేతలు హాజరు కానున్నారని తెలిపారు. ఎన్నికల కోడ్ మూలంగా గత ఏడాది పెద్ద ఎత్తున అవతరణ దినోత్సవ వేడుకలు నిర్వహించలేకపోయ్యామని, ఈసారి విజయోత్సవాలు ఘనంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర కీర్తిని ప్రతిబింబించేలా అన్ని శాఖల అధికారులు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. చీఫ్ సెక్రెటరీ రామకృష్ణారావు ఆవిర్భావ దినోత్సవ వేడుకల ఏర్పాట్లను నిరంతరం సమీక్షిస్తారని తెలిపారు. ఏర్పాట్లకు సంబంధించిఏ అధికారికైనా ఎలాంటి ఇబ్బందులున్నా ఉత్సవాలుగొప్పగా నిర్వహించేందుకు మంచి ఆలోచనలు ఉన్నా నేరుగా తనను సంప్రదించవచ్చని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డిజిపి జితేందర్, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, స్పెషల్ సిఎస్‌లు వికాస్ రాజ్, రఘునందన్ రావు, సమాచార శాఖ కమిషనర్ హరీష్, పోలీస్ అధికారులు సివి ఆనంద్, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైరా మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ మృతి



**ప్రజాపక్షం/ఖమ్మం :** ఖమ్మం జిల్లా వైరా మాజీ ఎంఎల్‌ఎ, బిఆర్‌ఎస్ నేత బానోత్ బానోత్ మదన్ లాల్ (62) మంగళవారం గుండెపోటుతో హైదరాబాద్‌లోని ఎఐజి ఆసుపత్రిలో మరణించారు. మూడు రోజుల క్రితం అనారోగ్యానికి గురైన ఆయనను కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చేర్పించారు. మంగళవారం తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో గుండెపోటు రావడంతో ఆయన తుదిశ్వాస విడిచారు. మదన్‌లాల్‌కు భార్య మంజుల, కుమారుడు మృగేందర్‌లాల్, కుమార్తె మనీషాలక్ష్మి ఉన్నారు. కుమారుడు తమిళనాడులోని కొయంబత్తూరులో జిఎస్‌టి ప్రత్యేకాధికారిగా పని చేస్తుండగా, కోడలు శ్వేత కొయంబత్తూర్ జాయింట్ కలెక్టర్‌గా పని చేస్తున్నారు. మదన్‌లాల్ అంత్యక్రియలను బుధవారం ఈర్లపుడిలో నిర్వహించనున్నారు.

ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం ఈర్లపుడి గ్రామంలో జన్మించిన మదన్‌లాల్ విద్యార్థి దశలో పిడిఎస్‌యు నాయకునిగా పనిచేశారు. ఉపాధ్యాయునిగా, పోలీసుగా పని చేసిన ఆయన,ప్రభుత్వ ఉద్యోగాన్ని వదిలి 1995లో రాజకీయాల్లోకి ప్రవేశించి ఎంపిటిసి, సర్పంచ్‌గా పని చేశారు. 2009లో వైరా నియోజక వర్గం ఏర్పడినప్పుడు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గణనీయమైన ఓట్లు సాధించారు. 2014లో వైసిపి నుంచి పోటీ చేసి విజయం సాధించారు. అనంతరం టిఆర్‌ఎస్‌లో చేరి 2018, 2023 ఎన్నికల్లో ఓటమి చవి చూశారు.

**సిఎం, ప్రతిపక్ష నేత సంతాపం**

మాజీ ఎంఎల్‌ఎ మదన్‌లాల్ మృతి పట్ల సిఎం రేవంత్ రెడ్డి ఒక ప్రకటనలో సంతాపం తెలియజేశారు. ఆయన కుమారుడు మృగేందర్ లాల్‌తో ప్రతిపక్ష నేత కెసిఆర్ ఫోన్‌లో మాట్లాడారు. బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి తదితరులు మదన్‌లాల్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ ఎంపి నామ నాగేశ్వరరావు, ఎంపి వద్దిరాజు రవిచంద్ర, ఎంఎల్‌సి తాతా మధు, వైరా ఎంఎల్‌ఎ రాందాస్ నాయక్, తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

**మదన్‌లాల్‌కు సిపిఐ నేతల నివాళి**

ఖమ్మంజిల్లా రాజకీయాల్లో ప్రజా సమస్యల పట్ల అవగాహన కలిగి నిబద్ధతతో పనిచేసే ప్రజా నాయకున్ని కోల్పోయామని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు అన్నారు. ఆయన భౌతికకాయానికి బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



## ట్రంప్ వ్యాపారాలను అనుమతించొద్దు

కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన వి.ఎస్.బోస్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ వ్యాపారాలను భారత్‌లో అనుమతించరాదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్.బోస్ డిమాండ్ చేశారు.. పాకిస్తాన్‌తో యుద్ధం మొదలు అనేక సందర్భాల్లో భారత్ సార్వభౌమతాన్ని కించే పర్చేలా చేస్తున్న ట్రంప్ తన వ్యాపారాలలో ఒకటైన ట్రంప్ టవర్స్ అనే పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారంలో భారతదేశానికి వస్తున్నట్లుగా వార్తా ప్రచారం జరుగుతుందని, ఇదినిజమైతే అనుమతించారని ఆయన పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడుగా ట్రంప్ 2వ సారి బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన తీసుకుంటున్న నిర్ణయాలు భారతదేశానికి వ్యతిరేకంగా, తలవంపులు తెచ్చేవిగా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మన దేశం నుండి చదువుకోవటానికి, ఉద్యోగాల నిమిత్తం అమెరికా వెళ్ళిన విద్యార్థులను భారతదేశానికి పంపటం అతి దారుణమైన విషయమని ఆయన పేర్కొన్నారు. కొత్తగా అమెరికాలో నివసిస్తున్న భారతీయులు వారి తల్లిదండ్రుల జీవనం కోసం లేక ఇతర అవసరాల కోసం డబ్బులు పంపటం అనేక సంవత్సరాలుగా కొనసాగుతున్న ప్రక్రియ ట్రంప్ అధికారం చేపట్టిన అమెరికా నుండి మన దేశానికి అక్కడి పంపుతున్న డబ్బులపై 5శాతం పన్ను విధించటం దుర్మార్గమైన చర్య అన్నారు. గతంలో భారతదేశ అవసరాల కోసం సోలార్ ప్యానల్స్ గురించి గ్లోబల్ టెండర్స్ భారత్ పిలిస్తే ఆ టెండర్‌లో అతి తక్కువ ధరకు చైనా సోలార్ ప్యానల్ అందిస్తామని ప్రకటిస్తే దానిని అమలు చేయరాదంటూ భారత్‌పై ఒత్తిడి తీసుకురావడం ద్వారా ఆపార నష్టం కలుగజేసిన భారతద్రోహి డొనాల్డ్ ట్రంప్ అని ఆయన మండిపడ్డారు. "నీ మిత్రుడెవరో నీవు చెపితే, నీ వ్యక్తిత్వం ఏమిటో నేను చెపుతాను'' అన్న సామెత ప్రకారం ట్రంప్ తన మిత్రుడిగా పదే పదే ప్రకటించుకోవటంతో మోడీ వ్యక్తిత్వం ఏమిటో భారత ప్రజలు అర్థం చేసుకోవాలని బోస్ కోరారు.

అదనపు జిల్లా కలెక్టర్ [షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ] చైర్మన్
జిల్లా కొనుగోలు కమిటీ సంగారెడ్డి జిల్లా

R.C.No.C1/37/2025 టెండర్ ప్రకటన తేదీ : 26.05.2025

సంగారెడ్డి జిల్లాలోని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖకు చెందిన వసతి గృహములకు 2025–26 సంవత్సరమునకు సామాగ్రి మరియు కిరాణాసరుకులు సరఫరా చేయుటకు సీల్డ్ టెండర్లు కోరబడుచున్నాయి. టెండర్ ఫారం షెడ్యూల్ మరియు సరఫరా యొక్క నియమ నిబంధనల పత్రములు రూ. 3000/– (రూపాయలు మూడు వేలు) ప్రతి టెండర్ ఫారముకు డిమాండ్ డ్రాఫ్ట్ ద్వార ఉప సంచాలకులు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ, సంగారెడ్డి జిల్లా పేరున చెల్లించి తేది 28.05.2025 నుండి 08.06.2025 మధ్యాహ్నం 3 గం.ల లోపు ఉప సంచాలకులు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయము, సంగారెడ్డి పొందవచ్చును. సీల్డ్ టెండర్లు తేది 10.06.2025 మధ్యాహ్నం 3 గం.ల వరకు స్వీకరించబడును. ఇట్టి సీల్డ్ టెండర్లు అదనపు కలెక్టర్ గారి సమక్షంలో 12.06.2025 సాయంత్రం 4 గం.లకు టెండర్ దారుల సమక్షంలో తెరవబడును. గమనిక: 1. ప్రతీ టెండర్ దారుడు తప్పనిసరిగా తాను సరఫరా చేయబోయే అన్ని వస్తువుల సాంపుల్స్‌తో టెండర్ నందు పాల్గొనవలెను. సాంపుల్స్ తేనట్టి టెండర్ దారుడిని అనుమతించడం జరగదు. 2. ప్రతీ టెండర్ దారుడు తప్పనిసరిగా ఈ.యం.డీ ని తమ తమ టెండరు ఫారమునకు జత చేయవలసి ఉంటుంది. 3. టెండర్లు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖకు సంబంధించిన అన్ని వసతి గృహములకు కలిపి వేయవలెను.

Sd/– అదనపు కలెక్టర్/చైర్మన్ తరఫున జిల్లా కొనుగోలు కమిటీ, సంగారెడ్డి జిల్లా

DIPR R.O.No: 2594-PP/CL/ADVT/1/2025-26 Date: 27-05-2025

ప్రజాపక్షం
బుధవారం, మే 28

# భళారే! ప్రకృతి చిత్రం!!

నైరుతి రుతుపవనాలు తెలంగాణ రాష్ట్రంలో సోమవారం ప్రవేశించాయి. సాధారణంగా జూన్ 1వ తేదీకి కేరళను తాకే రుతుపవనాలు క్రమంగా ఓ 10 రోజుల్లో జూన్ 8,9 లేదా 10వ తేదీకి తెలంగాణలో ప్రవేశించటం రివాజు. కేరళ నుంచి బెంగళూరు, రాయలసీమ మీదుగా మహారాష్ట్ర వైపు ప్రయాణించే వర్ష పవనాలు మధ్యలో తెలంగాణలో ప్రవేశిస్తాయి. ఈ సంవత్సరం సాధారణ సగటు వర్షపాతం కంటే కొంచెం ఎక్కువగానే వర్షాలు కురుస్తాయని, వ్యవసాయానికి ఎంతో మేలు జరుగుతుందని భారత వాతావరణ శాఖ(ఐఎండి) ముందస్తు జోస్యం మరీ ముందస్తుగానే ఫలించినట్లయింది. రుతుపవనాలకన్నా ముందుగా అక్కడక్కడ చెదురుమదురు వర్షాలు పడతాయి. కాని ఈ పర్యాయం అరేబియా సముద్రం నుండి దక్షిణాదివరకు అల్పశ్రేణి ద్రోణి ఏర్పడటంతో తమిళనాడుతోపాటు బెంగళూరు, బొంబాయి తడిసి ముద్దయినాయి. వర్షపునీరు ఏరులైపారగా పల్లపు ప్రాంతాలు యధావిధిగా నీటమునిగి వర్షాకాలంకన్నా ముందే కష్టాలు వచ్చిపడ్డాయి. దక్షిణాంధ్రలో కూడా భారీ వర్షాలే పడ్డాయి. ఉత్తర, దక్షిణ తెలంగాణలో అకాల వర్షాలకు వరిధాన్యం తడిసి రైతుల కళ్ల కన్నీరు నిండింది.

సాధారణం కన్నా దాదాపు రెండు వారాల ముందుగా తొలకరి వర్షాలు రావటమన్నది అరుదైన లక్షణం. అప్పుడెప్పుడో ఏభైఏళ్ల క్రితం ఒకసారి ఇలా జరిగిందట. ముంబయిలో అయితే 75 సంవత్సరాల క్రితం ఒకసారి రుతుపవనాలు ముందుగా వచ్చాయని రికార్డులు చెబుతున్నాయి. 1918 తర్వాత తొలిసారి మే నెలలో 295 మిల్లీమీటర్ల వర్షపాతాన్ని కొలాబా అబ్జర్వేటరీ సోమవారం రికార్డు చేసింది. రుతుపవనాల ప్రవేశంతో ఈ వర్షం కురిసింది. తెలంగాణలో సోమవారం ఏడు జిల్లాల్లో నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయని వాతావరణ శాఖ ధృవీకరించింది. మంగళవారం ఇంకా చాలా జిల్లాలకు విస్తరిస్తాయని చెప్పింది. రంగారెడ్డి జిల్లాలోని చందనవల్లి, కేతిరెడ్డిపల్లి, మొయినాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లోని సల్కార్‌పేట, నారాయణ్‌పేట జిల్లాలోని మొగలమడ్క, మక్తల్, ఉట్కూర్, నాగర్‌కర్నూలు జిల్లాలోని కొల్లాపూర్, వనపర్తి జిల్లాలోని ఖిల్లా ఘనపూర్‌లలో సోమవారం భారీ వర్షం కురిసింది. రెండు–మూడు రోజుల పాటు అనేక జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండి హెచ్చరిక జారీ చేసింది.

రెండు వారాలు ముందుగా రుతుపవనాలు వర్షించటం, వేసవిలోనే వాతావరణం చల్లబడటం జనజీవితాలకు ఆహ్లాదకరం. కాని భవిష్యత్ వర్షాలపై దీని ప్రభావం ఎలా ఉంటుందో శాస్త్రజ్ఞులు ఇతమిద్ధంగా చెప్పలేకపోతున్నారు. మంచే జరుగుతుందన్న ఆశాభావం మాత్రం వ్యక్తమవుతోంది.

ఇదిలావుండగా, భారత వాతావరణశాఖ సోమవారం 'భారత్ ఫోర్‌కాస్ట్ సిస్టం' (బిఎస్ఎఫ్) అనే కొత్త వ్యవస్థను ఆచరణలోకి తెచ్చింది. ఇది పంచాయతీ స్థాయి వరకూ మరింత కచ్చితంగా వర్షపాతాన్ని ముందుగా చెప్పేందుకు దోహదకారి అవుతుంది. ఇది స్వల్ప, మధ్యకాలికంగా – అనగా మూడు, ఏడు రోజులు ముందుగా వర్షం గూర్చి కచ్చితమైన హెచ్చరికలు జారీ చేసేందుకు సహాయకారి అవుతుంది. వ్యవసాయదారులకు, గ్రామీణులకు ఇది ఎంతో ప్రయోజనకారి అవుతుం ది. దీర్ఘకాలికం – అనగా నెల రోజుల ముందుగా వర్షపాత హెచ్చరికల జారీకి అవసరమైన 34 డాప్లర్ వెదర్ రాడార్లను వచ్చే సంవత్సరంలో నెలకొల్పుతామని ఐఎండి డైరెక్టర్ జనరల్ ఎం. మహాపాత్ర చెప్పారు. ప్రస్తుతం నెలకొల్పిన స్వల్ప, మధ్యకాలిక వ్యవస్థలను 2002 నుంచి పరీక్షిస్తున్నట్లు ఎర్త్ సైన్సెస్ మంత్రిత్వశాఖ కార్యదర్శి ఎం.రవిచంద్రన్ చెప్పారు. 6కి.మీ/6కి.మీ రిజల్యూషన్‌లో వాతావరణ అంచనాలు వెల్లడించే వ్యవస్థను ఆచరణలోకి తెచ్చింది భారత్ ఒక్కటే కావటం విశేషం.

# ప్రపంచ జిడిపిలో 4వ స్థానం, తలసరి జిడిపిలో 136వ స్థానం


ఎం. కోటేశ్వరరావు

జపాన్‌ను వెనక్కు నెట్టేసి మన దేశం ప్రపంచ జిడిపిలో నాలుగో స్థానానికి చేరిందని, రెండున్నర లేదా మూడు సంవత్సరాల్లో జర్మనీని కూడా పక్కనపెట్టి మూడవ స్థానానికి వెళతామని నీతిఆయోగ్ సిఇఒ బివిఆర్ సుబ్రమణ్యం చేసిన ప్రకటనకు మీడియాలో పెద్ద స్పందనే వచ్చింది. అనేకమంది సంతోషిస్తున్నారు. ఇదొక గొప్పా అని పెదవి విరిచేవారు కూడా ఉన్నారు. నూటనలభై కోట్ల జనాభాలో ఈలెక్కల ఆల్జిబ్రా ఎంతమందికి అర్థం అవుతుంది? "నేను చెప్పినట్లుగా మనది నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ, నాలుగు లక్షల కోట్ల ఆర్థికం, ఇది నేను చెబుతున్న సమాచారం కాదు. ఐఎంఎఫ్ చెబుతున్నది, జపాన్ కంటే పెద్ద ఆర్థిక వ్యవస్థ'' అని సుబ్రమణ్యం నీతి అయోగ్ పాలక మండలి పదవ సమావేశంలో ప్రకటించారు. మనం రూపొందించిన పథకం ప్రకారం జరిగితే రెండు, రెండున్నర, మూడు సంవత్సరాల్లో మనది మూడవ పెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతుంది అన్నారు. ఐఎంఎఫ్ ఏప్రిల్ 22 సమాచారం ప్రకారం వర్తమాన ధరల్లో సాధారణ (నామినల్) జిడిపి అమెరికా 30.51లక్షల కోట్ల డాలర్లు, చైనా 19.23, జర్మనీ 4.74, భారత్ 4.19, జపాన్ 4.19, బ్రిటన్ 3.84, ఫ్రాన్సు 3.21, ఇటలీ 2.42, కెనడా 2.23, బ్రెజిల్ 2.13లక్షల కోట్లతో మొదటి పది స్థానా ల్లో ఉన్నాయి. 2025 –26 నాటికి మన జిడిపి 4.187.017, జపాన్‌లో 4.186.431 బిలియన్ డాలర్లుగా అంచనా వేసింది. బొమ్మను పాలకు లు ఎలాగూ చూపించారు, వారు మూసిపెట్టే బొరుసు ఎలా ఉందో చూడాలి కదా!





నరేంద్రమోడీ అధికారానికి వచ్చిన తరువాత 2015లో 2.1లక్షల కోట్ల డాలర్ల నుంచి 2025లో దేశ జిడిపి 4.3లక్షల కోట్ల డాలర్లకు చేరినట్లు, ఇది 105శాతం పెరుగుదల అని ఐఎంఎఫ్ కొద్ది నెలల క్రితం చెప్పింది. అదే సంస్థ తాజాగా విడుదల చేసిన అంచనా లో ఆ మొత్తాన్ని 4.187 లక్షల కోట్లకు తగ్గించింది. జపాన్ మొత్తం 4.186 గనుక దాన్ని పక్కన పెట్టి మనకు నాలుగో స్థానాన్ని ఇచ్చింది. తేడా ఎంత 0.001 లక్షల కోట్లు. చెవులప్పగించేవారుంటే కాకమ్మ కతలు చెప్పేవారికి కొదవ ఏముంది. బిజెపి పెద్దలు 2025 నాటికి ఐదు లక్షల కోట్ల డాలర్లకు పెంచుతామని గొప్పలు చెప్పుకు న్న అంశం ఇక్కడ గుర్తుకు తెచ్చుకోవాలి. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఇంతటి అభివృద్ధిని ఏ ప్రభుత్వమూ సాధించలేదని కూడా బిజెపి ఐటి సెల్ మాలవీయ చెప్పారు.అలా ప్రచారం చేయటమే కదా ఆ పెద్దమనిషి ఉద్యోగం. వాస్తవం ఏమిటి, 2004లో మన్మోహన్ సింగ్ అధికారానికి వచ్చినపుడు జిడిపి 709 బిలియన్ డాలర్లు కాగా 2014 నాటికి అది 2030 బిలియన్లకు పెరిగింది. యుపిఏ పాలనా కాలంలో పెరుగుదల రేటు 186శాతమని, 105కంటే ఎక్కువని కాస్త నిజాయితీ ఉన్నవారు కూడా చెబుతారు.

గతంలో ప్రధాని చెప్పిన కొన్ని అతిశయోక్తుల గుర్తు చేసుకుందాం.''గత పదేండ్లలో జిడిపిని రెట్టింపు చేయటం అంకెలు కాదు, 25కోట్ల మందిని దారిద్ర్యరేఖ దాటించి నూతన మధ్యతరగతిని సృష్టించాం. వారు కొత్త జీవితాన్ని ప్రారంభించారు, సచేతనంగా ఆర్థిక వృద్ధికి తోడ్పడుతున్నారు''. ప్రధాని నోటినుంచి జాలువారిన ఈ మాటలను చూసి నవ్వాలా ఏడవాలో తెలియటం లేదు. ఇరవై ఐదు కోట్లమందిని దారిద్ర్యరేఖ నుంచి ఎగువకు లాగాం అంటూనే కనీసం ఆహార ధాన్యాలు కొనుగోలు చేయలేని స్థితిలో ఉన్న 80కోట్ల మందికి ఉచితంగా ఆహార భద్రతా పథకం కింద గోధుమలు, బియ్యం ఇస్తున్నామని, మరికొన్నేండ్లు ఇస్తామని ఒక ఘనతగా చెప్పుకుంటారు. ప్రపంచ ఆకలి సూచికలో తాజాగా 127లో 105వ దేశంగా ఉన్నాం. ఆకలి లేని(9.9), స్వల్ప (10నుంచి 19.9), తీవ్రం(20నుంచి 34.9), ఆందోళనకరం(35నుంచి49.9), అత్యంత ఆందోళనకరం (50పైన) అనే ఐదు తరగతులుగా దేశాలను విభజిస్తే మన దేశం తీవ్ర తరగతిలో అంతకు ముందు, గత పదేండ్లుగా కూడా ఉంది. పదేండ్లలో జిడిపి రెట్టింపు అని ఇతర గొప్పలు కానీ పది సంవత్సరాల్లో 2014 నుంచి 2024వరకు మన ఆకలి సూచిక స్కోరు 28.2 నుంచి 27.3కు మాత్రమే తగ్గింది, దీనిలో అంత అభివృద్ధి ఎందుకు రాలేదు? ఇదే కాలంలో పాకిస్తాన్ స్కోరు 29.6 నుంచి 27.9కి తగ్గింది, దీని గురించి చెబితే ఈ దేశంలో పుట్టీ, ఈ దేశంలో పెరిగీ, అన్నం తింటూ పక్కదేశాన్ని పొగుడుతున్నట్లు ఎదురు దాడి చేస్తారు. పాక్ ర్యాంకు మన తరువాత 109, ఆకలిని ఎవరు ఎక్కువగా తగ్గించినట్లు? గత పదేండ్లలో చైనా స్కోరు ఐదు కంటే తక్కువే ఉందన్న వాస్తవాన్ని చెబితే నానా యాగీ చేస్తారు. మోడీ సాధించిన విజయాలు మీకు పట్టవా అంటారు కొందరు. నిజమే 188 దేశాల జిడిపిలో మనలను నాలుగవ స్థానంలోకి తీసుకు వెళ్లిన ఘనత మోడీ ఖాతాలో వేద్దాం. అదే తలసరి జిడిపిలో 136వ స్థానంలో ఉంచిన ఘనుడని కూడా కీర్తించాలా! తలసరి జిడిపి కూడా నిజానికి ఒక మైండ్‌గేమ్ తప్ప మరొకటి కాదు. కొందరి దగ్గర సంపదలు పోగుపడటం అంటే ఆర్థిక అసమానతలు పెరుగుతున్నట్లే, మోడీ ఏలుబడిలో పెరిగినట్లు స్పష్టంగా తేలింది. గోచిపాతరాయుడు సంపద ఒక రూపాయి, 50, 49 చొప్పున అంబానీ, అదానీల సంపదలు ఒక దగ్గర చేర్చి మూడుతో భాగిస్తే వచ్చే 33 గోచిపాతరాయుడి సంపద అంటే నవ్విపోతారు. అంబానీ ఇంట వివాహానికి విమానాలు, హెలికాప్టర్లు వేసుకొని వచ్చిన అతిధులు గోచిపాతరాయుడి ఇంటికి వస్తారా !

అసలు జిడిపి చర్చలోకి వెళితే బుర్ర బద్దలవుతుందంటే అతిశయోక్తి కాదు. దీన్ని సాధారణ(నామినల్), పిపిపి(పవర్ పర్చేజింగ్ పారిటీ)పద్ధతుల్లో లెక్కిస్తున్నారు. రెండవదే వాస్తవానికి దగ్గరగా ఉంటుందన్నది కొందరి సమర్థన. దాని ప్రకారం చూస్తే నరేంద్ర మోడీ అధికారానికి వచ్చే నాటికే మన దేశం సాధారణంలో పది, రెండవ లెక్కలో మూడవ స్థానంలో ఉంది. మోడీ గణం రెండవ లెక్కలను ఎందుకు చెప్పటం లేదు. ఎందుకంటే దేశాన్ని ఇప్పటికీ అదే స్థానంలోనే మోడీ ఉంచారు గనుక. ఐఎంఎఫ్ 2025 పిపిపి అంచనా ప్రకారం చైనా 42.72, అమెరికా 30.51, భారత్ 17.65 లక్షల కోట్ల డాలర్లతో మూడవదిగా, రష్యా నాలుగు, జపాన్ ఐదవదిగా ఉంది. 2027 తొలి ఆరునెలల్లోనే సాధారణంలో 4.9లక్షల కోట్ల డాలర్లతో జర్మనీని కూడా దాటించేస్తారని ఊదరగొడుతున్నారు. అవన్నీ గిడసబారిన దేశాలుగా మారుతున్నాయి. దున్నబోతే దూడల్లో మెయ్యబోతే అంబోతుల్లో అన్నట్లుగా చెప్పుకుంటే కుదరదు. మనం పోల్చుకోవాల్సింది చైనాతో కదా! మన వృద్ధి రేటు చైనా, అమెరికా, జర్మనీ కంటే ఎక్కువగా ఉందని, గడచిన పదేండ్లలో భారత్ 105 శాతం పెరుగుదల సాధించగా చైనా 76, అమెరికా 66, జర్మనీ 44, ఫ్రాన్సు 38, బ్రిటన్ 28శాతం పెరుగుదల సాధించాయని ఐఎంఎఫ్ చెప్పింది. లక్ష కోట్ల డాలర్ల కిలోమీటర్(మైలు) రాయిని దేశం 2007లో దాటింది. తదుపరి 2014లో రెండు లక్షల కోట్లు, 2025లో నాలుగు లక్షల కోట్లు దాటింది. 2032నాటికి పదిలక్షల కోట్ల డాలర్ల జిడిపి కలిగిన దేశంగా మారుతుందని కొందరు ఆర్థికవేత్తలు జోశ్యం చెప్పారు. వారి తర్కం ఏమిటి? 2021లో మూడు లక్షల కోట్లకు విస్తరించింది. కేవలం నాలుగు సంవత్సరాల్లోనే 4.3లక్షల కోట్ల డాలర్లకు చేరింది. ప్రతి 18నెలలకు ప్రస్తుత వేగంలో ఒక లక్ష కోట్ల డాలర్లు పెరుగుతున్నది. ఇదే కొనసాగితే 2032 నాటికి 10లక్షల కోట్ల డాలర్లకు చేరుతుంది.


రానున్న కొద్ది సంవత్సరాల్లో మూడవ పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించబోతున్నందుకు ఇప్పటి నుంచి సంబరాలు జరుపుకుంటున్న వారిని చూసి ఆర్థిక నిపుణుడు డి ముత్తుకృష్ణన్ ఉత్సవాలు జరుపుకోవాల్సినంత ఘనత ఏమి సాధించామని 2024లోనే ప్రశ్నించారు. జిడిపిలో ఏ స్థానంలో ఉన్నామన్నది కాదు తలసరి రాబడిలో ప్రపంచంలో మనం 140వ స్థానంలో ఉన్నామని, మనకంటే 139దేశాలు ముందున్నాయని గుర్తించాలని చెప్పారు.(తాజాగా 136 గనుక 135 ముందున్నాయి) పిపిపి ప్రకారం చూసినా మన స్థానం 119 అని చెప్పారు. పదేండ్లలో మన జిడిపి 105శాతం పెరిగిందని ఏ ఐఎంఎఫ్ చెప్పిందో అదే సంస్థ 2025 తలసరి జిడిపిలో 141వ స్థానం అని కూడా జోశ్యం చెప్పింది. దివాలా తీసిందని చెప్పిన శ్రీలంక 133, బంగ్లాదేశ్ 143, పాకిస్తాన్ 159, షీ జింపింగ్ ఏలుబడిలో కుప్పకూలిపోయిందని కొంతమంది చెప్పే చైనా 71వ స్థానంలో (తాజాగా 70) ఉందని కూడా ఐఎంఎఫ్ చెప్పింది. మన తలసరి రాబడి పదివేల డాలర్లకు చేరాలంటే కనీసం 30 సంవత్సరాలు కష్టపడి పని చేయాలని, దానికి అనుకూలమైన ఆర్థిక పరిస్థితులు ఉండాలని ముత్తు కృష్ణన్ చెప్పారు. చైనా తలసరి జిడిపి 2025లో 13,873 డాలర్లు, ఇప్పుడున్న మన 2,937 డాలర్ల నుంచి ఎదిగి ప్రథమ స్థానంలో ఉన్న మొనాకో 2,56,581(2023 ప్రపంచ బ్యాంకు సమాచారం) లేదా డాలర్ దేవుడున్న అమెరికా 89,678 (2025 ఐఎంఎఫ్)స్థాయికి, అధిగమించే దూరం ఎంతోలేని చైనాను అయినా కనీసం అధిగమించాలంటే ఎంత సమయం పడుతుందో వేరే చెప్పనవసరం లేదు.

ప్రపంచ సవాళ్లు ఉన్నప్పటికీ నరేంద్రమోడీ నాయకత్వం కారణంగా ప్రపంచ వెలుగు దివ్వెగా భారత్ ముందుకు వచ్చిందని బిజెపినేత ప్రదీప్ బండారీ చెప్పిన మాటలు భజనరాయుళ్ల గళం తప్ప మరొకటి కాదు.

# తెలంగాణ వైతాళికుడు
## సురవరం ప్రతాపరెడ్డి


ములక సురేష్
9441327666

తెలంగాణలో కవులే లేరన్న గుడుంబ వెంకట రాఘవాచార్యుల నిందా వాఖ్యలకు ఆయన కళ్ళు ఎర్రబడ్డాయి, కాళ్లు ఊరూరు తిరిగాయి, చేతులు కవుల సాహిత్యాన్ని సేకరించాయి. కొద్దిరోజుల్లోనే 354 మంది కవుల జీవిత చరిత్రలు, వారి రచనలతో గోల్కొండ కవుల సంచిక వెలువరించి 'ఇది కదా తెలంగాణ మాగాణంలో విరబూసిన సాహిత్యం' అంటూ తెలంగాణ ఆత్మగౌరవ పతాకాన్ని ఎగరేసాడాయన. ఆయనే తెలంగాణ వైతాళికుడు, ఉద్యమకారుడు, అభ్యుదయవాది సురవరం ప్రతాపరెడ్డి.



గోల్కొండ పత్రిక సంపాదకుడిగా, నిజాం తెలుగు ప్రజల్లో చైతన్యం తెచ్చిన దివిటి. పరిశోధకుడు, సాహితీవేత్త, చారిత్రక పత్రిక సంపాదకుడు, గ్రంథాలయ ఉద్యమ రూపశిల్పి, ఆంధ్రుల మహసభ ఉద్యమ భాగస్వామి, సంఘసంస్కర్త, విమర్శకుడు, కవి, కథా రచయిత, నవలాకర్త, సాంఘిక చరిత్ర నిర్మాత, జానపద సాహిత్య ఉద్ధారకుడు, రాజకీయవేత్త ఇలా బహుముఖ ప్రజ్ఞాశాలి. తెలంగాణలో కవుల గొంతుకను వినిపించిన గోల్కొండ ఫిరంగి. తెలుగు జాతిని చైతన్యపరిచేందుకు మొక్కవోని దీక్షతో పనిచేసిన ఆయన గుర్తుకురాగానే ఆంధ్ర మహాసభ, గోల్కొండ పత్రిక, గోల్కొండ కవుల సంచిక, ఆంధ్రుల సాంఘిక చరిత్ర, హైదరాబాద్ విమోచన ఉద్యమం మొదలైనవి గుర్తుకు వస్తాయి. తెలంగాణ గౌరవానికి భంగం కలిగించే విధంగా ఎవరు ప్రవర్తించినా నిర్మొహమాటం గా సమాధానం చెప్పిన సాహసి సురవరం. ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేసిన అక్షర యోధుడు సురవరం.

సురవరం ప్రతాపరెడ్డి 1896 మే 28వ తేదీన మెహబూబ్ నగర్ జిల్లా బోరవెల్లి గ్రామం వాళ్ళ అమ్మమ్మ ఇంట్లో నారాయణరెడ్డి రంగమ్మ పుణ్య దంపతులకు జన్మించారు. ఆయన తొలి గురువు తండ్రి నారాయణ రెడ్డి, ఆయన కుటుంబం రాయచూర్ జిల్లా అమలాపురం తాలూకాలోని ఇటికలపాడుకు మారడంతో అక్కడ ఇంగ్లీష్ నేర్చుకునే అవకాశం లభించింది. కర్నూల్‌లో పదవ తరగతి పూర్తిచేసి హైదరాబాదులోని నిజాం కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. మద్రాసులోని రెసిడెన్సి కళాశాలలో 1920లో బిఎ పట్టా పొంది 1924లో మద్రాస్ న్యాయశాస్త్రం చదివి బిఎల్ పట్టా కూడా పుచ్చుకున్నారు సురవరం ప్రతాపరెడ్డి. పాఠశాల స్థాయిలో, కళాశాల స్థాయిలో సంస్కృత భాషపై మక్కువ ఏర్పడి గొప్ప సంస్కృత పండితునిగా రూపు దాల్చాడు. స్వయంకృషితో తెలుగు, ఉర్దూ, ఇంగ్లీష్, పార్శీ, కన్నడం, తమిళం వంటి అనేక భాషలు నేర్చుకున్న బహుభాషా పండితులు. సురవరం మద్రాసులో చదువుకుంటున్న రోజుల్లో రాజకీయ జీవితానికి శ్రీకారం చుట్టబడింది. సత్యాగ్రహ ఉద్యమం, అహింసా సిద్ధాంతం, ఖద్దర్ వస్త్రధారణ, మద్యపాన నిషేధం బాగా ఆకర్షించాయి. ఆ రోజుల్లోనే ఎన్నో వ్యాసాలు రాశారు..అవి మాతృసేవ, పినాకిని, కళ, రెడ్డి రాణి మొదలైన పత్రికల్లో ప్రచురింపబడ్డాయి. సాహిత్య అధ్యయనానికి పరిమితం కాకుండా సాహిత్య చరిత్ర పరిశోధనలతో ఆయన ఉన్నత స్థాయికి చేరుకున్నారు. ఏ పదవిని అలంకరించినా సమర్థవంతంగా నిర్వహించేవారు. ప్రతాపరెడ్డి న్యాయవాద విద్యను అభ్యసించిన తర్వాత తమ ఊర్లో ఇంటి దగ్గరే ఉండి సాహిత్య సేవ ప్రజాసేవలో గడపాలని అనుకున్నారు. కానీ రాజ బహదూర్ కొత్వాల్ వెంకటరామిరెడ్డి సురవరంను రెడ్డి హాస్టల్ నిర్వహించడానికి ఆహ్వానించాడు. అయితే సురవరం తనకు పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలని కోరారు. కొత్వాల్ అంగీకరించారు. ముఖ్యంగా సామాజిక చైతన్యం రగిలించేలా ప్రముఖులతో ప్రసంగాలు ఏర్పాటు చేశారు. ఆనాటి కమ్యూనిస్టు కాంగ్రెస్ ఉద్యమకారులకు ఈ రెడ్డి హాస్టల్ పుట్టినిల్లు. తెలంగాణ సాయుధ పోరాట యోధులు, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర పోరాట యోధులు, కవులు, రచయితలు ఈ హాస్టల్ నుండి ఉద్భవించారు. ఉద్యమాలు ఉవ్వెత్తున ఎగిసిపడడానికి రెడ్డి హాస్టల్ కార్యకలాపాలు కారణం.

1921లో ఆంధ్ర జన సంఘం ఏర్పాటులో కీలక భూమిక వహించాడు. తదుపరి నాటి తెలంగాణ ప్రజలను చైతన్యపరచడానికి పత్రికనే ప్రధానవాహికని భావించి తెలంగాణలో ఒక పత్రిక తేవాలని తపన సురవరంను వెంటాడుతూ ఉండేది. అప్పుడు రాజభాషగా, పాలన భాషగా, వ్యవహార భాషగా ఉర్దూ ఉన్నది. ఈ నేపథ్యంలో తెలుగు భాషకు తెలుగు ప్రజలకు జరుగుతున్న అన్యాయాలను తెలపడానికి తెలంగాణ ప్రజలను మేల్కొల్పడానికి పత్రిక ముఖ్యమైన పాత్ర పోషిస్తుందన్న ఆలోచనతో పత్రికను తీసుకురావాలని తీర్మానించుకున్నారు సురవరం. అప్పటికి ఉర్దూ భాషలోనే నిజాం, జామిన్, రయ్యత్ పత్రికలు వచ్చేవి. తెలుగు భాషలో కొన్ని పత్రికలు వచ్చినప్పటికి రాష్ట్రవ్యాప్తంగా వచ్చినటువంటి పత్రిక లేదు. 1926లో సురవరం ప్రతాపరెడ్డి తెలంగాణలో తెలుగు భాష వికాసానికి దోహదపడే విధంగా గోల్కొండ పత్రికను వెలువరించారు. మొదట గోల్కొండ పత్రికను రెండు సంచికలు వారపత్రికగా వెలువరించినా తరువాత దినపత్రికగా జనం ముందుకు వచ్చింది. నిజాం రాష్ట్రంలో గోల్కొండ పత్రిక ప్రజల కరదీపికగా పనిచేసింది. గోల్కొండ పత్రిక వెలువడానికి ముఖ్య కారకులు కొత్వాల్ రాజ బహదూర్ వెంకట రామిరెడ్డి, కొండ వెంకట రంగారెడ్డి, మాడపాటి హనుమంతరావు. గోల్కొండ పత్రిక వల్ల ప్రజలు చైతన్యవంతులు అవుతున్నారని భావించిన నిజాం పాలకులు గోల్కొండ పత్రికపై దాడికి ప్రయత్నించాడు. సంపాదకీయం నిషేధిస్తే ప్రపంచ ప్రముఖుల సూక్తులు ప్రచురించి తెలంగాణ ప్రజలను చైతన్య పరచడంలో ప్రధాన పాత్ర పోషించాడు సురవరం. 1930లో ఆంధ్ర మహాసభ ఏర్పాటు జరిగింది. జోగిపేటలో జరిగిన మొదటి మహాసభలకు సురవరం అధ్యక్షత వహించారు. 193234 లో సురవరం ప్రతాపరెడ్డి, మాడపాటి హనుమంతరావుతో కలిసి ఆంధ్ర మహాసభ సంయుక్త కార్యదర్శిగా పనిచేశారు. ఆ తర్వాత మందుముల రామచంద్రారావుతో కలిసి సంయుక్త కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. 1937 నిజామాబాదులో ఆంధ్ర మహాసభ రాజకీయ సంస్థగా మారిపోయింది. ఆ తర్వాత సురవరం ప్రతాపరెడ్డి సాహిత్య కార్యక్రమాలపై దృష్టి సారించి 1940లో ఆంధ్ర సారస్వత పరిషత్తును స్థాపించారు. ఆ సమయంలో ఆంధ్ర మహాసభలో చీలిక వచ్చింది. సురవరం మితవాదుల సభలో పాల్గొన్నారు.

ఆ రోజుల్లో గోల్కొండ పత్రిక కార్యాలయం సామాజిక ఉద్యమాలకు కేంద్రంగా, ఉద్యమకారులకు నిలయంగా ఉండేది. తెలంగాణలో పౌర హక్కుల నినాదాన్ని తీసుకువచ్చింది సురవరం ప్రతాపరెడ్డి. ప్రభుత్వం అంటే ప్రజలేనని ప్రజలకు మేలు చేసే ప్రభుత్వమే నిజమైన ప్రభుత్వమని ప్రతాపరెడ్డి భావన. తెలంగాణలో ముఖ్యంగా తెలుగు ప్రజలకు వెలువరించినటువంటి 100 అమూల్య గ్రంథాలలో సురవరం రచించిన ఆంధ్రుల సాంఘిక చరిత్ర మొదటి గ్రంథాల్లోనే చోటుచేసుకుంది. చరిత్రకు జవాబుగా నిలిచే నూతన ఒరవడి గ్రంథం. సామాన్య ప్రజల చరిత్రను, ఆచార వ్యవహారాలను, సంస్కృతిని, ఆటపాటలను, జీవన విధానాన్ని, ఆంధ్రుల సాహిత్య సాంఘిక చరిత్రగా రాసిన చారిత్రక పరిశోధన రచయిత సురవరం. తాత్వికత పునాదిగా, శాస్త్రీయ పరిశోధన అంతర్లీనంగా చేశాడు. ఆంధ్రుల సాహిత్య చరిత్రకు గాను సురవరానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. హైందవ ధర్మ వీరులు, హిందువుల పండుగలు, రామాయణ కాలం నాటి విశేషాలు మొదలైన ఇతర గ్రంథాలు రచించాడు. భక్తతుకారం, ఉచ్ఛల విషాదము అనే నాటకాలు రాశాడు. ఇతను రాసిన కథలు మొగలాయి కథలు పేరుతో రెండు భాగాలుగా వెలువడ్డాయి. తెలంగాణలో ప్రజాస్వామ్యం అవతరించడానికి రాజకీయవేత్తగా కృషి చేయాలని సంకల్పించిన సురవరం రాజకీయ కుతంత్రాలను తట్టుకోలేకపోయారు. ఒకవైపు గోల్కొండ పత్రికలో సంపాదక బాధ్యతలు నుండి విరమించడం, మరోవైపు తాను ఎంతో గొప్ప ఆశయంతో ప్రారంభించిన ప్రజావాణి పత్రికను ఆశించిన స్థాయిలో నడపలేకపోవడం ఆయనను కలచి వేసింది. 1952లో వనపర్తి అసెంబ్లీ నుంచి పోటీచేసి గెలుపొంది ఆయన సాహిత్య ప్రపంచానికి దూరం అవుతూ వచ్చారు. చివరకు 1953, ఆగస్టు 25 నాడు పరమపదించారు. నాలుగు దశాబ్దాలపాటు సాహిత్యసేవ చేసి, తెలంగాణ ఆత్మగౌరవం కోసం నినదించి పత్రికా రంగంలో తనదైన ముద్ర వేసుకున్న సురవరం మనందరికీ ఆదర్శప్రాయులు.

# రైత్వారీ విధానం రూపశిల్పి
## సర్ థామస్ మన్రో


డా.ముచ్చుకోట
సురేష్ బాబు
9989988912

బ్రిటిష్ ఇండియా అత్యంత ప్రభావవంతమైన వలస పాలనాధికారి, దార్శనికుడు, ఆపద్బాంధవుడు, రైతు బాంధవుడు సర్ థామస్ మన్రో. మే 27, 1761న స్కాట్లాండ్‌లోని గ్లాస్గోలో జన్మించిన మన్రో, బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీలో విశిష్ట సైనికుడిగా రాజనీతిజ్ఞుడిగా పనిచేశాడు, 19వ శతాబ్దం ప్రారంభంలో మద్రాస్ ప్రెసిడెన్సీకి పరివర్తనాత్మక ముద్ర వేశారు. గ్లాస్గో విశ్వవిద్యాలయంలో అథ్లెట్‌గా జీవితం ప్రారంభించి గడిపి 1779లో, మద్రాస్ సైన్యంలో పదాతిదళ క్యాడెట్ గా భారతదేశానికి వచ్చారు. మన్రో త్వరగా ర్యాంకుల ద్వారా ఎదిగాడు, హైదర్ అలీకి వ్యతిరేకంగా తరువాత టిప్పు సుల్తాన్కు వ్యతిరేకంగా రెండవ ఆంగ్లో మైసూర్ యుద్ధంలో విశిష్ట సేవలందించాడు. 1792లో టిప్పు సుల్తాన్ నుంచి స్వాధీనం చేసుకున్న భూభాగాలను నిర్వహించటానికి సహాయం చేయడానికి ఆయన ఎంపికైనప్పుడు ఆయన సైనిక చతుర త పరిపాలన నైపుణ్యాలు తెరపైకి వచ్చాయి. 1799లో టిప్పు సుల్తాన్ పతనం తర్వాత, మన్రో అత్యంత దుర్భిక్ష ప్రాంతమైన సీడెడ్ జిల్లాల్లో పని చేశారు, అక్కడ ఆయన ప్రభుత్వానికి సాగుదారునికి మధ్య ప్రత్యక్ష భూ ఆదాయ ఏర్పాటు అయిన రైత్వారీ వ్యవస్థను ప్రారంభించారు.



1814 లో, మన్రో మద్రాస్ న్యాయ, పోలీసు వ్యవస్థలను సంస్కరించాలని ఆదేశాలతో భారతదేశానికి తిరిగి వచ్చారు. 1820 నాటికి, ఆయన మద్రాస్ గవర్నర్‌గా నియమితులయ్యా రు, ఈ పదవిలో ఆయన 20వ శతాబ్దం వరకు కొనసాగి రెవెన్యూ సేకరణ, ప్రజా పరిపాలన సుదూర సంస్కరణలు అమలు చేశారు. అతని సేవలకు గాను, మన్రో 1819లో నైట్ కమాండర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది బాత్‌గా నియమించబడ్డాడు. తరువాత 1825లో బారోనెట్‌గా నియమించబడ్డాడు.

తెలుగు మాట్లాడే ప్రజలు, మన్రోను ఆప్యాయంగా మాండ్రోలయ్య అని పిలుస్తారు, స్థానిక అధిపతులతో, పాలిగార్లు అని పిలువబడే వారితో శాంతిని నెలకొల్పడానికి ఆయన చేసిన ప్రయత్నాలకు, అలాగే సాంస్కృతిక సున్నితత్వానికి ఆయన నిబద్ధత గుర్తించబడిం ది, అటువంటి వలస పాలనాధికారులు చాలా అరుదు. ప్రధానంగా తెలుగు ప్రజలు మరువరాని తెల్లదొరలలో అగ్రగణ్యుడు సర్ థామస్ మన్రో. రాయలసీమ వాసులకు ఆపద్బాంధవుడు మన్రో. 'ప్రజల పట్ల నిజాయితీతో కూడిన సానుభూతిగల 'సునిశిత మేధావి' అని కార్ల్‌మార్క్స్ చే ప్రశంసలందుకున్న పరిపాలకుడు సర్ థామస్ మన్రో. థామస్ మన్రో రైతుల పట్ల ఎంతో ఉదారంగా వ్యవహరించాడు. రైత్వారీ విధానం ప్రవేశపెట్టి తరతరాల నుండి పాలేగాండ్ర దోపిడీకి గురై అనేక ఇబ్బందుల పాలైన రైతులను ఆదుకున్నాడు. 1804లో కడప జిల్లాకు వరదలు వచ్చినప్పుడు చెరువులను, కాలువలను సకాలం లో మరమ్మత్తు చేయించి పుష్కలంగా పంటలు పండే ఏర్పాటు చేశారు.

1807లో మన్రో తన పదవికి రాజీనామా చేసి స్వదేశానికి తిరిగి వెళ్ళాడు. మన్రో 1820 జూన్ 8 వ తేదీన మద్రాసు గవర్నర్ గా తిరిగి వచ్చాడు. అతడు పాలించిన ఏడు సంవత్సరాలు రాష్ట్రంలో విద్యాభివృద్ధికి కృషి చేశారు. కర్నూలు జిల్లాలో పర్యటిస్తూ కలరా వ్యాధి సోకి 1827, జూలై 6వ తేదీన మరణించాడు. చిత్తూరు కలెక్టర్‌గా పనిచేసిన సర్ థామస్ మన్రో పెద్ద వెండి గంగాళాన్ని తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి కానుకగా ఇచ్చాడు. దీనిని మన్రో గంగాళం అంటారు. నేటికీ స్వామివారికి దీనిలోనే నైవేద్యం పెడతారు. తాడిపత్రిలో చింతల రాయస్వామి ఆలయ ఆస్థాన మంటపాన్ని, కళ్యాణ మంటపానికి మరమ్మత్తు చేయించారు. ఆలయంలో సక్రమంగా పూజలు జరిగే ఏర్పాటు చేశారు. రాయదుర్గంలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామిని దర్శించాడు. ఆలయానికి మాన్యాలిచ్చాడు.

**రాయల సీమ అభివృద్ధికి తోడ్పాటు**

రాయలసీమ తరతరాలుగా అనావృష్టి గురియైన ప్రాంతం. ప్రకృతి వైపరీత్యాలకు తోడుగా, పిండారీ దోపిడీలు, పాలేగాండ్ర దురాగతాలు సీమ ప్రజలు నానా యాతనలు గురిచేసేవి. అశాంతితో పరితపిస్తున్న ప్రజానీకాన్ని ఆదుకొని, సీమలో శాంతిభద్రతలను నెలకొల్పిన మహనీయుడు మన్రో.దత్త మండలాల కలెక్టరుగా 1792లో జరిగిన శ్రీరంగపట్నం సంధి ప్రకారం కడప, అనంతపురం, కర్నూలు, బళ్ళారి నిజాం పాలన లోనికి వచ్చాయి. నిజాం పాలనలో అరాచకం మరింత పెరిగింది. పాలెగాళ్ళ అక్రమాలకు అంతులేకపోయింది. కడప జిల్లాలో వేముల పాలెగాడు తనను తాను రాజుగా ప్రకటించుకొన్నాడు. కొరవలు, యానాదులు, బేదర్లు, ఎరుకలు గ్రామాలపై బడి దోచుకొసాగారు. అట్టి పరిస్థితిలో 12–10–1800 న దత్త మండలాల ప్రధాన కలెక్టరుగా మన్రో నియమింపబడ్డాడు. అతని క్రింద నలుగురు సబ్ కలెక్టర్లు వుండేవారు. ఆదోని, హల్పనహళ్ళి, కడప, కంబం లో వీరి కార్యాలయాలు వుండేవి. మన్రో కు సహాయంగా మేజర్ జనరల్ దుగాల్ క్యాంబెల్ నాయకత్వంలో ప్రధాన కేంద్రాలు సైనిక దళాలుండేవి. అనంతపురం డివిజన్ మాత్రం మన్రో ఆధీనంలో ఉండేది.సిద్ధవటం లో వున్న కడప జిల్లా కార్యాలయం 1812లో కడపకు మార్చబడింది. 1828లో కంబం, దూపాడు, కోయిల కుంట్ల ప్రాంతాలను కడప జిల్లా నుండి విడదీసి కర్నూలు జిల్లాగా ఏర్పాటు చేశారు. 1911లో మదనపల్లి, వాయల్పాడు ప్రాంతాలను కడప జిల్లా నుండి విడదీసి చిత్తూరు జిల్లాగా ఏర్పాటు చేశారు.

రైతుల నుంచి ఎక్కువ శిస్తు వసూలు చేయడం న్యాయం కాదన్నాడు. భూసంబంధమైన చట్టాల ముందు, బీదలు, ధనికులు అన్న తేడా వుండరాదన్నాడు. ఎవరైనా సరే తనకున్న భూమినంతటినీ తనకున్న వనరులతో సాగు చేసుకోవచ్చు నన్నాడు. అంతవరకు గ్రామ ప్రాంతాల్లో భూముల మీద వున్న అగ్రవర్ణాల వారి పెత్తనంపై చావు దెబ్బతీశాడు. భూమి ప్రభుత్వ ఆస్తి, నిర్ణీత శిస్తు రైతులకు కౌలు కు ఇవ్వాలని ఆదేశించారు. రాయలసీమ ప్రాంతంలో తానున్న ఏడేళ్ల కాలంలో మన్రో 2,06,819 పట్టాలను రైతులకు అందజేశారు. రైతులకు భూమిపై సర్వహక్కులు వుంటాయని ప్రకటించారు. అందువల్ల భూమి సాగు గణనీయంగా పెరిగింది. ప్రభుత్వ ఆదాయం పెరిగింది.

1813లో ఛార్టర్ చట్టానికి సంబంధించిన పార్లమెంటు కమిటీ ముందు సాక్ష్యమిస్తూ, భారతదేశ సంస్కృతి అనుసరించడం వల్ల ఇంగ్లండు లాభపడుతుందన్నాడు. భారతీయులు తయారు చేసే వస్తువుల నాణ్యత, ఐరోపాతో సమానమైనదన్నాడు. భారతీయ ప్రజల పట్ల, మేధావుల పట్ల, చేతి వృత్తుల వారి పట్ల ఎంతో గౌరవముండేది.భారతీయులు తెలుగు, ఇంగ్లీషు భాషలు నేర్చుకొని ప్రభుత్వ ఉద్యోగాలు పొందడానికి వీలుగా జిల్లా తాలూకా స్థాయిలో పాఠశాలలు నెలకొల్పారు. 1805 నాటికి మన్రో తెలుగు వ్రాయను, చదవనూ నేర్చుకొన్నాడు. రాయలసీమ రైతులతో ఆయన తెలుగులో మాట్లాడేవారు. తన క్రింది అధికారులు కూడా విధిగా తెలుగులో వ్యవహరించాలని ఆదేశించాడు. సి.పి.బ్రౌన్ ఆయన మాటల కెంతగానో గౌరవించేవాడు.

# జాతీయం

NATIONAL & GENERAL NEWS

## ఇద్దరు బిజెపి ఎమ్మెల్యేలపై బహిష్కరణ వేటు..!

**బెంగళూరు :** ఇద్దరు బిజెపి ఎమ్మెల్యేలపై బహిష్కరణ వేటు పడింది. పార్టీ నియమాలను ఉల్లంఘించారనే కారణంతో బిజెపి వారిపై వేటు వేసింది. కర్ణాటకకు చెందిన ఇద్దరు బిజెపి ఎమ్మెల్యేలు ఎస్‌టి సోమశేఖర్, ఎ శివరామ్ హెబ్బర్ ఆరేసి ఏళ్లపాటు పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు ఆ పార్టీకి చెందిన కేంద్ర క్రమశిక్షణ కమిటీ తెలిపింది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. మంగళవారం వరకు వాళ్లు పార్టీకి సంబంధించిన ఏ పదవిలో ఉన్నా ఆ పదవులన్నింటి నుంచి తొలగిస్తున్నట్లు పేర్కొంది. ఈ ఏడాది మార్చి 25న ఆ ఇద్దరు ఎమ్మెల్యేలకు పార్టీ షోకాజ్ నోటీసులు ఇచ్చిందని, ఆ నోటీసులకు వారు సమాధానాలు ఇచ్చారని, వారిచ్చిన సమాధానాలను పరిగణలోకి తీసుకునే ఇప్పుడు వారిపై బహిష్కరణ వేటు వేశామని బిజెపి కేంద్ర క్రమశిక్షణ కమిటీ తెలిపింది. ఇటీవల జరిగిన రాజ్యసభ ఎన్నికల సందర్భంగా వారు పార్టీ అభ్యర్థికి వ్యతిరేకంగా ఓటు వేశారని, దానిపై షోకాజ్ నోటీసు ఇచ్చినా వారి నుంచి సరైన సమాధానం రాలేదని, అందుకే ఆ ఇద్దరిపై బహిష్కరణ వేటు వేశామని పేర్కొంది.

## 118 పాక్ కేంద్రాలు లక్ష్యంగా

# బిఎస్‌ఎఫ్ దాడులు

### ఐఎస్‌ఐ కీలక ఉగ్రవాదస్థావరాలు ధ్వంసం
### సరిహద్దుల్లో మహిళా సైనికుల మోహరింపు







**జమ్మూ:** ఆపరేషన్ సిందూర్‌లో భారత సరిహద్దు భద్రతా దళాలు (బిఎస్‌ఎఫ్) కీలకపాత్ర పోషించాయి. ఈ దాడుల సందర్భంగా బిఎస్‌ఎఫ్ పాకిస్థాన్‌కు చెందిన 118 కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేసింది. అదేవిధంగా మరో మూడు ఉగ్రవాద ప్రధాన స్థావరాలను ఆపరేషన్ సిందూర్ సందర్భంగా ధ్వంసం చేసిం ది. ఇందులో ఐఎస్‌ఐ నడుపుతున్న కీలకమైన ఉగ్రవాద కేంద్రం కూడా ఉంది. పహల్గామ్‌లో ఉగ్రవాద దాడి తర్వాత కీలకమైన జమ్మూ సరిహద్దు ప్రాంతాలలో భార త ఆర్మీని భారీగా తరలించారు. మహిళా సైనికులు కూ డా వీరిలో ఉన్నారు. వీరంతా ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు రెప్పవాల్చకుండా పహారా కాశారు. సుందర్‌బని సెక్టర్‌లో భారత మహిళా సైనికులను మరో ప్రాంతానికి తరలించాలని భావించినప్పటికి వారు మా త్రం శత్రువులకు సమీపంలోనే ఉండి వారిని ప్రతిఘటించేందుకు సిద్ధపడ్డారని బిఎస్‌ఎఫ్ ఉన్నతాధికారులు చె ప్పారు. భారత్ వైపు ప్రాణత్యాగం చేసిన మన సైనికుల స్మృత్యర్థం రెండు కేంద్రాలకు వారి పేర్లు పెట్టారు. సా ంబలో ఒక కేంద్రానికి 'సిందూర్' అనే పేరు పెట్టారు. భారత సైనికులు పాకిస్థాన్ కదలికలను, తదుపరి చర్యలను అంచనావేసేందుకు చాలా జాగ్రత్తగా సరిహద్దు ప్రాంతాలను కనిపెట్టి ఉన్నారన్నారు. బిఎస్‌ఎఫ్, ఆర్మీ, పారామిలిటరీ, జమ్మూ కశ్మీర్ పోలీస్‌సహా అన్ని భద్ర తా ఏజన్సీలు ఎంతో సమన్వయంతో పనిచేశాయని అధికారులు చెప్పారు. ఆపరేషన్ పరాక్రమ్,ఆపరేషన్ కార్గిల్ వారసత్వ స్ఫూర్తితో బిఎస్‌ఎఫ్ దళాలు సరిహద్దు ల్లో సాహసం ప్రదర్శించాయన్నారు. భారత సైనికుల ముందస్తు ఎదురుదాడి, ఆధిపత్యంవల్ల పాకిస్థాన్ రేంజ ర్లు వెనక్కుతగ్గి వెళ్ళిపోయారు. ఆపరేషన్ సిందూర్ వల్ల శత్రుదేశానికి భారీ నష్టం కలిగిందన్నారు.

భారత్‌కు చెందిన 60 కేంద్రాలపైన పాకిస్థాన్ భారీస్థాయిలో కాల్పుల యుద్ధం ప్రారంభించింది. మరో 49 ఫార్వర్డ్ పొజిషన్స్‌పై కూడా కాల్పులు ప్రారంభించింది. ఈ విధమైన దాడులు చేయడం ద్వారా దాదాపు 40,50 మంది ఉగ్రవాదులను భారతదేశంలోకి సరిహద్దులు దాటించి పంపించేందుకు అవకాశం కల్పించడంకోసం ప్రయత్నం చేసిందని, ఈ చర్యలను విజయవంతంగా సరిహద్దు భద్రతాదళం తిప్పికొట్టిందని బిఎస్‌ఎఫ్ అధికారులు మంగళవారంనాడు చెప్పారు.

భారత బిఎస్‌ఎఫ్ దళాలు పాకిస్థాన్ ప్రారంభించిన కాల్పుల దాడులకు ప్రతిగా ఆ దేశానికి చెందిన 76 సరిహద్దు ఔట్‌పోస్టులపైన, మరో 42 ఫార్వర్డ్ డిఫెన్స్ ప్రాంతాల(ఎఫ్‌డిఎల్)పైన దాడులు చేసిందని, మూడు ఉగ్రవాద కేంద్రాలను ధ్వంసం చేసిందని బిఎస్‌ఎఫ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ (డిఐజి) ఛితెర్‌పాల్ సింగ్ చెప్పారు. పాకిస్థాన్ గూఢచారి సంస్థ ఇంటర్ సర్వీసెస్ ఇంటిలిజెన్స్ (ఐఎస్‌ఐ) సుందర్‌బని సెక్టర్ సమీపంలోనే అత్యంత కీలకమైన ఉగ్రవాద కేంద్రాన్ని నడుపుతోందనీ, దానిని బిఎస్‌ఎఫ్ దళాలు ధ్వంసం చేశాయని సింగ్ చెప్పారు. తాము వాటిని ధ్వంసం చేసిన తర్వాత ఇక అలాంటి కార్యకలాపాలు సుందర్‌బనిసెక్టర్‌లో కనిపించడంలేదని చెప్పారు.

జమ్మూ సరిహద్దు బిఎస్‌ఎఫ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ శశాంక్ ఆనంద్ మాట్లాడుతూ, భారత గూఢచారి వ్యవస్థ ధృవీకరించిన సమాచారం ప్రకారం సరిహద్దు భద్రతా దళాలు పాకిస్థాన్‌లో ఉన్న ఉగ్రవాదులకు చెందిన అనేక కేంద్రాలను ధ్వసం చేశాయని చెప్పారు. భారతసైనిక దళాలు సామాన్య ప్రజలకు హాని కలగకుండా గురిచూసి చేసిన దాడుల్లో పాకిస్థాన్‌లో ఉగ్రవాదులకు, పాకిస్థానీ సైనిక రేంజర్లకు భారీ నష్టం వాటిల్లిందని, అనేకమంది మరణించారని చెప్పారు. అనేక ప్రాంతాలను అనుసంధానం చేసే వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైన ''చికెన్ నెక్'' ప్రాంతానికి ఎదురుగా పాకిస్థాన్ భూభాగంలో ఉన్న లష్కరే తోయిబాకు చెందిన అత్యంత కీలకమైన ఉగ్రవాద కేంద్రానిన మే 9,10 తేదీలలో రాత్రిపూట జరిగిన దాడుల్లో ఎందుకూ పనికిరాకుండా చేశామని చెప్పారు. భారత్‌కు ఉన్న ప్రత్యేకమైన ఆయుధ వ్యవస్థ ద్వారా లష్కరే తోయిబా ఉగ్రవాద కేంద్రాన్ని ధ్వంసం చేశామని శంశాంక్ ఆనంద్ చెప్పారు. లోనీ, మాస్త్ పూర్, ఛబ్రా ప్రాంతాలలో ఉన్న మూడు కీలక ఉగ్రవాద కేంద్రాలను నాశనం చేశామని చెప్పారు. పాకిస్థాన్‌వైపు ఎంత మేరకు భారీస్థాయిలో నష్టం జరిగిందనే విషయాలను మేం ఇప్పటికీ ఇంకా విశ్లేషణ చేస్తూనే ఉన్నాం, అసంఖ్యాకంగా ఉన్న పోస్టులను ధ్వంసం చేశాం, పాకిస్థాన్ రేంజర్లు సరిహద్దుల్లో ఉన్న అనేక పాకిస్థానీ గ్రామాలను ఖాళీచేయించి ఇతర ప్రాంతాలకు తరలించారు, ఈ విషయాలను మేం ఇంకా ఆరాతీస్తున్నాం, పూర్తి సమాచారాన్ని సమగ్రంగా సేకరిస్తున్నాం అని ఆయన చెప్పారు.


అనంత్‌నాగ్‌జిల్లా పహల్గామ్‌లో ఈ ఏడాది ఏప్రిల్ 22వ తేదీన ఉగ్రవాదులు కాల్పుల దాడులతో హింసాకాండ సృష్టించిన వెంటనే జమ్మూలోని రాజౌరీ,పూంఛ్ సహా అత్యంత కీలకమైన ప్రాంతాలలో బిఎస్‌ఎఫ్‌ను, భారత సైనిక బలగాలను కేంద్ర ప్రభుత్వం తక్షణ ప్రాతిపదికపై మోహరించింది. జమ్మూ, సాంబ, కథువా సరిహద్దు ప్రాంతాలలో పటిష్టమైన భద్రత ఏర్పాటు చేసి ఎలాంటి ఉల్లంఘనలూ శత్రుదేశం నుండి జరగకుండా రక్షణ ఏర్పాటు చేసింది. ఏప్రిల్ 22 తర్వాత పాకిస్థాన్ రేంజర్లు సమీపంలో ఉన్న కేంద్రాలవద్ద ఎక్కువగా భారత దళాలకు కనిపించడం మానేశారు. బిఎస్‌ఎఫ్ తన ఆధిపత్యాన్ని ఆ ప్రాంతాలలో ప్రదర్శించింది. భారతసైన్యంలో మహిళాబలగాలు కూడా ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండి కాపలాకాశారని శశాంక్ ఆనంద్ చెప్పారు.

డిఐజి ఇంద్రేశ్వర్ మాట్లాడుతూ, మే 8వ తేదీ రాత్రి సియాల్‌కోట్ సమీపంలో 40,50 మంది ఉగ్రవాదులుల కదలికలను బిఎస్‌ఎఫ్ గస్తీ వ్యవస్థలను కనిపెట్టాయని, సాంబా ప్రాంతంలో వారి చొరబాట్లను అరికట్టేందుకు ముందస్తుగా దాడులు చేశామని చెప్పారు. భారత సైనికుల నుండి ఊహించనివిధంగా పాకిస్థాన్ రేంజర్లకు ప్రతిఘటన ఎదురైందని, దీనిని వారు జీర్ణించుకోలేకపోయారని, ఈ విధమైన ప్రతిఘటనను పాకిస్థాన్ సైనికులు ఊహించలేదని, కానీ భారత బలగాలు మాత్రం అన్నీ ముందుగానే ఊహించి అన్నిటికీ సిద్ధపడి కాపలాకాసిందని చెప్పారు. సుందర్‌బనికి చెందిన బిఎస్‌ఎఫ్ డిఐజి వీరేంద్ర దత్తా మాట్లాడుతూ, సుమారు ఇరవైమంది ఉగ్రవాదులు సుందర్‌బని నుండి దేశంలోకి చొరబడేందుకు సిద్ధమయ్యారన్న గూఢచారి సమాచారం తమకు లభించిందనీ, ఈ మేరకు భారత బలగాలు చుట్టుపక్కల ఉన్న శత్రుదేశ కేంద్రాలపై వ్యూహాత్మకంగా మోర్టార్ దాడులు చేశాయని చెప్పారు. ఈ దాడుల్లో అనేక పాకిస్థానీ పోస్టులు ధ్వంసమయ్యాయని చెప్పారు.

## పాకిస్థాన్ ఉద్దేశపూర్వక యుద్ధ వ్యూహానికి

# భారత్ తగిన రీతిలో స్పందిస్తుంది

### గుజరాత్‌లో ప్రధాని మోదీ హెచ్చరిక



**గాంధీనగర్ :** ఉగ్రవాదం అనేది పరోక్ష యుద్ధం కాదని, పాకిస్థాన్ అనుసరిస్తున్న యుద్ధ వ్యూహమని, భారతదేశం కూడా దానికి తగినరీతిలో సమాధానం ఇస్తుందని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అన్నారు. పాకిస్థాన్‌లో రాజ్యేతర, రాజ్యేతర సంస్థల మధ్య ఎటువంటి వ్యత్యాసాన్ని చూపడానికి కూడా నిరాకరించిన మోదీ, పొరుగుదేశం ఉగ్రవాదానికి మద్దతు ఇవ్వడం ద్వారా యుద్ధంలో పాల్గొంటున్నదని తెలిపారు. 'వసుదైవ కుటుంబం' (ప్రపంచం ఒక కుటుంబం) అనేది మా సంస్కారం (మా సంప్రదాయం ద్వారా బోధించే విలువైన సందేశం). మన పొరుగువారు కూడా ఆనందంగా ఉండాలని మేం ఎల్లప్పుడూ కోరుకుంటుంటాము. ఒకవేళ మీరు మా బలాన్ని సవాల్ చేయాలని కోరుకుంటున్నట్లయితే భారతదేశం కూడా మాయొక్క వీరుల భూమి అనే విషయం తెలుసుకోవాల్సి ఉంటుంది' అని మోదీ హెచ్చరించారు. మంగళవారం నాడు గుజరాత్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన పట్టణాభివృద్ధి కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రసంగించారు. 'మేం దీనిని పరోక్ష యుద్ధంగా భావించలేం. మే 6న ఆపరేషన్ సిందూర్ సమయంలో చంపబడిన వారందరికీ పాకిస్థాన్‌లో దేశ గౌరవం లభించింది. వారి శవపేటికల మీద పాకిస్థాన్ పతాకాలు కప్పబడ్డాయి. వారికి పాకిస్థాన్ సైన్యం సెల్యూట్ చేసింది. ఇదంతా పాకిస్థాన్ చేసిన పరోక్ష యుద్ధం కాదని స్పష్టం చేసింది. ఇదంతా ఉద్దేశపూర్వకంగా చేసిన వ్యూహాత్మక యుద్ధం అని రుజువు చేసింది' అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. 'ఒక వేళ పాకిస్థాన్ యుద్ధంలో పాల్గొనాలని భావిస్తే దానికి తగ్గట్లుగానే భారతదేశం స్పందన ఉంటుంది' అని ఆయన వివరించారు. పహల్గామ్‌లో ఉగ్రదాడికి ప్రతిస్పందిస్తూ 'ఆపరేషన్ సిందూర్' ద్వారా భారతదేశ సైనిక బలగాలు పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేశాయి. అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గుజరాత్‌ను మొదటిసారి సందర్శించారు. ఆయన వడోదరా, దహోద్, భుజ్, అహ్మదాబాద్, గాంధీనగర్‌లో పర్యటించారు.'ఆపరేషన్ సిందూర్ దేశభక్తి ఉత్సాహంతో విజయ గర్జన చేసింది' అని మోదీ అన్నారు.ఈ అనుభూతిని యావత్ భారత దేశం చూసిందని చెప్పారు. దేహం దృఢంగా ఉన్నా కూడా ఒక చిన్న ముల్లు కుచ్చుకుంటే భరించరాని నొప్పి శరీరం అంతటికీ ఉంటుందని చెప్పారు. 'భారతదేశం కూడా ఉగ్రవాదం అనే ముల్లును పెరికివేసింది' అని తెలియజేశారు. దానిని అత్యంత దృఢ నిశ్చయంతో చేశానన్నారు. 1947లో కాశ్మీర్‌లోకి ప్రవేశించిన ముజాహిదీన్‌లను మనం చంపాల్సి ఉండేది. అయితే ప్రస్తుత పరిస్థితి అలాంటి పరిస్థితిలో లేదని స్వాతంత్ర్యం తర్వాత కాశ్మీర్‌లోకి చొరబాట్ల ను ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. విభజన సమయంలో 'మాత', 'భారతి' అని భారతమాత రెండుగా విడిపోయింది. ఆ రాత్రి కాశ్మీర్‌లో ముజాహిదీన్‌లు మొదటి దాడిని ప్రారంభించారు' అని మోదీ గుర్తుచేశారు. ఈ ఉగ్రవాదుల సహాయంతో పాకిస్థాన్ భారతమాతలో ఒక భాగాన్ని స్వాధీనం చేసుకుందని చెప్పారు.

### మళ్లి పటేల్ ప్రస్తావన

పాక్ ఆక్రమిత కాశ్మీర్(పిఒకె)ను తిరిగి స్వాధీనం చేసుకునేంత వరకూ భారతసైన్యం ఆగకూడదని సర్దార్ వల్లభాయ్ పటేల్ అభిప్రాయపడ్డారు. హోంమ ంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ అభిప్రాయాన్ని ఏమాత్రం పట్టించుకోలేదు. ఫలితంగా వారు వారి (పాకిస్థాన్‌కకు, ఉగ్రవాదులకు మద్దతు ఇచ్చినవారు) రక్తాన్ని రుచి చూశారు 'అని ప్రధానమంత్రి మోదీ చెప్పారు'. గత 75సంవత్సరాలుగా ఈ ఉగ్రవాద వారసత్వం కొనసాగుతోందని, దానికి భయంకర రూపం పహల్గామ్ దాడి అని మోదీ చెప్పారు.

## దౌత్య ప్రతినిధుల బృందాల్లో

# ప్రతిపక్ష ఎంపిలే బాగా మాట్లాడారు

**న్యూఢిల్లీ :** 'ఆపరేషన్ సిందూర్'పై భారత వైఖరిని దౌత్య ప్రతినిధుల బృందాలు ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేస్తున్న విషయం తెలిసిందే. అయితే ప్రభుత్వంలోని తమ సహచరుల కంటే ప్రతిపక్ష ఎంపిలు దేశ వైఖరిని చాలా సమర్థవంతంగా తెలియజేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ పేర్కొంది. ఏప్రిల్ 22 పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత అధికార భారతీయ జనతా పార్టీ (బిజెపి), దాని మద్దతుదారులు, ప్రతిపక్షం ప్రవర్తించిన తీరు మధ్య వ్యత్యాసాన్ని చూసి భావితరాలకు గుణపాఠం చెప్పాలని ప్రజలను కోరింది. మంగళవారం కాంగ్రెస్ మీడియా, ప్రచార విభాగం అధిపతి పవన్ ఖేరా విలేకరులతో మాట్లాడారు. భారత వైఖరిని తెలియజేయడానికి విదేశాలకు పంపిన ప్రతినిధి బృందాల సభ్యుల పేర్లపై జరిగిన రాజకీయం అందరికీ తెలిసిందేనన్నారు. కొంతమంది పర్యాటక ప్రదేశాలకు వెళ్లి ట్వీట్లు చేస్తుండగా, కాంగ్రెస్ ఎంపిలు భారతదేశ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్న తీరు అందరి ముందు కనిపిస్తోందన్నారు. పేరు చెప్పకూడని ఓ అధికార పార్టీ ఎంపి ప్రతిరోజూ ప్రతిపక్షాల గురించి విషపూరిత (సోషల్ మీడియా) పోస్ట్‌లు చేస్తున్నారని ఖేరా పేర్కొన్నారు. పరోక్షంగా బిజెపి ఎంపి నిషికంత్ దూబేను విమర్శించినట్లు స్పష్టమవుతోంది. 'ప్రతిపక్ష సభ్యులు చాలా ప్రభావవంతంగా, ప్రభుత్వం కంటే చాలా ఎక్కువగా, భారతదేశ ప్రయోజనాలను ముందుకు తెస్తున్నారు. బిజెపి, ప్రతిపక్ష ఎంపీలు చేస్తున్న పనుల మధ్య స్పష్టమైన తేడా కనిపిస్తుందని, అదే విధంగా బిజెపి, దాని మద్దతుదారులు, ప్రతిపక్షాలు గత ఒక నెలలో చేసిన వాటి మధ్య కూడా చాలా తేడా కనిపిస్తోందన్నారు. భావితరాలకు గుణపాఠం చెప్పడానికి ఈ వ్యత్యాసం చాలా ముఖ్యమన్నారు. పాకిస్తాన్ మద్దతుగల ఉగ్రవాదంపై భారత వైఖరిని వివరించడానికి విదేశాలకు పంపే బహుళ పార్టీల ప్రతినిధుల కోసం నలుగురు నాయకుల పేర్లను సమర్పించాలని ప్రభుత్వం కోరిందని కాంగ్రెస్ తెలియజేసిన విషయం తెలిసిందే. ప్రతిపక్ష పార్టీ ఆనంద్ శర్మ, గౌరవ్ గొగోయ్, సయ్యద్ నసీర్ హుస్సేన్, అమ్రీందర్ సింగ్ రాజా వారింగ్‌లను ఎంపిక చేసింది. ఈ నలుగురిలో వివిధ దేశాలను సందర్శించే ఏడు ప్రతినిధుల బృందంలో శర్మ మాత్రమే ఉన్నారు. అయితే తమ పార్టీ పంపిన జాబితాలో లేని నలుగురు కాంగ్రెస్ నాయకులు శశి థరూర్, మనీష్ తివారీ, అమర్ సింగ్, సల్మాన్ ఖుర్షీద్ ప్రతినిధుల బృందంలోకి తీసుకున్నారు. ప్రధానమంత్రి స్వయంగా ట్రోల్ భాష మాట్లాడటం ఆందోళన కలిగించే విషయమని, అటువంటి పరిస్థితిలో దేశం నేడు ఎదుర్కొంటున్న సవాళ్లకు భవిష్యత్తులో ఏమి జరుగుతుందో మాకు సమాధానం కావాలన్నారు. కానీ మోడీ ప్రభుత్వం నుండి మనకు ఎటువంటి సమాధానాలు లభించవని తాను అనుకోనన్నారు. ఈ సంక్షోభ సమయంలో పరీక్షించినపుడు, ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది' అని కాంగ్రెస్ నాయకుడు పేర్కొన్నారు. ఏప్రిల్ 22న దేశం సంక్షోభాన్ని ఎదుర్కొన్నప్పుడు, కాంగ్రెస్‌తో సహా అందరూ ప్రధానమంత్రి మోడీని ఉగ్రవాదంపై స్పందించాలని డిమాండ్ చేసి ప్రభుత్వానికి మద్దతు తెలిపారు. 'లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ తన విదేశీ పర్యటనను వదిలి దేశానికి తిరిగి వచ్చారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే వెంటనే (పార్టీ) వర్కింగ్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేసి, ప్రతి అడుగులోనూ మేము ప్రభుత్వంతో ఉన్నామని ఒక ప్రకటన విడుదల చేశారు. ఆతర్వాత, రాహుల్ గాంధీ మొదట పహల్గామ్‌కు వెళ్లి గాయపడిన వారిని, స్థానిక ప్రజలను కలిశారు' అని ఖేరా అన్నారు. ఒకవైపు కాంగ్రెస్, మొత్తం ప్రతిపక్షం జాతీయ ప్రయోజనాల కోసం దృఢంగా నిలబడి ఉన్నప్పటికీ, ఏప్రిల్ 22 రాత్రి నుండి నేటి వరకు బిజెపి చేస్తున్న పేలవ రాజకీయాలతో ఎటువంటి ప్రయోజనం లేదని ఆయన ఆరోపించారు. పాకిస్థాన్‌కు గట్టిగా బదులివ్వాలని ఒకవైపు, ఉగ్రవాదులపై చర్యలు తీసుకోవాలని మరొకవైపు దేశవ్యాప్తంగా గొంతులు వినిపిస్తున్నాయని ఖేరా చెప్పారు. అదే సమయంలో బిజెపితో సంబంధం ఉన్నవారు కశ్మీరీ విద్యార్థులతో పాటు మైనారిటీలతో కూడా దురుసుగా ప్రవర్తిస్తున్నారు' అని కాంగ్రెస్ నాయకుడు అన్నారు. బిజెపి తన అధికారిక సోషల్ మీడియా హ్యాండిల్స్ ద్వారా మతపరమైన ఉన్మాదాన్ని వ్యాప్తి చేయడానికి ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు.



## భద్రతా దళాలతో కాల్పుల్లో మావోయిస్ట్

# కమాండర్ మృతి

**జార్ఖండ్ :** జార్ఖండ్‌లోని పలాము జిల్లాలో భద్రతా దళాలతో జరిగిన కాల్పుల్లో నిషేధిత సిపిఐ (మావోయిస్ట్) కమాండర్ మృతి చెందారని మంగళవారం ఒక సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. రూ.15 లక్షల రివార్డు కలిగిన మరో నక్సలైట్ ఈ ఎన్‌కౌంటర్‌లో గాయపడినట్లు ఆయన తెలిపారు. తుపాకీ కాల్పుల తర్వాత జరిగిన సెర్చ్ ఆపరేషన్‌లో సెల్ఫ్ లోడింగ్ రైఫిల్‌తో సహా అనేక ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. సోమవారం రాత్రి మొహమ్మద్‌గంజ్, హైదర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిమితుల మధ్య ఉన్న సీతాచువాన్ ప్రాంతం సమీపంలో భద్రతా దళాలు, మావోయిస్టుల మధ్య ఎన్‌కౌంటర్ జరిగిందని పోలీసులు తెలిపారు. పాలాములో భద్రతా దళాలు, మావోయిస్టుల మధ్య జరిగిన తీవ్ర కాల్పుల తర్వాత, ఒక సిపిఐ (మావోయిస్ట్) మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారని, గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోందని పాలము డిఐజి వైఎస్ రమేష్ పిటిఐకి తెలిపారు. అయితే, అది మావోయిస్టు అగ్ర కమాండర్ తులసి భూనియన్ మృతదేహమని మరొక పోలీసు అధికారి తెలిపారు. రూ.15 లక్షల రివార్డు ఉన్న మరో మావోయిస్టు నితేష్ యాదవ్‌కు బుల్లెట్ గాయం అయిందని అధికారి తెలిపారు. అయితే, దానిని ధృవీకరించాల్సి ఉందని రమేష్ చెప్పారు.

# 'అమ్కా' తయారీకి రక్షణశాఖ ఓకే


### మెగా ప్రాజెక్ట్ 'అమలు నమూనా'కు రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ 'ఆమోదముద్ర'




**న్యూఢిల్లీ :** 'ఆపరేషన్ సిందూర్' విజయవంతం అనంతరం రక్షణ రంగంలో స్వదేశీ పరిజ్ఞానాన్ని ప్రోత్సహించే దిశగా రక్షణ మంత్రిత్వ శాఖ అడుగులు ముందుకు వేస్తోంది. భారత వైమానిక దళం కోసం ఐదవ జనరేషన్‌కు సంబంధించిన లోతైన రంధ్రాన్వేష్యణతో దూసుకుపోయే ఆధునిక మధ్యస్థ యుద్ధ విమానాన్ని 'స్వదేశీయంగా అభివృద్ధి చేసే ఒక మెగా ప్రాజెక్ట్‌ను అమలు చేయడానికి రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఒక 'అమలు నమూనా'ను ఆమోదించారు. దీనికోసం భారతదేశం ప్రతిష్ఠాత్మక అడ్వాన్స్‌డ్ మీడియం కోంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఎఎంసిఎ) ప్రాజెక్ట్‌పై పనిచేస్తోంది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఎఎంసిఎ (అమ్కా) కార్యక్రమం అమలు నమూనాను ఆమోదించారని రక్షణ మంత్రిత్వ శాఖ మంగళవారం ఈ విషయాన్ని తెలియజేసింది. ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఏడిఏ) పరిశ్రమ భాగస్వామ్యం ద్వారా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఈ ఎగ్జిక్యూటివ్ మోడల్ యాప్ పోటీ ప్రాతిపదికన ప్రైవేట్, ప్రభుత్వ రంగాలకు సమాన అవకాశాలను కల్పిస్తుందని రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. వారు స్వతంత్రంగా లేదా జాయింట్ వెంచర్ కన్సార్టియంగా బిడ్డింగ్ చేయవచ్చు. అయితే బిడ్డర్ దేశ చట్టాలు, నిబంధనలు పాటించే భారతీయ కంపెనీ అయి ఉండాలని రక్షణ మంత్రిత్వ శాఖ విడుదల చేసిన తన ప్రకటనలో తెలియజేసింది. అమ్కా (ఎఎంసిఏ) నమూనాను అభివృద్ధి చేయడానికి నైపుణ్యం, సమర్థత, సామర్థ్యం ఉపయోగించుకునే దిశగా ఇది ఒక ముఖ్యమైన అడుగు అని, ఇది ఆత్మనిర్భరత (స్వావలంబన) ఏరోస్పేస్ రంగం వైపు ఒక ప్రధాన మైలురాయి అవుతుందని ఆ ప్రకటన పేర్కొన్నది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని భద్రతపై కేబినెట్ కమిటీ గత సంవత్సరమే ఈ ఫైటర్ జెట్ ప్రోగ్రామ్‌కు సూత్రప్రాయంగా ఆమోదం తెలియజేసింది. ఈ ప్రాజెక్ట్‌కు ప్రాథమిక అభివృద్ధి వ్యయం అంచనా సుమారు రూ.15,000కోట్లుగా నిర్ణయించింది. దీర్ఘకాలిక అవసరాల దృష్ట్యా అడ్వాన్స్‌డ్ మీడియం కోంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రాజెక్ట్ కోసం భారత వైమానిక దళం ఒత్తిడి చేస్తోంది. లైట్ కోంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ తేజస్ అభివృద్ధి తర్వాత ఏఎంసిఏ అభివృద్ధిపై భారతదేశం విశ్వాసం గణనీయంగా పెరిగింది.

## సుక్మా జిల్లాలో 18 మంది


# మావోయిస్టుల లొంగుబాటు



**సుక్మా :** ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో మంగళవారం 18 మంది నక్సలైట్లు భద్రతా దళాల ముందు లొంగిపోయారని, వారిలో 10 మంది రూ. 38 లక్షల బహుమతిని కలిగి ఉన్నారని పోలీసులు తెలిపారు. 'బోలు' 'అమానవీయ' మావోయిస్టు భావజాలం, స్థానిక గిరిజనులపై అల్ట్రాలు చేసిన దురాగతాలపై నిరాశ చెందారని పేర్కొంటూ ఇక్కడి సీనియర్ పోలీసు, సిఆర్‌పిఎఫ్ అధికారుల ఎదుట కార్యకర్తలు లొంగిపోయారని సుక్మా పోలీసు సూపరింటెండెంట్ కిరణ్ చవాన్ తెలిపారు. మారుమూల గ్రామాలలో అభివృద్ధి పనులను సులభతరం చేయడానికి ఉద్దేశించిన రాష్ట్ర ప్రభుత్వం యొక్క 'నియాద్ నెలనార్' (మీ మంచి గ్రామం) పథకం, కొత్త లొంగుబాటు, పునరావాస విధానం ద్వారా కూడా వారు ఆకట్టుకున్నారని ఆయన అన్నారు. లొంగిపోయిన నక్సలైట్ల గురించి చవాన్ మాట్లాడుతూ, మావోయిస్టుల పిఎల్‌జిఎ బెటాలియన్ నంబర్ 1లో ప్లాటూన్ పార్టీ కమిటీ సభ్యుడు మద్కం ఆయతా (25), అదే బెటాలియన్‌లో పార్టీ సభ్యుడు భాస్కర్ అలియాస్ భోగం లఖా (26) ఒక్కొక్కరికి రూ. 8 లక్షల రివార్డును ప్రకటించారు. మావోయిస్టుల ఏరియా కమిటీ సభ్యులు మద్కం కమ్లు (25) , లక్ష్మణ్ అలియాస్ మద్వి చన్ను (28) ఇద్దరూ ఒక్కొక్కరికి రూ. 5 లక్షల రివార్డును ప్రకటించగా, మరో ఆరుగురికి రూ. 2 లక్షల రివార్డును ప్రకటించారు. లొంగిపోయిన నక్సలైట్లకు ఒక్కొక్కరికి రూ. 50,000 సహాయం అందించామని, ప్రభుత్వ విధానం ప్రకారం వారికి మరింత పునరావాసం కల్పిస్తామని ఆయన చెప్పారు.

# 'అదిగో భారత్ బూచి'.. ఐక్యంగా ఉందాం రండి

### దేశం లోపలా, వెలుపలా యుద్ధంలాంటి పరిస్థితి
### అఖిలపక్ష సమావేశంలో నాయకులకు యూనుస్ హెచ్చరిక



**ఢాకా:** చీఫ్ అడ్వైజర్ హోదాలో ఉన్న బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేత ప్రొఫెసర్ మహ్మద్ యూనుస్ తన పదవిని కాపాడుకునేందుకు భారత్‌పై విరుచుకుపడ్డారు. భారతదేశ ఆధిపత్యం కారణంగానే బంగ్లాదేశ్‌లో ఇంతపెద్ద సంక్షోభం తలెత్తిందని ఆయన అన్నారు. 20 రాజకీయపార్టీ నాయకులు, కార్మికసంఘాలు, సంస్థలతో వేరువేరుగాజరిపిన సమావేశాల్లో యూనుస్ ఈ విషయం చె ప్పారు. పరిస్థితులను ఆసరాగా చేసుకుని దేశాన్ని బలహీనపరచేందుకు అవిశ్రాంత ప్రయత్నాలు జరుగుతున్నాయనీ, దీని నుండి పాకాడుకోవడాని కి అందరం సమైక్యంగా ఉండటం ఒక్కటే ఏకైక పరిష్కారమనీ యూనుస్ పి లుపు ఇచ్చారు. ''మనల్ని ముందుకు కదలనీయకుండా అడ్డుకునేందుకు దే శంలో ప్రతి వ్యవస్థా కుప్పకూలిపోయేందుకు దారితీసేవిధంగా లోపలా, వె లుపలా యుద్ధం తరహా పరిస్థితులు రూపుదిద్దుకున్నాయి, తద్వారా మన ల్ని తిరిగి విధేయులుగా అణగిమణగి ఉంచేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి'' అని యూనుస్ హెచ్చరించారు. దేశంలో సంస్కరణలు తీసుకురావడానికి చొరవ తీసుకుంటామనీ, గత ఏడాది జులైనాటి హత్యలపై విచార ణ చేపడతామని, సార్వత్రిక ఎన్నికలను ముందుగా ప్రకటించినవిధంగా స మయానికి నిర్వహిస్తామని ప్రకటించి ప్రతిపక్షాలను యూనుస్ బుజ్జగించారు.

సైన్యం దగ్గరనుండి ఎవ్వరూ సహకరించడంలేదన్న తీవ్ర నిరాశానిస్పృహలకు గురైన యూనుస్ పదవికి రాజీనామా చేస్తారని గడచిన గురువారం నాడు వచ్చిన వార్తల అనంతరం ఆయన రాజీనామా చేయడంలేదని సహాయకులు ప్రకటించారు. ఈ పూర్వరంగంలో సోమవారనాడు రాత్రి ప్రభుత్వ అతిథిగృహం జమునాలో 20 రాజకీయపార్టీలకు చెందిన నాయకులు, సంస్థలతో యూనుస్ సమావేశాలు నిర్వహించారు. దీనికిముందుగానే బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ, జమాతే ఏ ఇస్లామీ, నేషనల్ సిటిజన్స్‌పార్టీల నాయకులు గడచిన శనివారంనాడు యూనుస్‌తో విడివిడిగా సమావేశాలు జరిపారు. యూనుస్ ప్రెస్ కార్యదర్శి షఫీకుల్ అలమ్ మంగళవారం ఉదయం అఖిలపక్ష సమావేశ వివరాలను మీడియాకు తెలియజేశారు. ఈ పరిస్థితుల్లో ఐక్యంగా ఉంటామని, అండగా నిలబడతామని అన్ని రాజకీయపార్టీల నాయకులూ యూనుస్‌కు మద్దతు ప్రకటించారని అలమ్ చెప్పారు. 2024 జులైలో తలెత్తిన విద్యార్థుల తిరుగుబాటు దేశంలో గొప్ప సంస్కరణలకు శ్రీకారం చుట్టడానికి మంచి అవకాశాన్ని కల్పించిందని యూనుస్ చెప్పినట్లు షఫీకుల్ అలమ్ తెలియజేశారు. ''దేశంలో ప్రతిఒక్కరూ విశ్వాసంతో ఉండాలి, నేను మాత్రం దేశానికి ఎలాంటి హానీ తలపెట్టే పనులు చేయను, మనం ఇప్పుడు ఈ విధంగా ఐక్యంగా ఒకేచోట కూర్చుని ఉన్నాం, ఇది నాకు ఎంతో విశ్వాసాన్ని కలగజేసింది, నేను విశ్వాసంతో ఉన్నా, దేశంలో న్యాయబద్ధంగా ఎన్నికలు నిర్వహించలేకపోతే నేను నేరం చేసినవాడిలాగా బాధపడతా'' అని అని యూనుస్ ఈ సందర్భంగా అన్నారు. దేశంలో ఈ ఏడాది డిసెంబరు నుండి 2026 జూన్ 30వ తేదీలోపు సార్వత్రిక ఎన్నికలను జరిపితీరుతామని మరోసారి అన్నిపార్టీలకు యూనుస్ భరోసా ఇచ్చారు. అవామీలీగ్‌పార్టీ కార్యకలాపాలపై ఈ నెల 12వ తేదీన (మే 12, 2025) నిషేధం విధించినప్పటినుండీ దేశంలో సంక్షోభం తలెత్తిందని, దేశంలో యుద్ధం తరహా వాతావరణం నెలకొని ఉందని హెచ్చరిస్తూ, ఇలాం టి కష్టకాలంలో అన్ని పార్టీలూ ఐక్యంగా ఉందామని అఖిలపక్షాలను యూ నుస్ కోరారు. బంగ్లాదేశ్ అంతర్గత పరిస్థితులకు ఆయన భారత్‌ను బూచిగా చూపించారు. భారతదేశం తమదేశ వ్యవహారాలలో జోక్యం చేసుకుంటోందన్న అభిప్రాయాన్ని పరోక్షంగా ఈ సమావేశంలో వ్యక్తం చేశారు. దీంతో పలు పార్టీల నాయకులు ఆయనకు సంఘీభావం వ్యక్తం చేశారు.

**కీలక సమస్యలు ప్రజాతీర్పుకే వదిలిపెట్టాలి**
**బంగ్లాదేశ్ కమ్యూనిస్టుపార్టీ వెల్లడి**

కొన్ని ముఖ్యమైన, మౌలికమైన సమస్యలను ప్రజల తీర్పుకే వదిలిపెట్టాలనీ, అనవసరమైన జాప్యం చేయడంవల్ల పరిస్థితులు మరింతగా దిగజారతాయని బంగ్లాదేశ్ కమ్యూనిస్టుపార్టీ మాజీ అధ్యక్షుడు ముజహిదుల్ ఇస్లాం సెలిమ్ హెచ్చరించారు. యూనుస్‌తో అఖిలపక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. దేశంలో సంస్కరణలను అమలు చేసేంత సమయం, అంత గడువు ఈ తాత్కాలిక ప్రభుత్వానికి లేదని, అందువల్ల సంస్కరణల విషయాన్ని ప్రజలకే వదిలేయాలని అన్నారు. దేశంలో ఇప్పటికే అస్థిర పరిస్థితులు ఏర్పడ్డాయని, జాప్యంవల్ల ఇవి మరింత దిగజారుతాయన్నారు. జాతీయ ఐక్యతను నాశనం చేసేందుకు దేశం వెలుపలా, దేశం లోపలా కుట్రలు జరుగుతున్న విషయం గత ఏడాది జులైలో విద్యార్థి ఉద్యమ సమయంలోనే కనిపించిందన్నారు. గత ఏడాది జులైలో జరిగిన తిరుగుబాటు సమయంలో జరిగిన అక్రమ హత్యలకు సంబంధించి అవామీలీగ్‌పై విచారణ చేస్తామని తాత్కాలిక ప్రభుత్వం తమకు హామీ ఇచ్చినట్లు సమావేశానంతరం కొందరు ప్రతిపక్ష నాయకులు చెప్పారు.రాజకీయంగా భిన్నాభిప్రాయాలున్నాగానీ, మేం ఐక్యంగా ఉన్నామని, యూనుస్ రాజీనామా చేయాలని తాము కోరుకోవడంలేదని మన్నా చెప్పారు. తాత్కాలిక ప్రభు త్వం నడిపే నాయకులమధ్య సమన్వయం కొరవడిందని ఆయన విమర్శించారు.

**CHANGE OF NAME**

I, VEERANNA S/o.KUMMARI THAYANNA, R/o H.No: 7-34, Basracheruvu village, Ananthapuram (post),Gadwal mandal, Jogulamba Gadwal dist.,T.G 509125 have changed my Name from VEERANNA (old name) To KUMMARI VEERANNA (New Name) for all purposes



# జనరల్
STATE & REGIONAL NEWS

## జూన్ 2న కవిత కొత్త పార్టీ ప్రకటన

ఎంపి, బిజెపి నేత రఘునందన్ రావు జోస్యం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జూన్ 2వ తేదీన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కొత్త పార్టీ రాబోతోందని మెదక్ ఎంపి, బిజెపి నేత రఘునందన్ రావు జోస్యం చెప్పారు. హైదరాబాద్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అనంతరం తెలంగాణలో కవిత పాదయాత్ర చేస్తారని తెలిపారు. కవిత వద్దకు కెసిఆర్ మధ్యవర్తులను పంపించారని, తండ్రి, కుమార్తెల మధ్య మధ్యవర్తులెందుకు? అని రఘునందన్ రావు ప్రశ్నించారు. కవిత గెలిచినప్పుడు కెసిఆర్ దేవుడయ్యారని, మరి ఇప్పుడు దెయ్యం ఎలా అయ్యారంటూ రఘునందన్ సందేహం వ్యక్తం చేశారు. దెయ్యాల మధ్య పదేళ్ల రాజకీయం ఎందుకు? చేసినట్లు అంటూ కవితను ప్రశ్నించారు.

## ట్రిబ్యునల్‌లో తేల్చుకోవాలి:హైకోర్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆలయాలకు దాతలు ఇచ్చిన భూములపై హక్కులు ఆలయానికి చెందుతాయా లేక ఆలయ పూజారికి చెందుతాయా అనేది ఎండోమెంట్స్ ట్రిబ్యునల్ తేల్చాలని కూడా తీర్పులో పేర్కొంది. ఈ వివాదాన్ని దేవాదాయ శాఖ చట్టం కింద ఏర్పాటైన ఎండోమెంట్ ట్రిబ్యునల్‌లోనే తేల్చుకోవాలని స్పష్టం చేసింది. పూర్వీకుల నుంచి వచ్చిన ఆస్తులకు సంబంధించిన రెవెన్యూ రికార్డుల్లో తమ పేర్లను తొలగిస్తూ కలెక్టర్ గత ఏడాది ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను సవాల్ చేస్తూ పెద్దపల్లి జిల్లా ఓదెల గ్రామానికి చెందిన పూజారులు ఆరుట్ల శ్రీనివాసాచార్యులు, నరసింహాచార్య హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ పూర్తి చేసిన న్యాయమూర్తి జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ఇటీవల పైవిధంగా తీర్పు వెలువరించారు. రెవెన్యూ రికార్డుల్లో సాగుదారులుగా పేర్లు ఉంటే వాళ్లే భూమికి యజమానులుగా నిర్ధారణ చేయడానికి వీల్లేదన్నారు పహాణిలోని పద్దుల ఆధారంగా భూమి ఎవరిదో తేల్చరాదని తేల్చారు ఆర్‌వోఆర్‌లోని పద్దులకు పహాణిలోని పద్దులకు సంబంధం లేదని, వాటిలో భూమి ఎలాంటిదో, సాగుకు చెందిన వివరాలు, భూమి శిస్తు వసూళ్లు వంటి సమాచారం ఉంటుందని, వాటి ఆధారంగా భూ హక్కులను నిర్ధారణ చేస్తే వేరే వాళ్ల ప్రయోజనాలు దెబ్బతింటాయని తీర్పులో పేర్కొన్నారు. రెవెన్యూ రికార్డుల్లో పిటిషనర్లతోపాటు శ్రీ సీతారామచంద్రస్వామి, శ్రీ అంజనేయస్వామి ఆలయాలను పట్టాదారులుగా పేర్కొన్నారని గుర్తు చేశారు. ఈ వివాదాన్ని ఎండోమెంట్స్ ట్రిబ్యునల్‌లో తేల్చువాలని చెప్పి పిటిషన్లపై విచారణ ముగిసినట్లుగా ప్రకటించారు.

# వన మహోత్సవం... సామాజిక ఉద్యమంగా నిర్వహించాలి

ఫారెస్టు తదితర శాఖలతో
మంత్రి కొండా సురేఖ సమీక్ష

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మహోత్సవం కార్యక్రమాన్ని సామాజిక ఉద్యమంగా చేపట్టాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పచ్చదనాన్ని మరింత విస్తరింప చేయాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏడాది మొక్కలు పెంచే కార్యక్రమాన్ని వన మహోత్సవం పేరిట చేపడుతున్నది... ఈ ఏడాది అందుకు సంబంధించిన ఏర్పాట్లపై రాష్ట్ర కొండా సురేఖ మంగళవారం రాష్ట్ర సచివాలయంలో సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో అటవీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్, పిసిసిఎఫ్ డాక్టర్ సువర్ణ, ఎంఐయుడి సెక్రటరీ టికె శ్రీదేవి, ప్రియాంక వర్గీస్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అటవీ, ఇతర శాఖ అధికారుల ఆధ్వర్యంలో జూన్ మొదటి వారం నుండి పెద్ద ఎత్తున మొక్కలు నాటాలన్న లక్ష్యంతో అధికారులు సిద్ధం చేసిన పిపిటిని మంత్రి సురేఖకి వీక్షించారు. అనంతరం సమావేశంలో మంత్రి మాట్లాడుతూ... గత ఏడాది అనుభవాల ఆధారంగా మరింత పక్కాగా ఏర్పాట్లు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా అటవీ విస్తీర్ణాన్ని పెంచేందుకు వన మహోత్సవం కింద పకడ్బందీ కార్యచరణ రూపొందించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో.... అన్ని మండలాలు, గ్రామాలు, మున్సిపాలిటీల్లో పెద్దఎత్తున మొక్కలు నాటేందుకు సన్నద్ధం అవ్వాలని మంత్రి సురేఖ ఆదేశించారు.

జిల్లాల్లో జూన్, జూలై, ఆగస్టు మాసాల్లో మొక్కలు నాటేందుకు ప్రణాళికతో ముందుకు వెళ్ళాలని సూచించారు. 2024 సంవత్సరం డిపార్టుమెంటువారీగా, డిస్ట్రిక్ వారీగా రాష్ట్రవ్యాప్తంగా 20.02 కోట్ల మొక్కలు నాటాలని ప్రణాళికలు వేసుకోగా... 19.04 కోట్లు నాటినట్టు మంత్రి సురేఖ గుర్తు చేశారు. 95 శాతం మేరకు అంచనాలు రీచ్ అయినట్టు వెల్లడించారు. ఈ సారి 100 శాతం మనం పెట్టుకున్న టార్గెట్ రీచ్ కావాలని దిశానిర్దేశం చేశారు. ప్రతి గ్రామంలో వన నర్సరీల ద్వారా మొక్కలు పెంచి అదే గ్రామంలో నాటించడానికి ఏర్పాట్లు చేయాలని సూచించారు. గతంలో ఎదురైన అనుభవాలు, తప్పిదాలు పునరావృత్తం కాకుండా అవసరమైన జాగ్రత్తలను అధికారులు తీసుకోవాలన్నారు. ప్రతీ ఇంటికి మొక్కలు ఇచ్చి నాటేందుకు ప్రోత్సహించాలని చెప్పారు. ప్రజలు అడిగిన మొక్కలను అందజేయడానికి అధికారులు సిద్దంగా ఉండాలన్నారు. ఇండ్లలో ప్రధానంగా పెంచే గులాబీ, మందార, గన్నేరు, సీతాఫలం, జామ, ఉసిరి, అల్ల నేరేడు, మునగ, కానుగ, తులసి, ఈత మొక్కలతో పాటు పలు ఔషద మొక్కలు, పూల మొక్కలను సిద్ధం చేయాలని ఆదేశించారు. పూల మొక్కలను ప్రభుత్వ స్థలాలు, రహదారులకు ఇరువైపులా, పొలం, చెరువు గట్లు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు సంస్థలు, పరిశ్రమలు, కమ్యూనిటీ కేంద్రాలు, వైద్య శాలలు, అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల ఆవరణల్లో నాటేందుకు ప్రణాళిక రూపొందించాలని మంత్రి ఆదేశించారు. గతం కంటే ఈసారి మాన్‌సూన్ ముందే వచ్చిందని... ఈ నేపథ్యంలో అందరూ సన్నద్ధంగా ఉండాలన్నారు. ఏ ఏరియాలో ఎటువంటి చెట్లు నాటాలో గుర్తించి ఆ విధంగా ముందుకు వెళ్ళాలని మంత్రి సూచించారు. ఈ దఫా వనమహోత్సవంలో ఈత, తాటి, వేప, చింత, కుంకుడు మొక్కలు నాటించాలన్నారు. పెద్ద ఎత్తున మొక్కలు నాటిన వారికి గుర్తించి ప్రోత్సాహకాలు ఇవ్వాలని మంత్రి సురేఖ అధికారులను ఆదేశించారు. మొక్కల పెంపకంలో ప్రత్యేకంగా కృషి చేసిన వారికి పలు విధాలుగా గుర్తింపు ఇవ్వాలన్నారు. వనజీవి రామయ్య వంటి మహనీయుల కుటుంబీకులను సన్మానం చేయాలని మంత్రి సురేఖ అభిప్రాయపడ్డారు.



## ఆహార ధాన్యాల్లో జన్యు మార్పిడి విధానాన్ని ఉపసంహరించుకోవాలి

సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆహార ధాన్యాల్లో జన్యు మార్పిడి విధానాన్ని కేంద్రం వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ సీడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి ఈమేరకు మంగళవారం ఆయన కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రికి లేఖ రాశారు. వ్యవసాయ రంగంలో శాస్త్రీయ పురోగతి, టెక్నాలజీ అవసరమే కానీ.. ఆహార ధాన్యాల్లో జన్యు మార్పిడి విధానం వల్ల తీవ్ర సమస్యలు తలెత్తుతాయని తన లేఖ ద్వారా ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా బయో సేఫ్టీ, విత్తన స్వావలంబన, రైతుల స్వాతంత్ర్యం, వ్యవసాయ వ్యవస్థల దీర్ఘకాలిక స్థిరత్వంపై ప్రభావం కలుగుతుందన్నారు. ఇప్పటికే అనేక రైతు సంఘాలు, శాస్త్రవేత్తలు.. జన్యు మార్పిడిపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారని వివరించారు. గతంలో కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్న సమయంలో వంకాయ, ఆవాల విషయంలో జన్యు మార్పిడిపై వెనక్కి తగ్గిన విషయాలను కూడా సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి తన లేఖలో పేర్కొన్నారు. ఐతే ఆహారధాన్యమైన బియ్యంలో జన్యు మార్పిడి తేవడం వల్ల పర్యావరణం, ఆర్థిక అంశాలపై ప్రభావం తీవ్ర ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. రైస్ లో జన్యు మార్పిడి అనుమతులను తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరారు.

# ఇష్టారాజ్యంగా వ్యవహరించొద్దు

మావోయిస్టులతో కేంద్రం
చర్చలు జరపాలి
బిఆర్‌ఎస్ నేత, మాజీమంత్రి
సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కర్రెగుట్టల్లో కొనసాగుతున్న ఆపరేషన్ కగార్ ఆపాలని బిఆర్‌ఎస్ నేత, మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. మావోయిస్టులతో కేంద్రం చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం నిరంజన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. తమకు తోచిందే అమలు చేస్తాం, అధికారం ఉంది కాబట్టి ఇష్టారాజ్యంగా పోతాం అన్నట్లు కేంద్రం వ్యవహరిస్తున్నది తప్పితే ప్రస్తుత తరం తరపున ఆలోచన చేయడం లేదన్నారు. వరంగల్ బహిరంగసభలో కెసిఆర్ మావోయిస్టుల ఏరివేత లక్ష్యంగా చేపట్టిన ఆపరేషన్ కగార్ నిలిపివేసి శాంతి చర్చలు చేయాలని కోరడం జరిగిందన్నారు. మన దేశ పౌరులను మనమే కాల్చుకోవడం మంచిది కాదని కేంద్రానికి వివరించినా వారు ఎందుకో ఈ దిశగా ఆలోచించడం లేదన్నారు. వ్యవస్థలో భిన్నమైన అభిప్రాయాలు ఉంటాయని, వాటిని సహించం అనడం మంచి పద్ధతి కాదన్నారు. ముకుళిత హస్తాలతో విన్నవిస్తున్నాం.. మావోయిస్టులతో చర్చలు జరపాలన్నారు. బిజెపి కాంగ్రెస్ రహిత భారతదేశం అని పిలుపునిచ్చింది.. కానీ ఆ కాంగ్రెస్ పార్టీ వంద సీట్లకు చేరుకున్నది అని నిరంజన్ రెడ్డి తెలిపారు. వ్యక్తులను నిర్మూలించడం ద్వారా ఆలోచనలను నిర్మూలించలేరన్నారు. ఉన్నత విద్యావంతులు ఎంతో మంది అటు వైపు ఆకర్షించబడుతున్నారనే విషయం ఎందుకు కేంద్రం ఆలోచించడం లేదని ప్రశ్నించారు. అక్కడ చంపుతున్న జ్ఞాన సంపదను తిరిగి మనం ఎలా సాధించగలమని, 22 విద్యార్థి సంఘాలు చర్చలు జరపాలని కేంద్రాన్ని కోరాయని, అనేక పార్టీలు, ప్రజాసంఘాలు చర్చలు జరపాలని కోరుతున్నాయని, కానీ కేంద్రం కనీసం ఆ దిశగా ఆలోచన చేస్తామని కూడా ప్రకటించడం లేదు ఎందుకు..? అని నిరంజన్ రెడ్డి ప్రశ్నించారు. ఉగ్రవాద మూకలను ఏరివేయాలని యావత్ భారతదేశం ముక్తకంఠంతో ఏకతాటిపై నిలబడి కేంద్రానికి, మన సైన్యానికి మద్దతు ఇచ్చిందన్నారు. కానీ అమెరికా అధ్యక్షుడు రెండు దేశాలను ఒప్పించి కాల్పుల విరమణకు ఒప్పించాం అని ప్రకటించాడన్నారు. మరి దేశంలోని మావోయిస్టులతో ఎందుకు కేంద్రం చర్చలు జరపడం లేదన్నారు. మావోయిస్టుల మూలంగా అభివృద్ధి ఆగిపోయింది అన్న వాదన అసంబద్ధమైనదన్నారు. 75 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో నాలుగు దశాబ్దాల మావోయిస్టులు ఉన్నారని, అంతకుముందు మూడు దశాబ్దాలు అభివృద్ధిని ఎవరు అడ్డుకున్నారని ప్రశ్నించారు.

## మేడ్చల్ జిల్లాలోని జర్నలిస్టులకు రెండు రోజుల శిక్షణా తరగతులు




**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** మేడ్చల్ జిల్లాలోని జర్నలిస్టులకు తెలంగాణా మీడియా అకాడమీ ఆధ్వర్యంలో జూన్ 9,10 తేదీల్లో శిక్షణా తరగతులు నిర్వహించనున్నారు. తెలంగాణా రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం మేడ్చల్ జిల్లా శాఖ ప్రతినిధులు జర్నలిస్టులకు శిక్షణా తరగతులు నిర్వహించాలంటూ మంగళవారం మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డిని కల్సి కోరిన మేరకు ఆయన అంగీకరిస్తూ ఈ మేరకు ప్రకటించారు. నాంపల్లిలోని మీడియా అకాడమీలో పలువురు ప్రొఫెసర్లు, సీనియర్ జర్నలిస్టులతో జరిగే ఈ రెండు రోజుల శిక్షణా తరగతుల్లో అల్పాహారం, మధ్యాహ్నం భోజన సదుపాయాన్ని మీడియా అకాడమి ఏర్పాటు చేస్తుందని మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస రెడ్డి తెలిపారు. శిక్షణ పొందిన వారికి మీడియా అకాడమీ సర్టిఫికెట్లను సైతం అందచేస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం మేడ్చల్ జిల్లా శాఖ జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాలరాజు, కార్యదర్శి వెంకట్రాంరెడ్డి, కూకట్‌పల్లి అధ్యక్షుడు ఎంఎ కరీం, ఉప్పల్ నియోజకవర్గ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, నరోత్తంరెడ్డి తదితరులు మీడియా అకాడమీ చైర్మన్‌ను కల్సిన వారిలో ఉన్నారు.

## శిల్పారామం సందర్శించిన ఆఫ్రికా బృందం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆఫ్రికా ప్రతినిధులు హైదరాబాద్ పర్యటనలో భాగంగా మంగళవారం మాదాపూర్‌లోని శిల్పారామం సందర్శించారు. కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఐదు రోజుల పర్యటన లో భాగంగా ఆఫ్రికా ఖండంలోని 15 దేశాలకు చెందిన 30 మంది ఆఫ్రికన్ ప్రతినిధులకు ఒగ్గు డోలు బృందంతో అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం శిల్పారామంలో తెలంగాణ కళా రూపాలను ఆఫ్రికన్ ప్రతినిధులకు ప్రదర్శించారు. కూచిపూడి, ఒగ్గుడోలు, పేరిణి నృత్యాలను ఆసక్తిగా తిలకించారు. ప్రదర్శనలకు మరిచిపోయిన డెలిగేట్‌లు కళాకారులతో కలిసి నృత్యం చేసారు. స్టాల్‌లను సందర్శించారు. అంతకుముందు ఎలక్ట్రానిక్, హార్డ్‌వేర్ రంగంలో నూతన ఆవిష్కరణలు ప్రోత్సహించేందుకు ప్రభుత్వం నగరంలో ఏర్పాటు చేసిన టి వర్క్‌ను సందర్శించి నూతన ఆవిష్కరణ లు తిలకించారు.

# బ్రిక్స్ దేశాల ప్రజలమధ్య సాంస్కృతిక వైవిధ్య విస్తరణకు ఉత్సవాలు, ఎథికల్ ఎఐ

బ్రెజిల్ సమావేశంలో మంత్రి గజేంద్రసింగ్ పిలుపు



**న్యూఢిల్లీ:** బ్రిక్స్ దేశాలు (బ్రెజిల్, రష్యా, భారత్, చైనా,దక్షిణాఫ్రికా) కేవలం భౌగోళికంగానే కాకుండా నాగరికత పరంగా కూడా నాయకత్వం వహించాలని కేంద్ర సాంస్కృతిక వ్యవహారాలశాఖామంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ పిలుపు ఇచ్చారు. బ్రిక్స్ దేశాల సాంస్కృతిక వైవిధ్యాలను పరస్పరం గౌరవించుకునేందుకు నైతిక విలువలకు పట్టంకట్టే కృత్రిమ మేధ (ఎఐ)కు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. సంబంధిత సాంస్కృతిక ఆస్తుల అక్రమరవాణాపై పోరాడేందుకు ఒక బలమైన వ్యవస్థను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని మంత్రి అన్నారు. బ్రిక్స్ దేశాలమధ్య సాంస్కృతిక వైవిధ్యఉత్సవాలు, సృజనాత్మక పరిశ్రమలు స్థిరమైనవృద్ధికి చోదకాలుగా ఉపయోగపడతాయని బ్రెజిల్‌లో జరిగిన 'బ్రిక్స్' సాంస్కృతికశాఖామంత్రుల 10వ సమావేశం ప్రకటించింది. ప్రతిష్టాత్మకమైన ఇటమరటీ భవంతిలో జరిగిన ఈ సమావేశానికి బ్రెజిల్ విదేశీవ్యవహారాలమంత్రిత్వశాఖ ఆతిథ్యం ఇచ్చింది. గజేంద్రసింగ్ షెకావత్ సమావేశంలో ప్రసంగించారు. సోమవారం జరిగిన ఈ సమావేశం వివరాలను ఎక్స్ వేదికగా మంత్రి షెకావత్ అర్థరాత్రి దాటిన తర్వాత పోస్టింగ్ చేశారు. సంప్రదాయ విజ్ఞానాన్ని పరిరక్షించుకునేందుకు, సాంస్కృతికరంగంలో పెట్టుబడులు పెంచేందుకు సంస్కృతి, సంబంధిత సృజనాత్మక పరిశ్రమలను ఒక చోదకశక్తిగా గుర్తిస్తూ బ్రిక్స్‌దేశాలు ఒక ప్రకటన చేశాయి. అక్రమంగా జరుగుతున్న సాంస్కృతిక ఆస్తుల రవాణాను అరికట్టాలని మంత్రి పదే పదే ఉద్ఘాటించారు.

బ్రిక్స్‌దేశాల మంత్రులస్థాయి సమావేశంలో నాలుగు వ్యూహాత్మక సాంస్కృతిక ప్రాధాన్యతలను వివరించే ఉమ్మడి ప్రకటన చేశారు.సమ్మిళితం కావడం, హక్కుల ప్రాతిపదికపై నూతన ఆవిష్కరణలతో సంస్కృతి అభివృద్ధికోసం బ్రిక్స్ దేశాలు సమష్టి దార్శనికతను ప్రతిబింబించాలని ప్రకటన పేర్కొంది. సంస్కృతి–సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ, కృత్రిమ మేధ, సంస్కృతి–వాతావరణ మార్పులు, 2030 తర్వాత అభివృద్ధి ఎజెండా, సాంస్కృతిక ఆస్తుల సంరక్షణ, తిరిగి సురక్షితంగా స్వాధీనం చేయడం, బ్రిక్స్‌దేశాల మధ్య సాంస్కృతిక ఉత్సవాలు, కూటములు ఏర్పాటు చేయడం వంటి వంటి అంశాలపై ఉమ్మడి తీర్మానం చేశారు. ప్రపంచదేశాల ఉమ్మడి నాగరికతావిలువలను ఒక ఉత్సవంలా చేసేందుకు, మానవతావిలువల అనుబంధం మరింత లోతుగా పాతుకుపోయేందుకు వీలుగా బ్రిక్స్ దేశాల ప్రజలమధ్య సాంస్కృతికపరమైన ఆదాన ప్రదానాలు జరగాలన్నారు. సాంస్కృతిక, ఆధ్యాత్మిక అనుభవాలను పంచుకోవడంతోపాటు బ్రిక్స్ దేశాలలో ఉన్న నాగరికతా విలువల పరస్పర అవగాహనకు ఈ ఆదాన ప్రదానాలు దోహదం చేస్తాయని ప్రతిపాదించారు. తద్వారా బ్రిక్స్ దేశాల ప్రజలమధ్య ఉమ్మడి విలువల ప్రగతికి దోహదపడుతుందన్నారు. బ్రిక్స్‌దేశాల ప్రజలమధ్య ఈ ఆదానప్రదానాల రాకపోకలు జరిగేందుకు వీలుగా ఒక బలమైన న్యాయ పరమైన చట్టాన్ని రూపొందించాలని కూడా ఆయన పిలుపు ఇచ్చారు. ఈ క్రమంలో నైతిక విలువలను కాపాడేవిధంగా ఒక కృత్రిమ మేధ (ఎఐ) వ్యవస్థకు అవకాశం ఇవ్వాలని కోరారు. బ్రిక్స్ దేశాలు తమ తమ సాంస్కృతిక వైవిధ్యాన్ని గౌరవించుకుంటూ, దేశాలమధ్య సాంస్కృతిక విలువలకు సంబంధించిన ఆస్తులను అక్రమంగా రవాణాపై పోరాడేందుకు, అలా చేయకుండా నియంత్రించేందుకు కృత్రిమ మేధకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన ప్రముఖంగా తన ప్రసంగంలో ప్రస్తావించారు.

## మోదీ ఎదుగుదలను జీర్ణించుకోలేకపోతున్నారు

ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేపై..
బిజెపి రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్ విమర్శలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మోదీ పాలనలో న్యాయవ్యవస్థ బలోపేతం అయిందని బిజెపి రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె. లక్ష్మణ్ అన్నారు. హైదరాబాద్ నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో దేశం ఎకానమీలో పదోస్థానంలో ఉండేదని, మోదీ పాలనలో 4వ అతిపెద్ద ఎకానమీ దేశంగా ఎదిగిందని తెలిపారు. కాంగ్రెస్ మూడుసార్లు ఎన్నికల్లో ఓడిపోయిందని, అయినా ప్రధానిగా మోదీ ఎదుగుదలను జీర్ణించుకోలేక పోతున్నారన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఏఐసిసి అగ్రనేత రాహుల్‌గాంధీ అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడమనేది తెలంగాణ ప్రజలకు జరిగిన అవమానంగా చూడాలన్నారు. గతంలో అంజయ్యకు అవమానం జరిగిందని, ఇప్పుడు రేవంత్ రెడ్డికి జరుగుతుందని లక్ష్మణ్ తెలిపారు. మావోయిస్టులు ఆయుధాలు వదిలి జనజీవన స్రవంతిలో కలిస్తే చర్చలు ఉంటాయన్నారు. కొంతమంది ఆపరేషన్ సిందూర్‌ను, ఆర్మీని అవమానించడాన్ని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. కుటుంబ కలహాలు, ఆర్థిక సమస్యల నేపథ్యంలో బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత లేఖ రాసిందని తెలుస్తోందన్నారు. గత కెసిఆర్ ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా ఈటల రాజేందర్ నోటీసులకు సమాధానం ఇస్తారని లక్ష్మణ్ చెప్పుకొచ్చారు. మల్లికార్జున ఖర్గే 11 ఏళ్ల మోదీ పాలనను పీడకలగా చెప్పడం సరికాదన్నారు. ఎమర్జెన్సీని తెచ్చింది కాంగ్రెస్ పార్టీ అది ఓ పీడకల అని విమర్శించారు. ఓబిసి రిజర్వేషన్‌ను అడుగు అడుగునా అడ్డుకుంది ప్రతిపక్షనేత రాహుల్ గాంధీనే అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్ రూ. 50లక్షల కోట్లలో కేవలం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు రూ. 11లక్షల కోట్లను మోదీ కేటాయించారని తెలిపారు. మోదీ హయాంలో 7.4శాతం జిడిపి వృద్ధి చెందిందన్నారు. ఇప్పటికైనా మల్లికార్జునఖర్గే ఆలోచించి మాట్లాడాలని లక్ష్మణ్ అన్నారు.

## పబ్లికేషన్ కార్యక్రమాల్లో విదేశీ నిధులు స్వీకరిస్తున్న ఎన్జీవోలు

రిజిస్ట్రార్ ధృవీకరణ పత్రాన్ని పొందాలి
కేంద్రం స్పష్టీకరణ

**న్యూఢిల్లీ :** ప్రచురణ సంబంధిత కార్యకలాపాలలో నిమగ్నమై, విదేశీ సహకారాన్ని స్వీకరించే ఎన్జీవోలు ఎలాంటి వార్తాలేఖను ప్రచురించలేదని, వారు ఎటువంటి వార్తావిషయాలను ప్రసారం చేయలేదని భారతదేశ వార్తాపత్రిక రిజిస్ట్రార్ నుంచి ధృవీకరణ పత్రాన్ని పొందాలని మంగళవారం కేంద్రం స్పష్టం చేసింది. విదేశీ విరాళాల (నియంత్రణ) చట్టం కింద రిజిస్ట్రేషన్ కోరుకునే ఎన్జీవోలు ఈ నూతన నిబంధనలను పాటించాలని తెలియజేసింది. ఈ మేరకు కేంద్రం విడుదల చేసిన ఒక నోటిఫికేషన్‌లో ఈ విషయాలను వెల్లడించింది. ఎఫ్‌సిఆర్‌ఏ కింద రూపొందించిన నిబంధనలను సవరించిందని, ఇకపై విదేశీ నిధులు పొందడానికి అనుమతి కోరుతున్న ఎన్జీవోలు ఉగ్రవాద నిధులు, మనీల్యాండరింగ్‌ను నిరోధించే ప్రపంచ నిఘా సంస్థ అయిన ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ (ఎఫ్‌ఏటిఎఫ్) మంచి పద్ధతుల మార్గదర్శకాలకు కట్టుబడి ఉంటామని హామీ ఇవ్వాలని తెలిపింది. రిజిస్ట్రేషన్ కోరుకునే సంస్థలు లేదా ఎన్జీవోలు మూడు ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన ఆర్థిక నివేదికలను, ఆడిట్ నివేదికలను జత చేయాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ (ఎంహెచ్ఏ) కోరింది. వీటిలో ఆస్తులు, అప్పుల ప్రకటన, రసీదులు, చెల్లింపుల ఖాతా, ఆదాయవ్యయాలతో సరిగ్గా సరిపోలిన, అసోసియేషన్ ఖర్చుచేసిన కార్యకలాపాల వారీ మొత్తాన్ని పేర్కొనే ఛార్టర్డ్ అకౌంటెంట్ సర్టిఫికెట్‌ను సమర్పించాలని సూచించింది. అసోసియేషన్ ప్రచురణ రిజిస్ట్రార్ ఆఫ్ న్యూస్‌పేపర్ ఫర్ ఇండియాకు సంబంధించినది అయితే రిజిస్ట్రార్ ఆఫ్ ది న్యూస్ పేపర్ ఇండియా నుంచి 'నాట్ ఏ న్యూస్ పేపర్'అనే పత్రాన్ని సమర్పిచాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ తెలియజేసింది.

# పద్మ శ్రీ అవార్డు అందుకున్న మందకృష్ణ

నటి శోభనకు పద్మభూషణ్ ప్రదానం



**న్యూఢిల్లీ :** ఢిల్లీలో పద్మ పురస్కారాల రెండో విడత ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పలు రంగాల్లో విశేష సేవలందించిన పలువురికి ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాలను ప్రదానం చేశారు. రెండో అత్యున్నత పురస్కారం పద్మ విభూషణ్ అవార్డును రిటైర్డ్ సిజెఐ జస్టిస్ జగదీశ్ సింగ్ ఖేకర్ అందుకున్నారు. సినీనటి శోభన, కన్నడ నటుడు అనంత్ నాగ్ పద్మభూషణ్ అందుకోగా, ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్నారు. దిగ్గజ ఫోక్ సింగర్ శారద సిన్హా మరణానంతరం పద్మ భూషణ్ అవార్డుకు ఎంపికయ్యారు. ఆమె కుమారుడు అన్షుమాన్ సిన్హా శారద తరఫున అందుకున్నారు. మరణానంతరం ఎంపికైన కుముదిని రజినికాంత్ తరఫున ఆమె మనవడు పద్మ విభూషణ్ అవార్డును అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి వి.రాఘవేంద్రాచార్య పంచముఖి, ప్రొఫెసర్ కేఎల్ కృష్ణ పద్మశ్రీ అవార్డులను రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకున్నారు. ప్రధానమంత్రి వద్ద ఎకనమిక్ అడ్వైజరీ కౌన్సిల్ ఛైర్మన్‌గా పని చేసిన బిబేక్ దేబ్రోయ్ పద్మ భూషణ్ అవార్డుకు ఎంపిక కాగా, ఆయన భార్య పురస్కారాన్ని అందకున్నారు. ఈ కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రమంత్రులు అమిత్ షా, జైశంకర్, కిషన్ రెడ్డి, ధర్మేంద్ర ప్రధాన్, ప్రహ్లాద్ జోషీ సహా పలువురు హాజరయ్యారు. అవార్డు గ్రహీతల కుటుంబ సభ్యులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని తమ సంతోషాన్ని పంచుకున్నారు.

## సింగరేణి జాగృతి ఆవిర్భావం

సింగరేణి సంక్షేమం, సంస్థను కాపాడటమే లక్ష్యం
ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సింగరేణి జాగృతి కార్మిక సంఘం నూతనంగా ఆవిర్భావించింది. కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా కార్యాచరణ టిబిజికెఎస్‌తో సమన్వయం చేసుకుంటూ పని చేస్తామని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. హైదరాబాద్ కవిత నివాసంలో సింగరేణి కార్మికులతో సమావేశం నిర్వహించారు. అనంతరం సింగరేణి జాగృతిని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. బహుజనులు, యువతకు ప్రాధాన్యత కల్పిస్తామని కవిత తెలిపారు. సింగరేణి 11 ఏరియాలకు కోఆర్డినేటర్లను నియమించారు. సింగరేణి కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా, సంస్థను కాపాడటమే ధ్యేయంగా సింగరేణి జాగృతి ఏర్పాటు చేశామన్నారు. సింగరేణి ప్రాంతంలో తెలంగాణ జాగృతి ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతామని ప్రకటించారు. కెసిఆర్ నాయకత్వంలో డిపెండెంట్ ఉద్యోగాలను పునరుద్ధరించి సింగరేణిని రక్షించుకున్నామని తెలిపారు. అలాంటి సంస్థను కాంగ్రెస్ ప్రభుత్వం తమ అవినీతితో అంతం చేయాలని చూస్తోందని విమర్శించారు. అందుకే కార్మికుల ప్రయోజనాలు దెబ్బతీసే లేబర్ కోడ్ గురించి ఒక్కమాట మాట్లాడటం లేదన్నారు.

## నన్ను క్షమించండి

మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీత రావ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గాంధీభవన్‌లో జరిగిన విషయాలు చాలా బాధాకరమని, తనను, మహిళ కాంగ్రెస్ నాయకులను పెద్ద మనస్సుతో క్షమించాల్సిందిగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, కాంగ్రెస్ అధిష్ఠానానికీ తెలంగాణ మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు మొగలి సునీతరావు విజ్ఞప్తి చేశారు. గాంధీభవన్‌లో మంగళవారం మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ అధిష్ఠానం ఇచ్చిన నోటీసుపై కాంగ్రెస్ పార్టీ పెద్దలకు ఫోన్ ద్వారా, రాష్ట్ర ఇంఛార్జీ మీనాక్షి నటరాజన్, టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అలాగే ఇటీవల ఢిల్లీలో జాతీయ అధ్యక్షురాలు అయిన ఆల్కలాంబ స్వయంగా కలిసి వివరణ ఇచ్చినట్లు వెల్లడించారు. గాంధీభవన్ ఘటనకు సంబంధించి తను చేసినా, తన మహిళా కాంగ్రెస్ నాయకులు ఎవ్వరు చేసిన బాధ్యత తనదే అన్నారు. అందుకే తనను క్షమించాల్సిందిగా కోరానన్నారు. రాబోయే కాలంలో మహిళా కాంగ్రెస్‌కి పెద్దపీట వేస్తానని టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్ హామీ ఇవ్వడంతో పాటు ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీల ఒదరికీ సమ న్యాయం చేస్తానని చెప్పారని సునీతారావు వెల్లడించారు.



## ఎరువులు పంపిణీ చేసిన పిఏసిఎస్ చైర్మన్



**ప్రజాపక్షం/దుండిగల్ :** బోరంపేట్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లిమిటెడ్ చైర్మన్ మిద్దెల బాల్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి యాదగిరి 50 సబ్సిడీ పైన పచ్చి రొట్టె ఎరువులను జనుము, జీలుగ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. బౌరంపేట, దుండిగల్ సెంటర్లలో కలిపి 14.8 క్వింటాళ్ల జనుము, 5 క్వింటాళ్లు జీలుగ విత్తనాలు అందుబాటులో ఉంటాయని, రైతులు తమ పట్టా పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్‌తో మండల వ్యవసాయ అధికారి పర్మిట్ తీసుకొని అదేరోజు విత్తనాన్ని కొనుగోలు చేయవలసిందిగా తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు సర్గారి భీమ్ రెడ్డి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి కింద ఎల్‌ఓసి అందజేత



**ప్రజాపక్షం/మోమిన్‌పేట్ :** ముఖ్యమంత్రి సహాయ నిధి కింద వైద్య ఖర్చుల నిమిత్తం వికారాబాద్ నియోజకవర్గంలోని మోమిన్పేట్ మండల పరిదిలోని చీమలదరి గ్రామానికి చెందిన మండల నర్సింలుకు మంజూరైన రెండు లక్షల రూపాయల ఎల్‌ఓసి అందజేశారు. పేద కుటుంబానికి చెందిన తమకు నిమ్స్ ఆసుపత్రిలో మెరుగైన వైద్య కోసం ఎల్‌ఓసి మంజురు చేయించిన స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు.



## సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన

**ప్రజాపక్షం/అల్వాల్ :** మచ్చ బొల్లారం డివిజన్ సత్యం కాలనీలో 26 లక్షల వ్యయంతో కూడిన సిసి రోడ్డు పనులను కార్పొరేటర్ రాజ్ జితేందర్ నాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డివిజన్‌లోని అన్ని కాలనీలలో, బస్తీలలో ప్రజలకు కావలసిన మౌలిక సదుపాయాలను అందిస్తూ దశల వారీగా, ప్రణాళికాబద్ధంగా డివిజన్‌ను అభివృద్ధి చేస్తున్నామని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు బొబ్బిలి సురేందర్ రెడ్డి, శ్రీశైలం యాదవ్, స్వామి, దేవేందర్, వెంకటేష్, కాలనీ వాసులు విజయ్, కృష్ణ, శ్రీకాంత్, జగదీశ్వర్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వెంకటాపురం డివిజన్ వెంకటాపురంలోని 14 లక్షల వ్యయంతో సిసి రోడ్డు పనులకు స్థానిక కార్పొరేటర్ సబితా అనిల్ కిషోర్ గౌడ్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు విజయ, శేఖర్, ప్రకాష్ గౌడ్, సయ్యద్ మోసిన్, తదితరులు పాల్గొన్నారు.

## సామాన్య కార్యకర్త టిజికె మూర్తికి మహానాడులో మాట్లాడే అవకాశం

**ప్రజాపక్షం/చర్లపల్లి:** సామాన్య కార్యకర్తను నాయకుడిగా తీర్చిదిద్దే పార్టీ తెలుగుదేశం పార్టీ అని తెలంగాణ టిడిపి ఉపాధ్యక్షులు టిజికె మూర్తి అన్నారు. కడపలో మూడు రోజులు నిర్వహించే పసుపు పండుగ మహనాడులో మొదటి రోజు మంగళవారం టిజికె మూర్తికి సభలో మాట్లాడే అవకాశం కల్పించింది. 1983లో తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి కాప్రా సర్కిల్ సెక్రెటరీగా, అధ్యక్షులుగా, జిల్లా ప్రధాన కార్యదర్శిగా, రాష్ట్ర కార్యదర్శిగా,ఉపాధ్యక్షులుగా సేవలందించారు. మన కష్టాన్ని పార్టీ ఎప్పటికైనా గుర్తించి గౌరవిస్తుందని ఆయన అన్నారు.

**కడప మహానాడులో కాప్రా టిడిపి నాయకులు...** కడపలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్న టిడిపి పసుపు పండగ మహానాడులో తెలంగాణ టిడిపి ఉపాధ్యక్షులు టిజికె మూర్తి, నందమూరి సుహాసిని, టిడిపి యువ నాయకులు సాయి నాగార్జున, హరికృష్ణ, సాంబశివరావులు పాల్గొన్నారు.



## ప్రణాళికాబద్ధంగా కొంపల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి ఆదేశం

**ప్రజాపక్షం/దుండిగల్ :** కొంపల్లి మున్సిపాలిటీ కార్యాలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలపై బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ సమీక్షా సమావేశం నిర్వహించారు. కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ట్రాఫిక్ సమస్య, నత్తనడకన కొనసాగుతున్న సిసి రోడ్డు నిర్మాణ పనులు, అభివృద్ధి పనులు, శానిటేషన్ సమస్యలతో పాటు పలు సమస్యలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ గత పదేళ్ల కాలంలో గ్రేటర్ హైదరాబాద్ నగరానికి దీటుగా శివారు మున్సిపాలిటీలైన కొంపల్లి, దుండిగల్, నిజాంపేట్ కార్పొరేషన్ ప్రాంతాలు గణనీయంగా అభివృద్ధి చెందాయని, శరవేగంగా అభివృద్ధి చెందుతున్న కొంపల్లి మున్సిపాలిటీని ప్రణాళికాబద్ధంగా మరింత అభివృద్ధి పరచాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కొంపల్లి మున్సిపాలిటీ స్పెషల్ ఆఫీసర్ చంద్రమోహన్ రెడ్డి, కమిషనర్ కృష్ణారెడ్డి, మేడ్చల్ ఎసిపి వెంకట్ రెడ్డి, అల్వాల్ ట్రాఫిక్ ఇంచార్జ్ సిఐ హనుమాన్ గౌడ్, పలు విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.




## పచ్చిరొట్ట ఎరువులతో భూసారం పెంపు

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** పచ్చిరొట్ట ఎరువులైన జనుము, జీలుగ వాడుకుని భూసారం పెంచుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ లావణ్య, విజయ లక్ష్మి లు రైతులకు సూచించారు. మంగళవారం తూంకుంట మున్సిపాలిటీ మందాయిపల్లి, శామీర్‌పేట మండలం లాల్‌గడి మలక్‌పేటలో 'ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రసాయన ఎరువులను మోతాదుకు మించి వాడరాదని చెప్పారు. చీడపీడలకు తట్టుకునే నాణ్యమైన విత్తనాలను విత్తుకోవాలని, భూసార పరీక్షలు చేసుకుని సరియైన మోతాదులో ఎరువులు వేసుకోవాలన్నారు. వరి పంట మార్పిడి చేసుకుని కూరగాయలు, పండ్ల తోటలు పండించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి రమేష్, ఎఇఒలు రవియాదవ్, సుదీర్, విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

## డాక్టర్ సంపత్‌కుమార్‌తో ప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం భేటీ

**ప్రజాపక్షం/తాండూరు:** బివిజి పౌండేషన్ అధినేత, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ సంపత్‌కుమార్‌తో తెలంగాణ ప్రభుత్వం చీఫ్ విఫ్ పట్నం మహేందర్‌రెడ్డి భేటీ అయ్యారు. డాక్టర్ సంపత్‌కుమార్ ఆహ్వానం మేరకు మంగళవారం తాండూరులోని ఆయన నివాసానికి వెళ్ళిన ప్రభుత్వ చీఫ్ విఫ్ పట్నం మహేందర్‌రెడ్డి తేనీటి విందులో పాల్గొన్నారు. ఆయనతో పాటు పార్టీ సీనియర్ నాయకులు కరణం పురుషోత్తమ్‌రావు, సిద్రాల శ్రీనివాస్, బిర్కట్ రఘు, సిద్ధూ తదితరులు పాల్గొన్నారు.



# దూద్ బావి పాఠశాలకు మార్గం సుగమం

### ప్రధానోపాధ్యాయుడి శాంతియుత దీక్షతో స్పందించిన ప్రభుత్వం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** చిలకలగూడ దూద్ బావి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు ఎట్టకేలకు మార్గం సుగమమైంది. పాఠశాలకు దారిని ఏర్పాటు చేయాలని కోరుతూ ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున్ రెడ్డి సోమవారం సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ కార్యాలయం ఎదుట చేపట్టిన శాంతియుత దీక్షకు ప్రభుత్వం స్పందించింది. దీంతో సదరు ప్రహరీ గోడను తక్షణమే తొలగించి పాఠశాలకు దారిని ఏర్పాటు చేయాలని హైడ్రా అధికారులకు, టౌన్ ప్లానింగ్ అధికారుల కు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. వెంటనే అప్రమత్తమైన అధికారులు మంగళవారం పాఠశాల దారికి అడ్డుగా ఉన్న గోడను తొలగించారు. చిలకలగూడ దూద్‌బావి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు దారిలేకపోవడంతో గత కొంతకాలంగా విద్యార్థులు పడుతున్న బాధను చూసే సమస్య పరిష్కారానికి ఎలాగైనా ముందడుగు వేయాలన్న సంకల్పంతోనే శాంతియుత దీక్ష నిర్ణయాన్ని తీసుకోవడం జరిగిందని మల్లికార్జున్ రెడ్డి తెలిపారు. సదరు సమస్య పరిష్కారం కోరుతూ గతంలో జిహెచ్‌ఎంసి ఉన్నతాధికారులకు, పాలకులకు పలుమార్లు వినతి పత్రాలను సమర్పించడం జరిగిందన్నారు. అయినా కూడా వారి నుండి ఎలాంటి స్పందన లేకపోవడంతో విద్యార్థుల అవస్థలను దృష్టిలో పెట్టుకొని సమస్యను పరిష్కరించడం కోసం తాను ముందడుగు వేసి దీక్షను చేపట్టినట్లు ఆయన చెప్పారు. విషయం తెలుసుకున్న హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్ సిబ్బందిని ఆదేశించారు. అడ్డుగా ఉన్న గోడను తొలగింపజేశారు. దీంతో కాలనీవాసులు హైడ్రా అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పోరాటానికి సహకరించిన ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులకు, సిఆర్‌పిఎఫ్, తల్లుల సంఘం ఇతర సానుభూతిపరులందరికీ మల్లికార్జున్ రెడి ప్రత్యేక ధన్యవాదాలు అన్ని తెలిపారు.

**కోర్ట్, ఇంజక్షన్ ఆర్డర్లు ఇప్పుడు ఏమయ్యాయి?**

పాఠశాలకు దారిని ఏర్పాటు చేయాలని గతంలో జిహెచ్‌ఎంసి అధికారులకు వినతిపత్రాలు సమర్పిస్తే కోర్టు విచారణలో ఉందని, ఇంజక్షన్ ఆర్డర్లు ఉన్నాయని సంబంధిత అధికారులు సమస్యను దాటవేస్తూ వచ్చారని సిపిఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున్ రెడ్డి శాంతియుత దీక్షతో ఒక్కరోజులో ఆగమేఘాల మీద హైడ్రా, టౌన్ ప్లానింగ్ అధికారులు ప్రహరీ గోడను కూల్చి వేశారని, ఇప్పుడు ఇంజక్షన్ ఆర్డర్లు అధికారులకు అడ్డు రాలేదా అని ఆయన ప్రశ్నించారు. దీన్నిబట్టి ఇంతకాలం అధికారులు కావాలనే సమస్యను పరిష్కరించకుండా కాలయాపన చేశారనే స్పష్టం తెలుస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పట్ల అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించాలని, ఆమ్యామ్యాలకు అలవాటుపడి ప్రజా సమస్యలను గాలి వదిలేయడం సరికాదని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. ప్రహరీగోడను తొలగించాలని గతంలో సంబంధిత అధికారులకు, ప్రభుత్వానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివ రావు లేఖలు రాశారని తెలిపారు. సమస్య పరిష్కారమైనందుకు కాంపల్లి శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

# పకడ్బందీగా న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రాం

### మేడ్చల్ జిల్లాలో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దటమే లక్ష్యం





**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** మేడ్చల్ జిల్లాలో ఈ విద్యా సంవత్సరంలో 47,867 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకుగాను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రాంను పకడ్బందీగా అమలు చేయనున్నామని జిల్లా విద్యా శాఖాధికారి విజయకుమారి (డిఇఒ) తెలిపారు. జిల్లాలోని ప్రతి గ్రామంలో పాఠశాల, గ్రామ పంచాయతి, ఇతర భవనాల్లో సామాజిక చైతన్య కేంద్రాలను ఏర్పాటు చేస్తామని, 10 మంది కానీ అంతకు తక్కువ కానీ నిరక్షరాస్యులకు స్వచ్ఛంద వాలంటీర్ల ద్వారా పాఠ్య పుస్తకాలు, బోధనా సామగ్రిలతో ఉచిత బోధన ఉంటుందన్నారు. ఈ కార్యక్రమ నిర్వహణ సంబంధించి మంగళవారం ఎంఇఒలు, డిఆర్‌డిఎ, ఎస్ఇఆర్‌పి, ఫీల్డ్ ఫంక్షనీర్ల అవగాహనా సదస్సు జరిగింది. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ 14 ఏళ్లపైబడి పదో తరగతి, ఇంటర్ ఫెయిల్, మధ్యలోనే మానేసిన వారందరికి ఈ శిక్షణ ఇచ్చి ఓపెన్ స్కూల్ ద్వారా పరీక్షలు రాయించి ఉత్తీర్ణత సర్టిఫికెట్లు అందచేస్తామన్నారు. అంగ వైకల్యం ఉన్న వారిని భవిత కేంద్రాల్లో చేర్పించి వారికి ఉచిత ఆహారం, విద్యా బోధన అందిస్తారన్నారు. ఈ విద్యాబోధనలో ప్రాథమిక అక్షరాస్యత, కీలకమైన జీవన నైపుణ్యాలు, ప్రాథమిక విద్య, వృత్తి నైపుణ్యాలు, నిరంతర విద్య లక్ష్యాలన్నారు. దేశంలో నిరక్షరాస్యతను నిర్మూలించే కేంద్ర ప్రభుత్వ లక్ష్యంలో భాగంగా చేపట్టిన న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రాం కింద నూతన విద్యా విధానం NEP 2010 అమలులో భాగంగా కేంద్రప్రభుత్వం 2022–27 వరకు మొదటి దశలో దేశ వ్యాప్తంగా కోటి మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు గాను NCERT ద్వారాసెంటర్ ఫర్ నేషనల్ లిటరసీ విభాగాన్ని ఏర్పాటు చేసి రాష్ట్రాల్లో SCERT, SCLల ద్వారా వయోజన విద్య కల్పిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు సమకూరుస్తుందన్నారు. 15 ఏళ్ల నుండి 45ఏళ్ల లోపున్న పూర్తిగా చదువు రాని నిరక్షరాస్యులు, మధ్యలో మానేసిన వారికి ఈ శిక్షణ కోసం ఆధార్, ఓటర్, రేషన్ కార్డుల ద్వారా చేర్చుకొంటారన్నారు. ఈ సదస్సులో వయోజనవిద్య డిడి నాగలక్ష్మి , ఆర్ఎస్ఈటిఐ డైరెక్టర్లు కృష్ణ, బి.సురేందర్ బాబు, మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జి ప్రాజెక్టు అధికారి అనిత, ఏపిఓ శ్రీనివాస్ బాబు, డిపిఆర్ఓ స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

# ఏప్రిల్ నాటికి సుంకిశాల ప్రాజెక్టు పూర్తి

### జలమండలి ఎండి. అశోక్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదారాబాద్‌కు కృష్ణాజలాల తరలింపుకోసం చేపట్టిన సుంకిశాల ఇంక్ వెల్ పనులను ఏప్రిల్ నాటికి పూర్తి చేయాలని జలమండలి ఎం.డి. అశోక్ రెడ్డి అన్నారు. మేఘా ఇంజనీరింగ్ సిఈఓ, డైరెక్టర్, హైద్రాబాద్ ఐఐటి ప్రొఫెసర్లు, టిసిఎస్, గేట్ల ఎక్స్ పర్ట్ కన్నయ్య నాయుడు, ఇతర నిపుణులతో కలిసి మంగళవారం ఆయన సుంకిశాల ప్రాజెక్టు పనులను పరిశీలించారు. జలమండలి ఎం.డి. ఉన్నత అధికారులతో కలిసి పైపులైను విస్తరణ పనులను పరిశీలించారు. ఇప్పటి వరకు మిగిలిపోయిన పైపులైను పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పైపులైను నిర్మాణ నాణ్యతలో రాజీ పడకూడదని అధికారులకు ఆయన సూచించారు. వర్షాకాలం సమీపించిన తరుణంలో పైపు విస్తరణ పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

అనంతరం నిర్మాణ సంస్థ సిఈఓ శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఇతర నిపుణులతో కలిసి సుంకిశాల పునర్నిర్మాణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను, రెడిజైనింగ్ సంబంధించిన అంశాలపై చర్చించారు. శిథిలాల తొలగింపు అనంతరం సివిల్ పనులు, కంట్రోల్ రూం పనులను వేగంగా ముగిస్తే సైడ్ వాల్ పునర్నిర్మాణానికి మార్గం సులభం అవుతుందని అంచనా వేశారు. అనంతరం నాగార్జున సాగర్ జలాశయం వైపు ఉన్న టన్నెలింగ్ ఫ్లగ్గింగ్ పనులను పరిశీలించారు. అలాగే ప్రతీ టన్నెలింగ్ వద్ద గేట్ల నిర్మాణం, డిజైన్లను సంబంధించిన వివరాలను నిపుణుడు కన్నయ్య నాయుడుతో చర్చించారు.

ఈ సందర్భంగా ఎండి అశోక్ రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే పైపులైను విస్తరణ పనులు 4 కిలోమీటర్లు మినహా మిగతా ప్రాంతాలలో పూర్తి చేశామని, ఎలక్ట్రిక్ పనులు సైతం చివరి దశకి చేరుకున్నాయన్నారు. రిటైనింగ్ వాల్ శిథిలాలను తొలగింపు పూర్తిచేసి పునర్నిర్మాణం పనులు మొదలు పెట్టాలని, దానికి సంబంధించిన డిజైన్లు, డ్రాయింగ్‌లను 15 రోజుల లోగా ఫైనలైజ్ చేయాలని ఆదేశించారు. దానికోసమే నిర్మాణ సంస్థ సిఈఓ, డైరెక్టర్, అధికారులు, నిపుణులతో సుదీర్ఘంగా చర్చించారు. పునర్నిర్మాణ పనులు చేపట్టి ప్రాజెక్టును వచ్చే ఏప్రిల్ వరకు పూర్తి చేయాలని నిర్మాణ సంస్థ ప్రతినిధులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ టివి శ్రీధర్, హైదరాబాద్ ఐఐటి ప్రొఫెసర్లు శశిధర్, సురేంద్రనాథ్, గేట్ల రూపకర్త కన్నయ్య నాయుడు, టిసిఈ ప్రతినిధి నితీష్, ఇతర అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



## ఉప్పల్ ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణానికి సహకరిస్తా : మంత్రి దుద్దిళ్ల హామీ


**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** ఉప్పల్ ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణానికి తన వంతుగా సహకరిస్తానని రాష్ట్ర ఐటి శాఖ మంత్రి, మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హామీ ఇచ్చారు. మంగళవారం టియుడబ్ల్యుజె మేడ్చల్ జిల్లా కమిటీ జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాలరాజ్, ప్రధాన కార్యదర్శి వెంకట్రామిరెడ్డి తదితరులు మంత్రితో పాటు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని సచివాలయంలో కలిసారు. అనంతరం జర్నలిస్టుల ఇళ్ల పట్టాలు, ఇతర సమస్యలపై చర్చించిన అనంతరం మంత్రి జర్నలిస్టులకు అండగా ఉంటానని, ప్రజలకు ప్రభుత్వానికి వారధిలాగా బాధ్యత వహించే జర్నలిస్టుల పాత్ర ముఖ్యమైందన్నారు.

## అటవీ భూమి కబ్జాదారులపై అధికారుల జాలి... తూతూ మంత్రంగా కేసులు..

ప్రజాపక్షం ఎఫెక్ట్

**ప్రజాపక్షం / కొడంగల్ :** కొడంగల్ నియోజకవర్గంలో ఇటీవలే ప్రజాపక్షం దినపత్రికలో ప్రచురితమైన 'అటవి భూమి అన్యక్రాంతం' అనే శీర్షికపై అధికారులు స్పందించి హంగామా సృష్టించారు. అంతర్గతంగా ఉన్న విషయాలను బట్టబయలు చేయడంతో అధికారులు నిందితులపై కేసులు నమోదు చేస్తామని, భారీ జరిమానాలు విధించి అతడిని రిమాండ్‌కు తరలిస్తామని చెప్పినట్లు సమాచారం. అటవీ శాఖ డిఎఫ్ఓ ఫ్లైయింగ్ స్క్వాడ్ సైతం అటవి ప్రాంతాన్ని పరిశీలించి నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రగల్భాలు పలికినట్లు విశ్వసనీయ సమాచారం. కాని చివరకు ఆ తంతంగం మొత్తం తారుమారు అవుతున్నట్లు పలువురు అటవీ ప్రేమికులు ఆరోపణలు చేస్తు అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై అనేక విమర్శలకు తావిస్తుందని అవేదన వ్యక్తం చేస్తున్నారు. కొడంగల్ ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని సీరియల్ నెంబర్(292), తిరుమలాపూర్ అటవీ ప్రాంతంలోని ఎన్కెపల్లి గ్రామానికి చెందిన పూజారి నర్సింహులు అనే వ్యక్తికి పట్టాభూమి ఉంది. అదే అదునుగా తీసుకున్న ఆ వ్యక్తి అటవి భూమిని సైతం దాదాపు 8 ఎకరాలు కబ్జాకు గురి చేసినట్లు గ్రామస్థులు ఆరోపణలు చేస్తున్నారు. దీనిపై'ప్రజాపక్షం'అక్కడికి వెళ్లి వాస్తవాలను వెలికితీసి వార్తను ప్రచురించడంతో అధికారులు స్పందించారు. 8 ఎకరాల ఆరోపణలు ఉంటే ఫారెస్ట్ రేంజ్ అధికారి కేవలం 3.5 ఎకరాల అటవి భూమి కబ్జాకు గురి చేసినట్లు వెల్లడించారు. దీనిపై 10 రోజులుగా అధికారులు నిందితులపై చర్యలు తీసుకునేందుకు అనేక కారణాలు చెబుతు తప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. తాజాగా జిల్లా అటవీశాఖ అధికారి జ్ఞానేశ్వర్‌ను సంప్రదించి వివరాలు సేకరించగా పూజారి నర్సింహులు అనే వ్యక్తికి ఫారెస్ట్ మధ్యలో కొంత పట్టాభూమి ఉందన్నారు. కాగా అతను కేవలం 1.5 ఎకరాల భూమిని ఆక్రమించుకున్నారని, కొన్ని చెట్లు నాశనం చేయగా, మరికొంత ఫారెస్ట్‌లో మట్టినితీసి రోడ్డు వేయడం జరిగిందన్నారు. జరిగిన నష్ట పరిహారం దాదాపు 20లక్షలకు పైగా ఉన్నట్లు తెలిపారు. కాని వారు అనుభవిస్తున్న తీరుపై కేవలం 95వేలు మాత్రమే జరిమాన విధించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. కబ్జా గురిచేసిన వాళ్లు పేద రైతులు కాబట్టి వారితో అగ్రిమెంట్ బాండ్ పేపర్‌లో ఒప్పంద పత్రాన్ని వ్రాయించుకుని రాజీ కుదుర్చు కున్నట్లు విశ్వసనీయ సమాచారం. అయితే పూజారి నర్సింహులు అనే వ్యక్తిపై సెక్షన్ 20(1)(సి) కింద కేసు నమోదు చేసినట్లు డిఎఫ్ వో తెలిపారు. నాశనం చేసిన చోటనే తిరిగి అతడి తో చెట్టు నాటించి వాటిని సంరక్షించే బాధ్యత అప్పగించడం, కబ్జాకు గురి అయిన భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవడం జరుగుతుందని తెలిపారు. అటవి భూమిలను సంరక్షించేందుకు జిల్లాలో అనేక అవగాహన కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని తెలిపారు.


## గ్లో బై కీర్తిలాల్స్ 'లిల్ డాజిల్' సరికొత్త చెవిపోగులు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గ్లో బై కీర్తిలాల్స్ పిల్లల కోసం ప్రత్యేకంగా రూపొందించిన 'లిల్ డాజిల్' అనే సరికొత్త చెవిపోగులు సేకరణను ఆవిష్కరించింది. ఈ ప్రత్యేక కలెక్షన్ గ్లో షోరూమ్‌ల్లో అందుబాటులో ఉంటుందని కీర్తిలాల్ డైరెక్టర్ సూరజ్ శాంత కుమార్ చెప్పారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని చిరంజీవి ఐ, బ్లడ్ బ్యాంక్ ఎదురుగా ఉన్న గ్లో బై కీర్తిలాల్స్ షోరూమ్‌లో లేదా www.glowjewels.com వెబ్ సైట్‌లో ఈ ప్రత్యేకమైన సేకరణ ఇప్పుడు అందుబాటులో ఉందన్నారు. ఇది ప్రీమియం ఆభరణాల శ్రేణికి ఆనందదాయకమైన కొత్త ప్రారంభాన్ని సూచిస్తుందన్నారు. పిల్లల కోసం అత్యంత శ్రద్ధతో, శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని రూపొందించబడిన లిల్ డాజిల్ కలెక్షన్, తేలికపాటి, సురక్షితమైన, సౌకర్యవంతమైన ఆభరణాలతో రూపొందించబడిందన్నారు. ఈ శ్రేణిలో బంగారం, వజ్రాలతో తయారు చేయబడిన అందమైన డిజైన్లు, పుట్టినరోజులు, బహుమతులివ్వడం లేదా స్కూల్ మొదటి రోజు లాంటి మధురమైన క్షణాలను పురస్కరించుకోవడానికి చాలా అనుకూలంగా ఉంటాయన్నారు. లిల్ డాజిల్ కలెక్షన్ ధరలు కేవలం రూ.20,000 నుండి ప్రారంభమవుతాయి అన్నారు. ఇవి నాణ్యత, హస్తకళకు అత్యున్నత ప్రమాణాలను కలిగివుంటాయని, లిల్ డాజిల్ ద్వారా గ్లో బై కీర్తిలాల్స్ అందాన్ని పిల్లల స్నేహపూర్వక ఆవిష్కరణను మిళితం చేస్తోందని చెప్పారు.

# సేవా దృక్పథంతో రోగులకు వైద్య సేవలు

### కలెక్టర్ ప్రతీక్‌జైన్ సూచన



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి:** సేవా దృక్పథంతో రోగులకు వైద్యసేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ సూచించారు. మంగళవారం జనరల్ ఆసుపత్రిల నిర్వహణ, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై వైద్య అధికారులుతో సమిక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రి నిర్వహణ ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రైవేట్ ఆసుపత్రిలకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యసేవలు అందించాలని కలెక్టర్ తెలిపారు. రోగులకు సౌకర్యవంతంగా ఉండేలా కౌంటర్లను ఏర్పాటు చేయాలన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఆలా అధికంగా ఉండే విధంగా ఆవరణలో మంచి మొక్కలతో సుందరీకరణ చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ప్రతి బ్లాక్ అందుబాటులో ఉండే విధంగా విభాగాల వైద్యుల వివరాలకు సంబంధించిన సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఆసుపత్రిలో కావాలసిన సౌకర్యాలపై ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. జనరల్ ఆసుపత్రి ఏరియా ఆసుపత్రుల్లో బ్లాక్‌ల వారీగా ప్రతిగదికి సంఖ్య వేయ్యాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఆసుపత్రిలోని గోడలపైన పోస్టర్లు ప్రదర్శించకుండా ఆసుపత్రి ఆవరణ శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా కేంద్రంలో ఉన్న ఏరియా ఆసుపత్రి ఆవరణలో ఉన్న మార్చురీ శవాలగదిని విస్తీర్ణం చేసి మరమ్మత్తు పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్ శాఖ ఇఇ ఉమేష్‌ను ఆదేశించారు. ఏరియా ఆసుపత్రిని పూర్తిగా శుభ్రంచేసి వైట్ వాష్ చేయించాలని కలెక్టర్ అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యకళాశాల ప్రిన్సిపల్ మల్లిఖార్జున, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ రామచందర్‌రావు డిసిహెచ్‌ఓ డాక్టర్ ఆనంద్, సిబ్బంది పాల్గొన్నారు.

**29న తాండూరులో మెగా జాబ్ మేళా**

**ప్రజాపక్షం/తాండూరు:** నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 29 తాండూరులో నిర్వహించే మెగా జాబ్ మేళాను విజయవంతం చేయాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్ అధికారులకు సూచించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జాబ్ మేళా తాండూరు ఎంఎల్‌ఏ బుయ్యని మనోహర్ రెడ్డితో కలసి జిల్లా అధికారులతో సమన్వయ కమిటి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని సద్దుదేశంతో ఉపాధి కల్పన, మార్కెటింగ్ మిషన్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళాను నిర్వహించడం జరుగుతుందన్నారు. 52పారిశ్రామిక రంగాల్లో 11వేలమంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ నెల 29న తాండూరులో నిర్వహించే మెగా జాబ్ మేళాను ప్రతిష్టాత్మకంగా తీసుకొని జాబ్‌మేళాకు విచ్చేసే నిరుద్యోగులకు మౌళిక సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి సంకల్పం మేరకు నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో తాండూరులోని వినాయక కన్వెన్షన్ హాల్‌లో ఈ నెల 29న మెగా జాబ్ మేళాను నిర్వహించడం జరుగు తుందన్నారు.

గ్రామీణ ప్రాంతాల నిరుద్యోగ యువతకు సమాచారాన్ని చేర వేసేందుకు అధికారుల పాత్ర ఎంతో ముఖ్యమన్నారు. జాబ్ మేళా ద్వారా నిరుద్యోగులకు మంచి అవకాశాలు కల్పించే వారమవుతామన్నారు. జాబ్ మేళాలో అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో భాగంగా స్టాళ్లను ఏర్పాటు చేసి తమ వంతు సహాయ సహకారాలు అందిజేస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధనపు కలెక్టర్ సుధీర్, ఎజిఎంఎం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కృష్ణన్ జెడిఎం సతీష్, తాండూరు సిడిపిఒ శ్రీలత, మున్సిపల్ కమీషనర్ విక్రమ్ సింహారెడ్డి, ఎంపిడిఒలు, ఎంపిఒలు పాల్గొన్నారు.



## మహిళలు పారిశ్రామిక రంగంలోఎదగాలి

**ప్రజాపక్షం యాచారం :** మహిళలు పారిశ్రామిక రంగంలో అభివృద్ధి చేంది పారిశ్రామిక వేత్తలుగా మారాలని సేవా స్ఫూర్తి పౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ రత్కార్ అన్నారు. మంగళవారం యాచారం మండల కేంద్రంలో ర్యాంపు పథకంపై అవగాహణ సదస్సు నిర్వహించారు. ఈ సంధర్భంగా రత్నాకర్ మాట్లాతూ మహిళలు పారిశ్రామిక రంగంలో ఎదిగి ఎంతో అభివృద్ధి సాధించాలని అన్నారు.రైజింగ్ అండ్ యాక్సిలరెటింగ్ ప్రపంచబ్యాంక్ నిధులతో ఎంఎస్ఎంఎ భారత ప్రభుత్వం సూచించిన సూక్ష్మ , చిన్న మధ్యత రహ పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవడానికి వీలు కల్పించిదని అన్నారు.పదిహేను రోజులు వివిధ నైపుణ్యాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని అన్నారు.ఎస్ హెచ్ జి మహిళల కోసం అంకుర సంస్థ ఉచితంగా నిర్వహిస్తుందని అన్నారు. జిల్లా పేద రిక నిర్మూళన సంస్థ సహకారం అంద జేస్తుందని అన్నారు.సోంత వ్యాపారాన్ని నిర్వహించడానికి ఎంతగానో శిక్షణ ఉపయోగ పడుతుందని కవిత, మల్లిక అన్నారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయధికారి అర్ రవినాథ్,ఎపిఎం సాంబ శివుడు,జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ నర్సింహులు,కోర్డినేటర్ కిరణ్,మండల వ్యసాయ విస్తరణ అధికారి వసంత, తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులు ఇందిరమ్మ ఇండ్లు కట్టుకునే విధంగా చూడాలి

**ప్రజాపక్షం/యాచారం :** ఇందిరమ్మ ఇండ్లు వచ్చిన పేదలందరూ ఇండ్లు కట్టుకునే విధంగా పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి మాధవరావు కోరారు. మంగళవారం యాచారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సంధర్బంగా మండల ప్రత్యేకాధికారి మాట్లాడుతూ ప్రభుత్వ నియమ నిబంధనలప్రకారం ఇందిరమ్మ ఇండ్లు కట్టుకోవాలని అన్నారు. ప్రభుత్వం స్కోయర్ పిటుకు 1250 రూపాయలు చెల్లిస్తుందని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధి దారులు మూడు నెలల్లో ఇండ్లు పూర్తి చేయాలని అన్నారు. ప్రభుత్వం ఇండ్ల నిర్మాణం కోసం 5 లక్షల రూపాయలు ఇస్తున్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. ఉపాధి కూలీలందరికి పని కల్పించాలన్నారు. నర్సరీలో పెంచుతున్న మొక్కలు ఎండిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శైలజా,ఎంపిఒ శ్రీలత,ఉపాధి ఎపిఒ లింగయ్య,ఇంజనీర్ శివ శంకర్‌రెడ్డి ఉపాధి సిబ్బంది,పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## నకిలీ వైద్యచికిత్సలపై పోరాటం ఆగదు

ఫిట్‌నెస్ ట్రైనర్ పూర్ణిమ



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** నకిలీ వైద్య చికిత్సలపై పోరాటాన్ని కొనసాగిస్తూనే, ప్రజల్లో చైతన్యం తెస్తున్నామని ఫిట్‌నెస్ ట్రైనర్ మాండవ పూర్ణిమ తెలిపారు. మంగళవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో లీగల్ అడ్వకేట్ హనుమంతరావుతో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. ఇటీవల నకిలీ డాక్టర్లు, క్లినిక్‌లతో అనేకమంది ప్రజలు రూ.లక్షలు కుమ్మరించి, వ్యాధి నయంకాక మోసపోతున్నారని తెలిపారు. కొన్ని మేకప్ ఇతర చర్మ సంబంధ చికిత్సలు అందిస్తున్న సంస్థల అనైతిక చర్యలపై తాము ప్రజల్లో అవగాహన తీసుకువస్తున్న క్రమంలో తమ పట్ల దూషణకు దిగడంతో పాటు చట్టపరంగా చర్యలు తీసుకొంటామని చెప్పడం హాస్యాస్పదంగా ఉన్నదన్నారు. అలాంటి వారిపై న్యాయస్థానంలో ఫిర్యాదు చేస్తామన్నారు. అర్హత లేని వ్యక్తులు డాక్టర్ అనే పేరు ధరించి ప్రజలను తప్పుదారిపట్టిస్తున్నారని ఆరోపించారు. వీటిపై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఫిట్‌నెస్ సంస్థ కోఫౌండర్ రఘు, ప్రజా విశ్లేషకుడు శ్రీను, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ తేవాలి

హైకోర్టు న్యాయవాది భానుమూర్తి



**ప్రజాపక్షం /ఖైరతాబాద్ :** ఇటీవల న్యాయవాదులపై దాడులు పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం 'అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్' తేవాలని హైకోర్టు న్యాయవాది బాల భానుమూర్తి కోరారు. మంగళవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ సీనియర్ సిటిజన్ల కేసులు సత్వరమే పరిష్కరించే దిశగా న్యాయవ్యవస్థ ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. 20ఏళ్ల క్రితం కోర్టులో కేసు వేసిన నా క్లయింట్‌లపై హత్యాయత్నం చేశారని, కానీ ఇప్పుడు న్యాయవాదిగా తనను దెబ్బతీయాలని లేదా చంపాలని నా క్లయింట్‌లే ప్రయత్నం చేశారన్నారు. న్యాయవాదులుపై దాడులు, హత్యలు ఎందుకు జరుగుతున్నాయో చర్చించాల్సిన అవసరం ఉన్నదన్నారు. తప్పుడు కేసులు పెట్టిన వారికి శిక్ష, బాధితులకు నష్టపరిహారం ఇవ్వాలని భానుమూర్తి కోరారు.

## ప్రథమ చికిత్సపై అవగాహన

సిపిఐ రాష్ట సమితి సభ్యుడు రామస్వామి



**ప్రజాపక్షం/షాబాద్ :** ప్రతిఒక్కరికి ప్రథమ చికిత్సపై అవగాహన ఉండాలని సిపిఐ రాష్ట సమితి సభ్యులు రామస్వామి అన్నారు. మంగళవారం చేవెళ్ల పట్టణ కేంద్రంలో రెండవ రోజు జనసేవ దళ్ శిక్షణ కార్యక్రమంలో ప్రథమ చికిత్స అంటే ఏమిటీ ఎలా చేయాలి అనే అంశంపై ఆలూర్ ప్రభుత్వ ఆసుపత్రి వైద్య అధికారుల ద్వారా మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉన్నపుడే అన్ని రంగాల్లో రాణిస్తారని పేర్కొన్నారు. ఎఐటియుసి జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు నిరుపేదలకు అందేవిధంగా సిపిఐ పోరాటాలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో సిపిఐ చేవెళ్ల నియోజకవర్గ వివిధ మండల కార్యదర్శులు సత్తిరెడ్డి, శ్రీనివాస్, నక్కల జంగయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్ల మంజుల తదితరులు పాల్గొన్నారు

## కార్మికుల శ్రమతోనే ప్రగతి

సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఓరుగంటి యాదయ్య



**ప్రజాపక్షం/తుర్కయంజాల్ :** కార్మికుల శ్రమ లేకుండా ప్రగతి లేదని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఓరుగంటి యాదయ్య అన్నారు. మంగళవారం భవన నిర్మాణ కార్మికుల తుర్కయంజాల్ శాఖ మహాసభ స్థానిక నాయకులు భాస్కర్ అధ్యక్షతన జరిగింది. మహాసభకు ఓరిగంటి యాదయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసంఘటిత రంగ కార్మికులకు ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నెలకు రూ.7,500 పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎర్రజెండా ప్రజల సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తుందన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన శాఖ కార్యదర్శి ఎస్.దేవ నాయక్, సహాయ కార్యదర్శిగా నాగేశ్వరరావును ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా హనుమంతు, శంకర్ నాయక్, రాములు, లక్ష్మి, నీలా విజయ కోటియా నాయక్, నరసింహలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు పి.శివకుమార్ గౌడ్, నాయకులు భాస్కర్, సుందరమ్మ పాల్గొన్నారు.

## ట్రాక్టర్ల యజమానులను కాపాడండి

సిపిఐ శేరిలింగంపల్లి కార్యదర్శి రామకృష్ణ వినతి



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** రాంకీ సంస్థ అడ్డగోలిగా పెంచిన ధరలను తగ్గించుకొని ట్రాక్టర్ల ఓనర్లను కాపాడాలని సిపిఐ శేరిలింగంపల్లి కార్యదర్శి రామకృష్ణ పెర్కోన్నారు. మంగళవారం ట్రాక్టర్ల ఓనర్లు , సిపిఐ శేరిలింగంపల్లి కార్యదర్శి రామకృష్ణతో కలసి జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాంకీ సంస్థ ఆగడాలకు అడ్డు, అదుపు లేకుండాపోయిందని, ట్రాక్టర్ డిస్మెటల్ 350 రూపాయలు ఉన్న ధరను ఏకంగా 850 రూపాయలకు పెంచారని పెరిగిన డిజిల్, పెట్రోల్ ధరలు, ట్రాఫిక్ చాలన్లతో సతమతమౌతుంటే ఇంత పెద్ద మొత్తంలో ధరలను పెంచితే సామాన్య ట్రాక్టర్ ఓనర్ల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. పెంచిన ధరలను తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీకాంత్, ఎల్లప్ప, ట్రాక్టర్ల ఓనర్లు, సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

# ప్రారంభానికి సిద్ధమైన శిల్ప లేఔట్ ఫ్లైఓవర్ బ్రిడ్జి





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) నుండి కొండాపూర్ ఫ్లై ఓవర్ త్వరలో ప్రారంభం కానుంది. ఈ ఫ్లైఓవర్ అందుబాటులోకి వస్తే హైదరాబాద్ నగరవాసులకు, ముఖ్యంగా ఐటి కారిడార్‌లో ప్రయాణించే వారికి ఎంతో ప్రయోజనం కలుగుతుంది. ఔటర్ రింగ్ రోడ్డు నుండి కొండాపూర్‌కు వెళ్లే అత్యాధునిక మల్టీలెవెల్ ఫ్లైఓవర్ నిర్మాణం దాదాపు పూర్తయింది. ఈ ఫ్లైఓవర్‌ను రాష్ట్ర ముఖ్యమంత్రి జూన్ మొదటి వారంలో ప్రారంభించనున్నారు. ఈ ఫ్లైఓవర్ అందుబాటులోకి వస్తే గచ్చిబౌలి జంక్షన్ వద్ద ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గుతుంది. ప్రయాణ సమయం కూడా ఆదా అవుతుంది. ఈ నెలాఖరులోగా పనులు పూర్తి చేసి, త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈఫ్లైఓవర్ ప్రా రంభం హైదరాబాద్ మౌలిక సదుపాయాల అభివృద్ధిలో ఒక ముఖ్యమైన అడుగు అవుతుంది. ఈ ఫ్లై ఓవర్‌ను పూర్తి చేయడానికి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ పలు మార్లు పర్యటించి, పనులు వేగవంతంగా పూర్తి చేసేందుకు ప్రాజెక్టు ఇంజనీర్లను ఆదేశించారు. ఎస్ఆర్‌డిపి ద్వారా హైదరాబాద్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్ద పీఠ వేసిన నేపథ్యంలోఈ ప్రాజెక్టు ద్వారా 23వ ఫ్లైఓవర్ అందుబాటులోకి రానున్నది. ఎస్ఆర్‌డిపి ద్వారా చేపట్టినా ఫ్లై ఓవర్‌లు నగరంలో ట్రాఫిక్ అంతరాయం లేకుండా నేరుగా నిర్దేశించిన సమయంలో గమ్య స్థానానికి చేరుకోవచ్చు. ఎస్ఆర్‌డిపి ద్వారా చేపట్టిన మొత్తం 42పనులలో ఈ ఫ్లైఓవర్‌తో 37పనులు పూర్తి అయ్యా యి. ఫలక్‌నుమా రైల్వే ఓవర్ బ్రిడ్జి , శాస్త్రి పురం ఆర్ఓబి పనులు రైల్వే పోర్షన్ రెండు మూడునెలల్లో పూర్తి చేయాలని టార్గెట్ నిర్ణయించి కమిషనర్ ఆర్‌వి కర్ణన్ రైల్వే అధికారులను కోరారు. వారికి జులై నెల చివరి వరకు ఫలక్ నూమా ఆర్ఓబి, ఆగస్టు నెల చివరి వరకు శాస్త్రిపురం ఆర్ఓబి పనులను పూర్తిచేయాలని కమిషనర్ లక్ష్యంగా నిర్ధేశించారు. ఈ రెండు ఆర్ఓబిలు పూర్తయితే ఎస్ఆర్‌డిపి పనులు 39 పనులు పూర్తి అవుతాయి.

### ప్రాజెక్టు వివరాలు

ఈ ఫ్లైఓవర్‌ను రూ.178 కోట్ల వ్యయంతో వ్యూహాత్మక రోడ్డు అభివృద్ధి కార్యక్రమం(ఎస్ఆర్‌డిపి) ద్వారా నిర్మించారు. 1.2 కిలోమీటర్ల పొడవు, 24 మీటర్ల వెడల్పుతో ఆరు లేన్‌లతో ఈ బ్రిడ్జిని నిర్మించారు. దీని ప్రత్యేకత ఏమిటంటే, ఇది ఇప్పటికే ఉన్న రెండు ఫ్లైఓవర్లపై నిర్మించిన మూడవ స్థాయి నిర్మాణం. కింద గచ్చిబౌలి జంక్షన్ ఫ్లైఓవర్, దానిపై శిల్పా లేఔట్ ఫేజ్ 1 ఫ్లైఓవర్ ఉండగా, ఇప్పుడు దానికి పైన ఫేజ్ 2 ఫ్లైఓవర్ నిర్మించారు.

### మెరుగైన కనెక్టివిటీ

ఒఆర్ఆర్ నుండి కొండాపూర్, హఫీజ్‌పేట్ మార్గాల్లో వెళ్లే వాహనాలకు ఇది అనుకూలం గా ఉంటుంది. హైటెక్ సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌కు మెరుగైన కనెక్టివిటీ లభిస్తుంది. ప్రయాణ సమయం ఆదాతో పాటు గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకోకుం డా వేగంగా గమ్యస్థానాలకు చేరుకోవచ్చు. కొండాపూర్ ప్రాంతం నుండి శంషాబాద్ ఎయిర్ పోర్ట్ అక్కడి నుండి కొండాపూర్ ప్రాంతాలకు వెళ్ళేందుకు గచ్చిబౌలి వద్ద ఎలాంటి ట్రాఫిక్ జామ్ లేకుండా నేరుగా వెళ్లే వెసులుబాటు కలుగుతుంది.

### త్వరలో ప్రారంభం కానున్న హెచ్ సిటీ పనులు

ప్రజాపాలన ప్రభుత్వం అధికారంలోకి రావడం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ నగరాన్ని అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చేందుకు మౌలిక సదుపాయాలకు పెద్ద పీఠ వేశారు.

గతంలో జిహెచ్ఎంసికి ఇచ్చిన హామీ మేరకు నగర అభివృద్ధికి నిధులను మం జూరు చేసి జిహెచ్ఎంసికి ఆర్థిక ఇబ్బందులు లేకుండా చేస్తున్నారు. ప్రజా పాలన ప్రభుత్వంలో నగర అభివృద్ధికి హెచ్ సిటీ ద్వారా రూ.7032 కోట్ల వ్యయంతో 58 పనులు చేపట్టనున్నారు. అందులో 28 ఫ్లైఓవర్లు, 13 అండర్ పాస్‌లు, ఆర్ఓబిలు 4, రైల్వే అండర్ బ్రిడ్జి 3, రోడ్డు వెడల్పు 10 పనులను చేపట్టేందుకు ప్రతిపాదించారు. ఈ పనులను టెండర్ దశ పూర్తిచేసి, అగ్రిమెంట్ దశలో ఉన్నాయి. ఈ పనులను కొన్ని జూన్ మాసంలో ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి.

# మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం పనిచేస్తోంది



మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఓబెదుల్లా కొత్వాల్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** మైనార్టీ సంక్షేమానికి ప్రజాపాలన ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందని రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఓబెదుల్లా కొత్వాల్ అన్నారు. మంగళవారం ఫరూఖ్‌నగర్ ఎంపిడిఒ కార్యాలయం సమావేశ మందిరంలో మైనార్టీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 258 మంది మైనార్టీ మహిళలకు కుట్టు మిషన్లను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ చైర్మెన్ ఓబెదుల్లా కొత్వాల్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పడిన తరువాతే మైనార్టీల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.250కోట్లు కేటాయించడం జరిగిందరి వివరించారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయాలన్నదే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని వివరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటి వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, పట్టణ అధ్యక్షుడు చెన్నయ్య, మండల పార్టీ అధ్యక్షులు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, జంగ నర్సింలు, కృష్ణారెడ్డి, రాజు, వీరేశం, మాజీ జడ్పిటిసి వెంకట్‌రాంరెడ్డి, కాంగ్రెస్ శ్రేణులు చెంది తిరుపతిరెడ్డి, జమృద్‌ఖాన్, మాజీ కౌన్సిలర్ సర్వర్ పాషా, శ్రీనునాయక్, లింగారెడ్డిగూడ అశోక్, సీతారాములు పాల్గొన్నారు.

**జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి ...** భారత తొలి ప్రధాన మంత్రి పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ వర్థంతి సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నివాళులర్పించారు. మంగళవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో జవహర్‌లాల్ నెహ్రూ చిత్ర పటానికి నివాళ్ళు అర్పించారు. కార్యక్రమంలో మైనార్టీ కార్పోరేషన్ చైర్మన్ ఓబెదుల్లా కొత్వాల్, పట్టణ అధ్యక్షుడు చెన్నయ్య, చెంది తిరుపతిరెడ్డి, అగ్గనూరి బస్వం, సర్వర్‌పాషా, అన్వర్, దేవేందర్, రాయికల్ శ్రీనివాస్, శ్రీనునాయక్, తుపాకుల శేఖర్, మంకాల శ్రీశైలం, నీరటి వాసు, గంగనమోని సత్తయ్య పాల్గొన్నారు. అనంతరం శనీశ్వరస్వామిని దర్శించుకొని ఎమ్మెల్యే శంకర్ ప్రత్యేక పూజలు చేశారు.

### ఎమ్మెల్యేకు సన్మానం

**ఫరూఖ్‌నగర్:** ఎన్నో ఏళ్ల నుండి ఎదురు చూస్తున్న ప్రజల చిరకాల కోరిక చటాన్‌పల్లి రైల్వేబ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టడం శుభ పరినామమని రంగారెడ్డి జిల్లా బిసి మహాసభ యువత అధ్యక్షుడు ఎవిఎం శ్రీధర్ వర్మ ముదిరాజ్ అన్నారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను పూలమాల, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో బిసి మహాసభ ప్రధాన కార్యదర్శి మానవపాటి ప్రదీప్‌కుమార్, క్యాసెట్ శ్రీనివాస్, మంగ అశోక్, అంతిరెడ్డిగూడ యాదయ్య, స్టీరింగ్ కమిటి వేణుగోపాల్, కృష్ణం రాజు, చల్లా భరత్, కార్తీక్ పాల్గొన్నారు.

## మావోయిస్టుల మృతదేహాలను బంధువులకు ఇవ్వకపోవడం రాజ్యాంగ విరుద్ధం

షాద్‌నగర్‌లో నేతల నిరసన



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్ :** ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మావోయిస్టుల మృతదేశాలను బంధువులకు ఇవ్వకపోవడం రాజ్యాంగ విరుద్ధమేనని పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో పార్టీలకతీతంగా బిజెపి ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మావోయిస్టుల ఎన్‌కౌంటర్లు ప్రభుత్వ హత్యలుగానే భావించాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా మావోయిస్టులను అంతం చేసేందుకు కంకణం కట్టుకున్నారని, అది ఏమాత్రం సాధ్యం కాదని సూచించారు. ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపివేయాలని, మావోయిస్టు నేతలతో కేంద్రప్రభుత్వం శాంతి చర్చలు జరపాలని కోరారు. మావోయిస్టులను అంతం చేయడం పక్కన పెట్టి దేశంలో ఉన్న పేదరికాన్ని నిర్మూలించేందుకు దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి తిరుమలయ్య, ఆదివాసి గిరిజన కాంగ్రెస్ రాష్ట్ర కోఆర్డినేటర్ రఘు నాయక్, బిఆర్ఎస్ మాజీ కార్పొరేషన్ చైర్మెన్ రాజా వరప్రసాద్, బిఎస్పీ రంగారెడ్డి జిల్లా కన్వీనర్ దొడ్డి శ్రీనివాస్, సిపిఎం నాయకుడు ఈశ్వర్, కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీకర్ పినపాక ప్రభాకర్, ప్రజా సంఘాల నాయకులు అర్జునప్ప, జనార్ధన్, ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఆకాష్ నాయక్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## భర్తను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరణ

వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఘటన



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** భర్తను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రికరించిన సంఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఈ మేరకు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సంస్థ నారాయణపురం మండలం వాయలపల్లి గ్రామ పరిధిలోని సపావట్ తండకు చెందిన సపావట్ కిషన్(40) బతుకుదేరువు కోసం హైదరాబాద్ వనస్థలిపురంలోని హీల్స్ కాలనీలో కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నారు. కిషన్ మొదటి భార్యకు ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. వారి మధ్య కొంత కాలం విబేదాలు రావడంతో ఆమెను వదిలేసుకున్నాడు. అనంతరం వలిగొండ మండలం బోకారం గ్రామానికి చెందిన శీరిషతో కిషన్ కులంతర వివహం చేసుకున్నారు. శీరిషతో పాటు మొదటి భార్య కుమార్తె, కుమారులతో కలిసి హీల్స్ కాలనీలో ఉంటూ జీవనం సాగిస్తున్నారు. శీరిష అక్రమ సంబంధం పెట్టుకుందని సోమవారం రాత్రి కిషన్ శీరిషను మందలించాడు. కిషన్‌పై కోపం పెంచ్చుకున్న శీరిష అతనిలో గోడవ పడి కిషన్‌ను ఇంటిపై తోయడంతో కిషన్ మృతి చెందాడు. కిషన్‌నే కాలుజారిపడి చనిపోయాడని ఆమె చిత్రికరించింది. మా నాన్న చావుకు కారణం మా పిన్ని అని కిషన్ (కుమార్తె) బింధు వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వనస్థలిపురం పోలీసులు తెలిపారు.

# డివిజన్‌ల అభివృద్ధిపై ప్రత్యేక చొరవ


గ్రేటర్ హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** డివిజన్‌ల అభివృద్ధికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని గ్రేటర్ హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి అన్నారు. మంగళవారం ఎల్‌బి నగర్ జోనల్ కమిషనర్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఆధ్వర్యంలో కార్పొరేటర్లు, జిహెచ్ఎంసి అధికారులతో రివ్యూ మీటింగ్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలతో హస్తినాపురం డివిజన కార్పొరేటర్ సుజాత నాయక్ మాట్లాడుతూ డివిజన్‌లోని ఎస్ఎన్‌డిపి నాలా పనులు నత్తనడకన సాగుతున్నాయని, వందనపురి కాలనీ నుండి కేకే గార్డెన్ వరకు పనులు మొదలు కాలేదని తెలిపారు. ద్వారకా నగర్ నుండి డిఆర్‌డిఎల్ కాలనీ వరకు పనులు ప్రారంభం చేయాలని కోరారు. దీనిపై మేయర్ గద్వాల వియజలక్ష్మి స్పందించి త్వరలోనే పనులు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ డివిజన్‌లో కొన్ని కాలనీలకు రోడ్ల సమస్యలు, విద్యుత్ దీపాలు, డ్రైనేజీ, పార్కు, వాటర్ సమస్యలు ఉన్నాయని మేయర్ దృష్టికి తీసుకోచ్చారు. వనస్థలిపురం డివిజన్లో జోనల్ కమిషనర్ పర్యాటించి కాలనీల్లో ఉన్న సమస్యలను పరిష్కరించే విధంగా కమిషనర్ చొరవ తీసుకోవాలని మేయర్ సూచించారు. బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి మాట్లాడుతూ డివిజన్‌లో కొన్ని కాలనీలకు రోడ్ల కొరకు నిధులు కొరత ఉండడంతో నిధులు మంజూరు చేయాలని, శివారు కాలనీలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని, కొన్ని కాలనీల్లో పరిశుభ్రం లేకపోవడం కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదురుకుంటున్నారని, ఖాళీగా ఉన్న పార్కు స్థలాలు కబ్జాకు గురికాకుండా ప్రహరిగోడలు నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని ఆయన కోరారు. సిబ్బంది కొరత ఉండడంతో కాలనీ సమస్యలు పరిష్కరించలేక పోతున్నారమన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన జాగ్రతలు తీసుకోవాల్సిన బాధ్యత జిహెచ్ఎంసి అధికారులపై ఉందన్నారు. వర్షాకాలంలో వరద ప్రభావం ఉన్న కాలనీలలో ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సమావేశంలో హయత్‌నగర్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య, ఎల్‌బినగర్ డిప్యూటీ కమిషనర్ ఇస్లావత్ సేవానాయక్, జిహెచ్ఎంసి సిబ్బంది పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలు అమ్మితే పిడి యాక్ట్ కింద కేసులు

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** జిల్లాలో నకిలీ విత్తనాలు అమ్మితే వారిపై పిడి యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి హెచ్చరించారు. రైతులకు విత్తనాలు, ఎరువుల అందించడంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సంబంధిత అధికారులను తగు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో కలెక్టర్ నారాయణరెడ్డి ధాన్యం కొనుగోలు, ఇందిరమ్మ ఇండ్లు, భూభారతి, వానకాల పంటల సాగుపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రుతు పవనాలు ముందుగానే రాష్ట్రానికి రావడంతో రైతులు వ్యవసాయం చేయడానికి అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. నకిలీ విత్తనాల బారిన పడకుండా రైతులకు అవగాహన కల్పించాలని, రైతులకు విత్తనాలు ఎరువులు అవసరమైన మేరకు అందుబాటులో ఉండే విధంగా చూడాలని వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. వర్షాల కారణంగా కొనుగోలు కేంద్రాలలో ఉన్న ధాన్యం తడవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, టార్పలిన్ కవర్లు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ స్పష్టం చేశారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పై సమీక్ష చేస్తూ మండల స్థాయిలో ధరల మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేయాలని, ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండ్ ప్రక్రియ పూర్తి అయ్యే విధంగా చూడాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రక్రియ పక్కాగా జరిగేలా క్షేత్రస్థాయిలో అధికారులు పనిచేయాలని, అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయి లో పర్యవేక్షణ చేస్తూ ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. భూభారతి చట్టంపై మాట్లాడుతూ జూన్ 3వ తేది నుండి 20వ తేదీ వరకు నిర్వహించే రెవెన్యూ సదస్సులకు గ్రామాల వారిగా ప్రణాళికను బుధవారం లోగా సిద్ధం చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమసింగ్, ఆర్‌డిఒలు చంద్రకళ, సరిత, వెంకట్‌రెడ్డి, అనంత్‌రెడ్డి, హౌసింగ్ పిడి హనుమంతు నాయక్, వ్యవసాయ శాఖ అధికారి నరసింహ, సివిల్ సప్లై అధికారులు పాల్గొన్నారు.

# మహిళ

ఫోకస్

## హస్తకళల ద్వారా ఉపాధి



మన దేశం అనేక సంప్రదాయాల పుట్టినిల్లు. ప్రతి రాష్ట్రానికి, ప్రతి ప్రదేశానికి ఒక ప్రత్యేక కళారూపం, శిల్ప సంపద ఉంటుంది. ఈ సంపదను తరతరాలుగా మహిళలు తమ చేతివేళ్లతో, మనసుతో, నైపుణ్యంతో పోషిస్తూ, కాపాడుతూ, తమ జీవనోపాధిగా మార్చుకుంటున్నారు. హస్తకళల ప్రాముఖ్యత కేవలం కళారూపంగా పరిమితమయ్యేది కాదు... అది లక్షలాది మహిళలకు జీవన ఆధారంగా మారింది. ప్రపంచీకరణ, డిజిటలైజేషన్, టూరిజం, హోం డెకోర్ పట్ల పెరుగుతున్న మక్కువ వంటి అంశాలు ఈ రంగాన్ని మరింతగా విస్తరించాయి. ఈ నేపథ్యంలో, హస్తకళలు, క్రాఫ్ట్‌ల ద్వారా మహిళలు మెరుగైన ఉపాధి పొందే అవకాశాలు మరింత విస్తృతమయ్యాయి. హస్తకళల ద్వారా మహిళలు కుటుంబానికి ఆదాయ వనరుగా మారుతున్నారు. గ్రామీణ స్థాయిలో నెలకు రూ.3000 నుండి రూ.30,000 వరకు సంపాదిస్తున్న ఉదాహరణలు ఉన్నాయి. ఇంటి నుండే ఉపాధి పొందే అవకాశం ఉంటుంది. ఒక వైపు చిన్న పిల్లల్ని చూసుకుంటూనే, మరోవైపు హస్తకళలు తయారుచేయడం వీలవుతుంది. ఇది మహిళలకు విశేషమైన సౌలభ్యం. హస్తకళల ప్రదర్శనలు, ప్రోత్సాహక అవార్డులు, అంతర్జాతీయ ఎగ్జిబిషన్‌ల ద్వారా మహిళలకు గౌరవం , గుర్తింపు లభిస్తుంది. వివిధ ప్రాంతాల్లో, ప్రత్యేకించి గ్రామాల్లో డ్వాక్రా, స్వయం సహాయక బృందాల ద్వారా మహిళలు రుణాలను పొందే అవకాశం ఉంది. చాలా చోట్ల ఈ బృందాలే ఉపాధి కేంద్రాలుగా మారుతున్నాయి. చేతులతో గాజులు, అలంకరణ వస్తువుల తయారీ, వెండి, నాణెం నకషీ పనులు చేస్తున్నారు. ఇది అత్యుత్తమ, గౌరవమైన ఉపాధి మార్గంగా మారింది. హస్త కళా మార్కెటింగ్, ప్రదర్శనలు మహిళలకు ఊతమిస్తున్నాయి. హస్తకళలకు ఆధునిక మార్కెట్ అవకాశాలు పెరిగాయి. మీషో (Meesho), అమెజాన్ (Amazon), ఇట్సీ (Etsy), ఫ్లిప్‌కార్ట్ (Flipkart) వంటి ఈకామర్స్ సైట్‌లలో మహిళలు తమ హస్తకళ ఉత్పత్తులను అమ్ముతున్నారు. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ ద్వారా తమతమ ఉత్పత్తులను ప్రమోట్ చేసుకుంటున్నారు. వివిధ హస్తకళల్లో ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ (కెవిఐసి), ఎంఎస్ఎంఇ ట్రైనింగ్ సెంటర్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ (ఎన్ఐఎఫ్‌టి) వంటి సంస్థలు ఉత్తమ శిక్షణనిస్తున్నాయి. అయితే, ఉత్పత్తులను మార్కెటింగ్ చేయడంలో కొంత మంది సమస్యలు ఎదుర్కొంటున్న సందర్భాలు లేకపోలేదు. మార్కెటింగ్‌పై అవగాహన లోపం, సరైన విధంగా ముడిసరుకులు లభించకపోవడం, రుణాలు అందకపోవడం వంటి సమస్యలు ఉన్నాయి. మధ్యవర్తులను ఆశ్రయిస్తే, లాభాలు మరింత క్షీణించిపోతున్నాయి. కొన్ని సందర్భాల్లో నష్టాలు కూడా తప్పడం లేదు. మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్తకొత్త డిజన్లను అభివృద్ధి చేయడానికి అవసరమైన శిక్షణ లభించడం లేదు. ఈ సమస్యలను పరిష్కరిస్తే మహిళలు వ్యాపారంలో, ప్రధానంగా చిన్నతరహా వ్యాపారాల్లో రాణించగలుగుతారు.



## సామాజిక జీవనంలో స్త్రీ..



మహిళలు సమాజ నిర్మాణానికి మూలస్తంభాలు. కానీ నాటి నుంచీ నేటివరకు ఆమె జీవితం అణచివేత, ఆంక్షలు, అసమానతలతో ముడిపడి ఉంది. సామాజికంగా ఆమె పాత్రను 'గృహ దేవత'గా కొనియాడినప్పటికీ, వాస్తవ జీవితంలో ఆమెను నిర్ణయాధికారం గల వ్యక్తిగా చూడలేదు. సామాజిక జీవన విధానంలో మహిళల పరిస్థితిని గమనిస్తే, సంస్కృతి, సంప్రదాయాల పేరుతో మహిళను ఒక నిర్దిష్ట పాత్రలోనే బంధించడాన్ని గమనించివచ్చు. ఆమె తల్లి అయితే మాత్రమే గౌరవం, భార్యగా ఉంటే కర్తవ్యబద్ధత, కాని ఒక్క వ్యక్తిగా, స్వతంత్ర ఆలోచనా శక్తి కలిగిన మనిషిగా గుర్తింపు తక్కువ. ఇది సమాజంలోని మౌలిక దృక్పథ సమస్య. మహిళ జీవితంలో పెళ్లిని చివరి లక్ష్యంగా చూడటం ఇప్పటికీ చాలాచోట్ల కొనసాగుతున్న తంతు. చదువు, ఉద్యోగం, అభిరుచులు అన్నీ పెళ్లికి ముందు వరకే పరిమితమవుతున్నాయి. పెళ్లి తర్వాత ఆమె నిర్ణయాలే కాదు, ఆమె స్వేచ్ఛ కూడా పరిమితమవుతుంది. ఇంటిలో ఆమె చేస్తున్న చాకిరీ ఎప్పుడూ 'పని'గా గుర్తింపు పొందలేదు. కష్టపడుతూ ఇంటిని నడిపినా ఆమెకు 'ఇంటి పని చేయడమే ఆమె బాధ్యత' అన్న దృక్పథం చెలామణి అవుతోంది. ఇది ఆర్థికంగా కాకపోయినా, మానవీయంగా అన్యాయమే. అంతేకాదు, వ్రతాలు, పూజలు, పండుగల సందర్భాల్లో ఎక్కువగా బాధ్యత లన్నీ ఆమెకే. అవి ఆమోదం పొందిన 'సాంస్కృతిక' నియమాలుగా కనిపించినా, వాటి వెనుక ఉన్న స్వేచ్ఛకు వ్యతిరేకమైన నియంత్రణలను గుర్తించాల్సిన అవసరం ఉంది. ఒక మహిళ పెళ్లి కాకుండానే స్వతంత్రంగా జీవిస్తే సమాజ దానికి ప్రతిఘటిస్తుంది. ఒక పురుషుడు అదే పని చేస్తే సహజంగా తీసుకుంటారు. ఇది మహిళపై ఉన్న ద్వంద్వ నైతిక ప్రమాణాల నిదర్శనం. బాలికల విషయంలో తల్లిదండ్రుల దృష్టి భద్రత, ఆంక్షలపైనే ఉంటుంది. అదే బాలురకు స్వేచ్ఛగా పెరగడం సహజమవుతుంది. ఇది నిస్సందేహంగా సమాజంలో లింగ ఆధారిత వివక్షకు ఉదాహరణ. మహిళకు వ్యక్తిగత స్నేహాలు, అభిరుచులు, ప్రయాణాలు, సొంత నిర్ణయాలు ఉండటం కూడా కొన్ని వర్గాలలో సమాజానికి అంగీకారయోగ్యంగా కనిపించదు. ఆమెకు 'ఇల్లు – పని – కుటుంబం' అనే ముగ్గురు కుడ్డలే ఉంటాయి. ఆమె వ్యక్తిత్వ అభివృద్ధికి ఇది అడ్డుపడుతుంది. ఒక మహిళ స్పష్టంగా తన అభిప్రాయం చెబితే, దాన్ని సమాజం గర్వంగా కాక, గర్వంగా చూసే ధోరణి ఇంకా ఉంది. 'సంచారం చేయకూడదు, గట్టిగా మాట్లాడకూడదు, సమర్థించుకోకూడదు' అనే మౌన సంస్కృతి ఆమెను అణిచివేస్తోంది.ఇంటిలో జరుగుతున్న దుర్వ్యవహారాల విషయమై మహిళ బయటకు చెప్పకూడదు, అని భావించే దురాచారం ఇంకా కొనసాగుతుంది. ఇది కుటుంబంలో హింసను మరింత బలపరుస్తుంది. ఆహారం, ఆరోగ్యం, విశ్రాంతి, అభిప్రాయ స్వేచ్ఛ, భద్రత వంటి మౌలిక హక్కులు సమాజంలో మహిళలకు పూర్తిగా లభించడంలేదు. ఇది ఆమె సామాజిక హక్కులపై ఉన్న అసమానతకు అద్దం పడుతోంది.సామాజికంగా మహిళలు ఎదుర్కొంటున్న ఈ పరిస్థితులు శతాబ్దాల పాత నియమాలను ప్రతిబింబిస్తున్నా, వాటిని క్రమంగా మార్చాల్సిన అవసరం అత్యవసరం. సమాజంలో ఆమెను ఒక సంపూర్ణ మనిషిగా గుర్తించి, అభివృద్ధి, స్వేచ్ఛ, సమానత్వం అందించడానికి మనందరం కలిసి నడవాలి. ఆమెకూ తన జీవితంపై పూర్తయిన హక్కు ఉందని, అది ఆమెకు మానవ హక్కులుగా లభించాలన్న స్పష్టతతో ముందుకు పోవాలి.


## బ్యూటీ టిప్స్..



**మహిళలు సహజమైన, ఇంట్లో తేలికగా చేసుకోగలిగే పలు హోమ్‌మేడ్ బ్యూటీ ప్యాక్స్ ఉన్నాయి. స్థూలంగా వాటిలో కొన్ని...**

- ముఖవర్చస్సు పెరగడానికి, వయస్సుతో వచ్చే ముడతలు తగ్గించేందుకు అరటిపండు ప్యాక్ ఉపయోగకరంగా ఉంటుంది. దీని తయారీకి అరటి పండు ముక్కలు రెండు, తేనె ఒక స్పూన్, పెరుగు ఒక స్పూన్ అవసరం. ఈ మూడింటినీ కలిపి పేస్ట్‌గా చేయాలి. దానిని ముఖానికి రాసి 20 నిమిషాల తర్వాత కడగాలి. ఇది చర్మాన్ని మృదువుగా చేస్తుంది, ముడతలు తగ్గిస్తుంది.
- పొడిచర్మం కోసం అవకాడో ప్యాక్ మంచిది. అవకాడో ముద్ద ఒక స్పూన్ తీసుకొని, దానికి ఒక స్పూన్ ఆలివ్ ఆయిల్‌ను జత చేయాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసి 15 నిమిషాల తర్వాత గోరువెచ్చటి నీటితో కడగాలి. ఇది తేమను కాపాడుతుంది.
- మృత కణాలు తొలగాలంటే బేసన్ (శనగపిండి) ప్యాక్ ఉండాలి. ఒక స్పూన్ శనగపిండికి, ఒక స్పూన్ కుంకుమ పువ్వు లేదా తేనె కలపాలి. కొద్ది పరిమాణంలో నిమ్మరసం, అవసరమైనంత మజ్జిగ కలిపి, పేస్టుగా తయారు చేసుకోవాలి. దీనిని ముఖానికి రాసి పొడిగా అవ్వగానే మృదువుగా రుద్ది కడగాలి.

## హార్మోనల్ అవరోధ సమస్య 'పిసిఒ'



సూక్ష్మంగా 'పిఎస్‌ఒ'గా పేర్కొనే పాలిసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్ అనేది మహిళల్లో కనిపించే హార్మోనల్ అవరోధ సమస్య. ఇది గర్భాశయానికి చెందిన ఓవరీలలో చిన్న చిన్న సిస్టులు అంటే, గర్భసంచుల్లో మాదిరి ఉన్న ద్రవాలతో కూడిన గడ్డలు ఏర్పడటం వల్ల వస్తుంది. ఇది రుతుక్రమాన్ని, హార్మోన్ల స్థాయిని, గర్భధారణ సామర్థ్యాన్ని తగ్గిస్తుంది. చర్మ ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుంది. అనియమిత పీరియడ్స్, ముఖం, ఛాతీపై అవాంఛిత రోమాల పెరుగుదల (హిర్సూటిజం), బరువు పెరగడం (ప్రత్యేకంగా కడుపు చుట్టూ), మొటిమలు ఎక్కువగా రావడం, తలపై జుట్టు పలుచగా అవడం లేదా జుట్టు చిట్లడం, గర్భధారణలో ఇబ్బందులు (ఇన్ఫర్టిలిటీ), ఇన్సులిన్ రెసిస్టెన్స్ (దీనవల్ల షుగర్ లెవల్స్ పెరిగే ప్రమాదం), మూడ్ స్వింగ్స్, ఒత్తిడి, డిప్రెషన్ వంటి లక్షణాలు కనిపిస్తాయి. శరీరంలో అండోజెన్ హార్మోన్ (పురుష హార్మోన్) స్థాయి పెరగడం వల్ల ఈ సమస్య ఉత్పన్నమవుతుందని చెప్పవచ్చు. ఇన్సులిన్ రెసిస్టెన్స్ కారణంగా బరువు పెరుగుతుంది. అనియమతి జీవనశైలి, ఒత్తిడి, తక్కువ వ్యాయామం, అధిక కొవ్వు, పులిసిన ఆహారం తినడం వంటి అలవాట్లు పిసిఒకు కారణమవుతాయి. దీని నివారణ కొంచం కష్టమైనా, అసాధ్యం మాత్రం కాదు. పిసిఒను నియంత్రించడానికి మొదటగా ఆహార నియమాలు పాటించాలి. తక్కువ కార్బోహైడ్రేట్లు, తక్కువ చక్కెర, ఎక్కువ ఫైబర్ ఉన్న ఆహారం (బీఫ్రూట్స్, కూరగాయలు, ధాన్యాలు) తినాలి. అదే విధంగా ఆహారంలో కొవ్వులు తక్కువగా ఉండేలా చూసుకోవాలి. ఉప్పు, ఖారం తగ్గించాలి. మిలెట్‌లు, బాజరా, జొన్న వంటి సంప్రదాయ ధాన్యాలు వాడాలి. రోజూ కనీసం 30–45 నిమిషాలు బ్రిస్క్ వాకింగ్ (వేగంగా నడవడం) చేయాలి. క్రమం తప్పకుండా యోగా చేయడం కూడా మంచిది. పిసిఒ సమస్య ఉన్న వారు తప్పనిసరిగా బరువు తగ్గాలి. దీనివల్ల పిసిఒ లక్షణాలు చాలా వరకు తగ్గుతాయి. వైద్యుల సలహాలు, సూచనలతో క్రమం తప్పకుండా మందులు వేసుకోవాలి. ఇన్సులిన్ రెసిస్టెన్స్ తగ్గించేందుకు మెట్‌ఫార్మిన్ వాడవచ్చని అంటారు. హార్మోన్ల సమతుల్యత కోసం గర్భనిరోధక మాత్రలు వాడడం కూడా ఉంది. మానసిక ఆరోగ్య సంరక్షణ:ఒత్తిడి తగ్గించుకోవడం చాలా ముఖ్యం. ధ్యానం, మైండ్‌ఫుల్‌నెస్, మానసిక కౌన్సెలింగ్ వంటి మార్గాలు ఉపయోగపడతాయి. నిద్ర పుష్కలంగా ఉండాలి. రోజూ 7–8 గంటల నిద్ర అవసరం. నిద్రలేమి కూడా హార్మోన్లలో అసమతుల్యతకు దారి తీస్తుంది. పిసిఒ సమస్య ఉన్న వారు పీరియడ్‌లు సుదీర్ఘంగా వాయిదా పడితే వైద్య నిపుణులను సంప్రదించాలి. వారానికి ఒకసారి బరువు, బీపీ చెక్ చేయాలి. షుగర్ లెవెల్స్ ను కంట్రోల్ లో ఉంచుకోవాలి. గర్భధారణలో పిసిఒ ఉన్న మహిళలు గైనకాలజిస్టు నుంచి వైద్య సేవలు పొందాలి. వైద్య పరీక్షలు, మందులు అత్యవసరం.

## పేదల పక్షాన పోరాడేది ఎర్రజెండే

**సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు**



**ప్రజాపక్షం/తుంగతుర్తి:** పేదల పక్షాన పోరాడేది ఎర్రజెండేనని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలోని పద్మశాలి భవనంలో వెలిశాల రామస్వామి అధ్యక్షతన నిర్వహించిన పార్టీ మండల నాల్గవ మహాసభలో ఆయన మాట్లాడారు. పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని అన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పేదలను విస్మరించి కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తుందని విమర్శించారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్లెంల యాదగిరి, ఎఐటియుసి జిల్లా నాయకులు గుగులోతు రాజారాంనాయక్, మండల కార్యదర్శి పాల్వాయి పున్నయ్య తదితరులు పాల్గొన్నారు.

### మండల కార్యదర్శిగా పాల్వాయి పున్నయ్య

తుంగతుర్తి మండల సిపిఐ కార్యదర్శిగా పాల్వాయి పున్నయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 30 మంది ప్రతినిధులు పాల్గొని 9 మంది కమిటీ సభ్యులను కూడా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పున్నయ్య మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తామని అన్నారు. పార్టీ బలోపేతానికి కార్యచరణ రూపొందించి ముందుకు సాగుతామన్నారు. తనపై నమ్మకం ఉంచి మండల కార్యదర్శిగా ఎన్నుకున్న పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

## రామకృష్ణాపూర్‌లో జూన్ 1న సిపిఐ సమరభేరి

**భారీ ప్రదర్శనకు విస్తృత ఏర్పాట్లు : సిపిఐ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్**

**ప్రజాపక్షం/ రామకృష్ణాపూర్ :** రామకృష్ణాపూర్‌లో జూన్ 1న జరగనున్న సిపిఐ మూడవ పట్టణ మహాసభను విజయవంతం చేయడానికి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. మహాసభల ప్రచారంలో భాగంగా రాజీవ్ చౌక్ బిజోన్ సెంటర్‌లో మంగళవారం కరపత్రాలను నాయకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, పట్టణ కార్యదర్శి మిట్టపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడుతోందని, ఇందులో భాగంగానే మూడేళ్లకోసారి మహాసభలు నిర్వహించి, నూతన కమిటీలను ఎన్నుకుంటామని తెలిపారు. జూన్ 1న జరిగే మహాసభకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవెన శంకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వాసిరెడ్డి సీతారామయ్య ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారని, ఉదయం 10 గంటలకు రాజీవ్ చౌక్ నుంచి సూపర్ బజార్ సిఇఆర్ క్లబ్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించనున్నామని తెలిపారు. సిపిఐ పట్టణ మహాసభను, ప్రదర్శనను ప్రజలు విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రజాసంఘాల నాయకులు నక్క వెంకటస్వామి, మిట్టపల్లి పౌలు, మామిడి గోపి, మాదాస్ శంకర్, పోతర్ల రాములు, కారుకూరి రాయలింగు, బొయపోతుల కొమురయ్య, తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాల్‌నర్సింహ్మ**



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాల్‌నర్సింహ్మ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో చారకొండ, వంగూరు ఉమ్మడి మండలాల సిపిఐ మూడో మహాసభ ను సిపిఐ మండల కార్యదర్శి ఏసారపు అశోక్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. మహాసభ సూచికగా సిపిఐ ఎర్రజెండాను ఆపార్టీ నాయకులు ఎగరవేశారు. అనంతరం ఏర్పాటు చేసిన మహాసభలో బాల్ నర్సింహ్మ మాట్లాడుతూ కేంద్రంలో మోదీప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక హక్కులను కాలరాస్తూ నియంతృత్వ పాలన సాగిస్తున్నారన్నారు. నిత్యావసర ధరలను పెంచి సామాన్య ప్రజలపై భారం మోపి పేదప్రజ ల నడ్డివిరుస్తుందన్నారు. భారతదేశ పౌరులైన మావోయిస్టుల ను మట్టుపెట్టేందుకు ఆపరేషన్ కగార్ పేరుతో బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనిచేస్తుందన్నారు. వెంట నే మావోయిస్టులతో శాంతి చర్చలు జరిపి ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుచేయకుండా కాలయాపన చేస్తుందన్నారు. అర్హులైన పేదలందరికి ఇళ్లస్థలాలతో పాటు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీల అమలుకై సిపిఐ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐరాష్ట్ర నాయకులు వార్లవెంకటయ్య, సిపిఐజిల్లా సమితిసభ్యుడు డాక్టర్ చిలవేరు శ్రీనివాసులు, ఎఐటియుసి రాష్ట్రనాయకులు నూనెవెంకటేష్, గోపాల్, మల్లేష్, తిరుపతమ్మ, పరుషరాం, శ్రీను, నారాయణరెడ్డి, నర్సింహ్మ, జంగయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

## ప్రజా పోరాటాలతో సమస్యల పరిష్కారం : పి.సుధాకర్



**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** కార్మిక సమస్యలపై పో రాటాలు నిర్వహిస్తు సమస్యలు పరిష్కరించుకుంటున్నామని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. మంగళవారం నిజామాబాద్ మార్కెట్ యార్డులో సివిల్ సప్లయి శాఖ మహాసభను వై.ఓమయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానికంగా ఉండే డివిజన్ ప్రజల సమస్యలు తె లుసుకొని వాటి పరిష్కారం కోసం సిపిఐ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేద్దామన్నారు. ఈ సందర్భంగా సివిల్ సప్లయి మహాస భ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన కార్యదర్శి ఎన్.దేవేందర్, సహాయ కార్యదర్శి రవిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సిపిఐ నగర నాయకులు రాధాకుమార్, నాయకులు పాల్గొన్నారు.



## దోపిడీ లేని సమాజం కోసం పోరాడిన ముదిగొండ రాములు

**సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు**

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్:**దోపిడీ లేని సమాజం కోసం పోరాడిన వ్యక్తి ముదిగొండ రాములు అని సిపిఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు అన్నారు. మాజీ సిపిఐ భువనగిరి మండల కార్యదర్శి ముదిగొండ రాములు ప్రథమ వర్ధంతి సభ బస్వాపురం గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయం ముందు సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఉడుత రాఘవులు అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసిన అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు మాట్లాడుతూ ముదిగొండ రాములు అకాల మరణం పట్ల పార్టీకి చాలా నష్టం జరిగిందని సమసమాజ నిర్మాణం దోపిడీ లేని సమాజం కోసం పోరాడిన రాములు రజక వృత్తిని వదిలిపెట్టి పార్టీ ఇచ్చిన పిలుపులను విజయవంతం చేశారన్నారు. గ్రామ కార్యదర్శి నుండి మండల కార్యదర్శిగా మూడు పర్యాయాలు పనిచేశారని గుర్తు చేశారు. బస్వాపురం రిజర్వాయర్ ముంపుకు గురైన రైతుల పక్షాన నిలబడి పనిచేశారని చెప్పారు. భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని పోరాటం చేశారని అన్నారు. వారి ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలని కోరారు గ్రామ ప్రజలు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏశాల అశోక్ మాట్లాడుతూ గ్రామంలోని ప్రజా సమస్యలు పరిష్కారం చేశారని నివాసాలు లేని నిరుపేదలకు స్థలాలు ఇప్పించడంతోపాటు పలు ఆందోళనలు నిర్వహించారని అన్నారు. స్థూపావిష్కరణ సిపిఐ జిల్లా కార్యదర్శి చేశారు. ప్రథమ వర్ధంతి సభలో భార్య లక్ష్మి , కుమారులు ముదిగొండ శివకుమార్, ముదిగొండ ఠాగూర్, మాజీ సర్పంచులు ఉడుత సత్యనారాయణ, కస్తూరి శ్రీశైలం, మదర్ డైరీ డైరెక్టర్ కస్తూరి పాండు, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షులు సోమన సబిత, సిపిఐ మండల కార్యదర్శి దాసరి లక్ష్మయ్య, పట్టణ కార్యదర్శి పుట్ట రమేష్, టిఆర్ఎస్ నాయకులు ఉడుత రామచందర్, సిపిఐ నాయకులు ముసునూరు చంద్రశేఖర్, చౌప్పరి సత్తయ్య, రాసాల పెంటయ్య, మచ్చ వెంకటయ్య, రాసాల కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## 29–31 వరకు జైపూర్‌లో ఎఐటియుసి జాతీయ కౌన్సిల్ సమావేశాలు

**ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్**



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** ఈనెల 29, 30, 31 తేదీలలో రాజస్థాన్ రాష్ట్రం జైపూర్‌లో ఎఐటియుసి జాతీయ స్థాయి కౌన్సిల్ సమావేశం నిర్వహించడం జరుగుతుందని, కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక నాలుగు కోడ్‌లపై విస్తృతంగా చర్చించడం జరుగుతుందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ తెలిపారు. మంగళవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఎఐటియుసి కొమురయ్య భవన్‌లో ఎఐటియుసి బ్రాంచ్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో రాజ్ కుమార్ పాల్గొని మాట్లాడారు. ఈ మూడు రోజులపాటు జైపూర్ లో జరిగే ఎఐటియుసి జాతీయ కౌన్సిల్ సమావేశంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ సారయ్య పాల్గొననున్నట్లు తెలిపారు. ముఖ్యంగా బిజెపి ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజించి కార్మిక హక్కులను కాలరాస్తుందని మండిపడ్డారు. ఇలాంటి కార్మిక వ్యతిరేక నాలుగు కోడ్‌లపై జాతీయ స్థాయి కౌన్సిల్లో చర్చ జరుగుతుందన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో నాలుగు కోడ్‌లు అమలుపరుస్తుందని, దాన్ని అడ్డుకునే విధంగా జాతీయ సంఘాలు పోరాటాలు చేయాలని నిర్ణయించడం జరిగిందన్నారు. రైతు నల్ల చట్టాలను వ్యతిరేకించిన విధంగానే కార్మిక కోడ్‌లపై నిరంతరం పోరాటాలు నిర్వహించి కార్మిక హక్కులకు కీడు చేసే నాలుగు కోడ్‌ల రద్దు కోసం పోరాటాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. సింగరేణిలో ట్రాన్స్‌ఫర్ పాలసీలో ఆన్‌లైన్, ఆఫ్ లైన్ ఉండే విధంగా డిస్మిస్ కార్మికుల సమస్య, జూన్‌లో సింగరేణి యాజమాన్యం కార్మిక సంఘాల అగ్రిమెంట్, సింగరేణిలో రాజకీయ ప్రమేయం ఎక్కువైందని , దాన్ని నివారించే విధంగా బదిలీలు జరిగే విధంగా కౌన్సిల్లో చర్చ జరుగుతుందన్నారు. కార్మిక హక్కులపై అనేక పోరాటాలు నిర్వహిస్తూనే గుర్తింపు సంఘం కార్మికులకు ఇచ్చిన మాట ప్రకారం కార్మికులకు అన్ని హక్కులు వచ్చే విధంగా సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి నిత్యం కార్మిక సమస్యలపై వాటి పరిష్కార దిశగా పోరాటాలు నిర్వహిస్తుందని రాజ్ కుమార్ తెలిపారు. ఈ సమావేశంలో ఎఐటియుసి సెంట్రల్ సెక్రటరీ రాజరత్నం, భూపాలపల్లి బ్రాంచ్ కార్యదర్శి మోటపలుకుల రమేష్, బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ మాతంగి రామచందర్, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ గురిజెపల్లి సుధాకర్ రెడ్డి, ఎఐటియుసి మైనింగ్ సెంటర్ అర్గనైజర్ రాజ్ మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి కార్యకర్తా సైనికుడిలా పని చేయాలి

**సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అయోధ్య**

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** నెల రోజుల్లో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రతి కార్యకర్త సిద్ధంగా ఉండి సైనికులా పని చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లోజు అయోధ్య అన్నారు. మంగళవారం మండల పరిధిలోని సారపాక సిపిఐ ఆఫీస్‌లో మండల కార్యవర్గ సమావేశంలో సిపిఐ మండల నాయకులు సబ్కా నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ మండలంలో ఉన్న అన్ని శాఖ సమావేశాలు ఘనంగా నిర్వహించుకోవాలని, బూర్గంపాడు మండలంలో ఉప్పుసాక పంచాయితీ రాజీవ్‌నగర్‌లో, సారపాక పంచాయితీలోని శ్రీరాంపు రం ఎస్‌టి కాలనీలో పోడు సాగు చేసుకుంటున్నా అమాయక గిరిజనులపై ఫారెస్ట్ వారి దాడులు ఆపాలన్నారు. గత 30 సంవత్సరాల నుండి పోడు కొట్టి వ్యవసాయం చేసుకుంటున్నారని, వారిని ఇబ్బంది పెడితే భారత కమ్యూనిస్టు పార్టీ పక్షాన నిలబడి పోరాడుతుందన్నారు. ఈకార్యక్రమంలో మహిళా సమైక్య జిల్లా అధ్యక్షురాలు మున్నా లక్ష్మీ కుమారి, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి సారెడ్డి పుల్లారెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి మువ్వా వెంకటేశ్వరరావు( లడ్డా), సిపిఐ జిల్లా నాయకులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్



## ఘనంగా ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి



ప్రజాపక్షం/జడ్చర్ల: జడ్చర్ల నియోజకవర్గ కేంద్రంలో జవహర్ లాల్ నెహ్రూ విగ్రహానికి పూల మాల వేసి ఘన నివాళులు అర్పించిన జడ్చర్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఈ వర్ధంతి సందర్భంగా వారు దేశానికి చేసిన సేవలు కొనియాడుతూ నెహ్రూ అడుగుజాడల్లో వారి ఆశయ సాధనకై మనమందరం కలిసి ముందుకు కొనసాగాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు యువజన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు ఇతర విభాగాలు నాయకులు , అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## పదోన్నతి బాధ్యత పెంచుతుంది

జిల్లా ఎస్‌పి యోగేష్ గౌతమ్, ఐపిఎస్



**ప్రజాపక్షం/ నారాయణపేట్ :** పదోన్నతి విధుల పట్ల ఉత్సాహాన్ని పెంచడంతో పాటు విధి నిర్వహణలో మరింత బాధ్యతను పెంచుతుందన జిల్లా ఎస్‌పి యోగేష్ గౌతమ్ అన్నారు. పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో విధుల నిర్వర్తిస్తున్న ఎఆర్ కానిస్టేబుల్ పి.ఆనంద్ కుమార్‌కు హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొంది, జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్‌పి యోగేష్ గౌతమ్ మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఎస్‌పి నూతనంగా పదోన్నతి పొందిన ఆర్మూడ్ రిజర్వ్ హెబ్ కానిస్టేబుల్‌కి పట్టీలు తొడిగి శుభాకాంక్షతు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ఉద్యోగ జీవితంలో పదోన్నతి ఉత్సాహంతో పాటు విధుల పట్ల మరింత బాధ్యతను పెంచుతోందని భవిష్యత్ లోనూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నరసింహ, హెడ్ కానిస్టేబుల్ ఆనంద్ కుమార్ పాల్గొన్నారు.

## పంట మార్పిడిని పాటించాలి



**ప్రజాపక్షం/ నారాయణపేట్ :** రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు రాష్ట్ర ప్రభుత్వం , (ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం సమిష్టిగా చేపట్టిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం మంగళవారం (270525)పేరపళ్ళలో నిర్వహించడం జరిగింది. వ్యవసాయ పాలిటెక్నిక్ శాస్త్రవేత్తలు డా॥ఎం. పరిమళ కుమార్, డా॥ జెడి. సరిత ఈ కార్యక్రమంలో పాల్గొని రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వడం జరిగింది. డా॥ పరిమళ్ కుమార్ మాట్లాడుతూ రైతులు విత్తన ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మేలైన విత్తన రకాల గురించి వివరించారు. పంట మార్పిడి పద్ధతిని అవలంబించడం ద్వారా నేలసారం పెరగడంతో పాటు ఆధిక లాభాలు పొందవచ్చని తెలిపారు. డా॥జెడి. సరిత మాట్లాడుతూ రసాయనాల వినియోగాన్ని తగ్గించుకోవాలని సూచించారు. ప్రత్యామ్నాయి. మార్గాలైన పచ్చిరొట్ట ఎరువులు, జీవన ఎరువులు, జీవ కీటక , శిలీంద్ర నాశినిలను వాడాలని సూచించారు. భద్రపరుచుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎఒ బాల దినకర్, ఎఇఒలు ప్రకాశ్, అనిల్ కుమార్, అంజమ్మ , 60 మందికి పైగా రైతులు పాల్గొన్నారు.

## 10వ తరగతి విద్యార్థులకు సన్మానం



**ప్రజాపక్షం/ మక్తల్ :** నారాయణపేట జిల్లా శాఖ ఆధ్వర్యంలో ముదిరాజ్ అభినందన సభలో భాగంగా 10వ తరగతిలో పరీక్షలో 500 పైగా మార్కులు సాధించిన మక్తల్ నియోజకవర్గంలో మాగనూర్ గ్రామానికి చెందన ముదిరాజ్ విద్యార్థులు పాటిమీదీ భారతి, కోల్పూర్ నవీన, గుర్రం హేమలతలకు పులి దేవేందర్ ముదిరాజ్ రాష్ట్ర ఎంఇపిఎ అధ్యక్షులు, బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ రాష్ట్ర ముదిరాజ్ఒ కమీషనర్ చైర్మన్ సన్మానించారు. అలాగే డిఎస్‌సి ఉత్తీర్ణులై ఉద్యోగం పొందిన వాకిటి నరసింహ కూడా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాగనూర్ మండల మత్స్యశాఖ సహకార సంఘం అధ్యక్షులు పూంజనూర్ ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి గడ్డం నరేష్,సంఘం డైరెక్టర్స్ వాకిటి శ్రీనివాస్, బులిమెని దేవప్ప, దండు సాబెన్న ఈ విద్యార్థులకు, ఉపాధ్యాయులు పి. నరేందర్, వాకిటి నరసింహకు మత్స్యశాఖ సహకార సంఘం తరుపున సన్మానించారు.

## ప్రాంతీయ శిల్పాకళా వారసత్వాన్ని కాపాడుకోవడం మన బాధ్యత



**ప్రజాపక్షం/ నారాయణపేట్ :** ప్రాతీయ శిల్పకళా వారసత్వాన్ని గుర్తించ డం, సంరక్షించడం వంటి కార్యక్రమం చేపట్టడం జరిగిందని డిఐసి జిఎం భరత్ రెడ్డి తెలిపారు. ముఖ్యమైన చర్యలో భాగంగా మంగళవారం రిసల్యూ ట్ 4 ఐపి నుండి వచ్చిన బృందం హస్తకళ , సాంస్కృతిక ప్రత్యేకతకు పేరుగాచిన నారాయణపేట యొక్క 24 క్యారెట్ బంగారం ఆభరణాలు భౌగోళిక సూచిక (జి.ఐ), రిజిస్ట్రేషన్ కోసం అపారమైన సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి గుర్తించినట్లు తెలిపారు. భౌగోళిక సూచన (జి.ఐ) అనేది మేధో సంపత్తి హ క్కు యొక్క ఒక రూపం, ఇది ఒక ఉత్పత్తిని ఒక నిర్దిష్ట ప్రదేశం నుండి ఉద్భవించినట్లు గుర్తిస్తుంది, ఇక్కడ ఇచ్చిన నాణ్యత, ఖ్యాతి లేదా ఇతర లక్షణం దాని భౌగోళిక మూలానికి కారణమని చెప్పవచ్చు. జి.ఐ. సాంప్రదాయ జ్ఞా నాన్ని కాపాడటానికి రిజిస్ట్రేషన్ ఉపయోగపడుతుంది , అధీకృత వినియోగించగలరని నిర్ధారిస్తుంది. జి.ఐ యొక్క ప్రయోజనాలు, నమోదు చట్టపరమైన రక్షణ, మార్కెట్ భేదం, గ్రామీణాభివృద్ధి, గ్లోబల్ రికగ్నిషన్, సాంస్కృతిక సంరక్షణ రాబోయే నెలల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియను సులభతరం చేయడానికి ఈ బృందం స్థానిక బంగారు ఆభరణాలు, క్రాఫ్ట్ కోఆపరేటివ్స్ , ప్రభు త్వ సంస్థలతో సన్నిహితంగా ఉందని తెలిపారు. ఈ సందర్శనలో డిఐసి జి ఎం భరత్ రెడ్డి, రిసల్ యూట్ గ్రూప్ అసోసియేట్స్ శ్రీ వాస్తవ్, కీర్తి , నారాయణ పేట్ గోల్డ్ అసోసియేషన్లు పాల్గొన్నారు.

## నేడు మక్తల్ మండలంలో వాకిటి పర్యటన

**ప్రజాపక్షం/ మక్తల్ :** మక్తల్ తహాసీల్దార్ కార్యాలయంలో 11:00 గంటలకు మక్తల్ మండలానికి చెందిన కళ్యాణ లక్ష్మి , షాదీ ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేస్తారు. మధ్యాహ్నం 01:30 లకు మాగనూర్ మండల కేంద్ర రైతు వేదిక వద్ద మాగనూర్ మండలానికి చెందిన కళ్యాణ లక్ష్మి , సాదీ ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల ను లబ్ధిదారులకు పంపిణీ చేస్తారు. మధ్యాహ్నము 03:00 ని॥ లకు కృష్ణ మండల కేంద్ర రైతు వేదిక వద్ద కృష్ణా మండలానికి చెందిన కళ్యాణ లక్ష్మి , షాదీ ముబారక్, సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కలను లబ్ధిదారులకు అందజేయనున్నారు కవున. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల అధ్యక్షులు, మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# గడువులోపు నిర్మాణ పనులు పూర్తి చేయాలి

- మద్దూరు మండలంలో కలెక్టర్ విస్తృత పర్యటన
- ఎస్‌డిఎఫ్ రోడ్ల నిర్మాణ పనుల పరిశీలన



**ప్రజాపక్షం/ మద్దూర్ :** నారాయణపేట జిల్లా కలెక్టర్ మంగళవారం జిల్లాలోని మద్దూరు మండలంలో విస్తృతంగా పర్యటించి ఆమండలంలో ఎస్‌డిఎఫ్(స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్)తో కొనసాగుతున్న బీటి రోడ్డు నిర్మాణ పనులు, బ్రిడ్జి నిర్మాణ పనులు, బీటీ రెన్యువల్ నిర్మాణ పనులను పరిశీలించారు. ముందుగా నారాయణపేట మండలం బండ గొంద నుంచి మద్దూరు మండలం చెన్వార్ బీటీ రోడ్డు, అలాగే బండ గొండ నుంచి మద్దూరు మండలం మోనినాపూర్ బీటీ రోడ్డు పనులతో పాటు హై లెవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించి నాణ్యతతో పనులు చేయించాలని పంచాయతీరాజ్ శాఖ అధికారులకు సూచించారు. ఆ తర్వాత మోమినాపూర్ నుంచి గని మోనిబండ, అభంగాపూర్ (నారాయణ పేట మండలం) లింక్ బీటీ రోడ్డు పనులు, అప్పిరెడ్డిపల్లి (మ ద్దూరు) నుంచి రెనివట్ల రాళ్ల బావి బీసీ రోడ్డు ని ర్మాణ పనులను పరిశీలించి గడువులోపు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. చివరగా రెనివట్ల నుంచి మోమినాపూర్ వరకు పూర్తయిన బీటీ రోడ్డును కలెక్టర్ పరిశీలించారు. ఆయా రోడ్డు నిర్మాణ పనులను తొందరగా పూర్తి చేయించేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్ శాఖ ఇఇ హిర్యా నాయక్, ఎఇ విలోక్‌ను కలెక్టర్ ఆదేశించారు. కొత్త బీటీ రోడ్ల పనులతో పాటు రెన్యువల్ బీటీ రోడ్ల పనులు కూడా ప్రారంభించి వెంటనే పూర్తి చేయించాలని అధికారులకు సూచించారు. భూనేడు కళాశాల నిర్మాణ పనుల పరిశీలన కొత్తపల్లి మండలం భూనేడు జెడ్‌పి ఉన్నత పాఠశాల ఆవరణలో రూ.6 కోట్ల వ్యయంతో నిర్మించే ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనులను కలెక్టర్ సిక్తాపట్నాయక్ పరిశీలించారు. నిర్మాణ పనులు ఇంకా పిల్లర్ల స్థాయిలోనే ఉన్నాయని, పనుల్లో వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. పాఠశాల ఆవరణలో పనులు జరుగుతున్నాయని, పాఠశాల పునః ప్రారంభం అయితే మళ్ళీ పనులకు ఆటంకం కలిగే అవకాశం ఉంటుందని, పనులను తొందరగా పూర్తి చేయించాలని అధికారులకు ఆమె సూచించారు. మద్దూరు గురుకుల పాఠశాల నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలి మద్దూరు మండల కేంద్రంలో రూ.30 కోట్ల నిధులతో చేపట్టే సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల/ కళాశాల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. మంగళవారం మద్దూరు పర్యటనలో భాగంగా ఆమె మండల కేంద్రానికి సమీపంలో గురుకుల పాఠశాల/కళాశాల నిర్మాణానికి గుర్తించిన 3 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. నిర్మాణ పనులు ఇంకా ఎందుకు ప్రారంభం కాలేదని అధికారులను ప్రశ్నించారు. స్పందించిన అధికారులు ముందుగా అనుకున్న ప్లాన్ కంటే కొంచెం మార్పు చేయడం జరిగిందని, ఆ స్థలంలో వెనక వైపు ఉన్న ఓ ప్రార్థన మందిరాన్ని ముందు వైపు నిర్మించడం జరుగుతుందని,అలాగే సాయిల్(నేల) పరీ క్ష చేయిస్తున్నామని, రెండు రోజులుగా వర్షం కురుస్తున్నాందున పనులు పొందిన కంపెనీ ని ర్వాహకులు కలెక్టర్‌కు వివరించారు. ఇసుక కో సం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నా రవాణాలో కొంత జాప్యం జరుగుతోందని కంపెనీ నిర్వాకుడు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చాడు. స్పందించిన కలెక్టర్ స్థానిక తహసిల్దార్‌తో మాట్లాడి ఇసుక రవాణాకు ఆటంకం లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం క లెక్టర్ మద్దూరు తహాసిల్దార్ కార్యాలయానికి వె ళ్ళి అక్కడ కొనసాగుతున్న భూభారతి దరఖాస్తు ల వెరిఫికేషన్ ను పర్యవేక్షించారు.

## ప్రమాదకరమైన గుంతను పట్టించుకోని మున్సిపల్ అధికారులు



**ప్రజాపక్షం/ మక్తల్ :** స్థానిక ఐలిన్ స్కూల్ అంబేద్కర్ నగర్ లో ఉన్న ప్రస్తుతము జూనియర్ కాలేజ్ ఆర్‌జెసి గురుకుల పాఠశాల ఇందులో కొనసాగుతుంది, ఒకవైపు నారాయణపేట రోడ్డు వైపున కొత్తగా గేటు మార్చడం అయింది ఆ గేటుకు ఎడమవైపున సుమారుగా 40 ఫీట్లు పెద్ద గుంత తీయడం జరిగింది. అందులో వర్షాపు నీరు పూర్తిగా నిండియున్నది , కాలేజ్, పాఠశాలకు సంబంధించి మురుగు నీరు కూడా అందులోనే ఉంటున్నాయి ఇది చాలా ప్రమాదకర పరిస్థితిలో ఉంది పాఠశాల పిల్లలు స్థానిక అంబేద్కర్ నగర్, సుందర్ నగర్ కాలనీ ఏరియా పిల్లలు ఇచ్చట ఆటలు ఆడుకుంటూరు. క్రికెట్లు తదితర ఆటలాడుకుంటారు, పాఠశాల పిల్లలు ఆ పాఠశాల యొక్క కాంపౌండ్ కూడాపై కూడా కూర్చుని ఉంటారు. ఎప్పుడైనా ప్రమదవశాత్తు ఆ నీటి గుంతలో పడిపోతే పిల్లలకు ప్రమాదకర హామీ జరుగుతుంది. ప్రాణాలకు ముప్పు కూడా కలగవచ్చును, ఇట్టి విషయాన్ని ఆ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకువెళ్లిన పట్టించుకోవడం లేదు, మక్తల్ మున్సిపల్ కమిషనర్ గాని పర్యవేక్షణ అధికారులు గానీ పట్టించుకోవడం లేదు కావున వెంటనే అది ఏ కారణం చేత సుమారుగా సంవత్సరనం కావస్తుంది ఆ గుంతను పూడ్చేవాడు లేరు అడగేనాకు తెలియదు. అని స్థానిక కాలనీవాసులు ఫిర్యాదు చేస్తున్నాను ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోని వెంటనే ఆ ప్రిన్సిపల్ పై చర్య తీసుకుని ఆ గుంతను పూడ్చిచేయాలని ప్రజలు కోరుతున్నారు. ఎవరికైనా ఏదైనా ప్రాణహాని జరిగిన తర్వాత స్పందించడం కన్నా ముందే జాగ్రత్త తీసుకోవడం మంచిది అని ప్రజలు కోరుతున్నారు.

## దేశానికి నెహ్రూ సేవలు ఎనలేనివి




**ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ ప్రతినిధి :** మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ దేశానికి చేసిన సేవ లు ఎనలేనివని టిపిసిసి ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జవాహర్ లాల్ నెహ్రూ వర్ధంతి నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెహ్రూ ప్రధాన మంత్రిగా దేశాభివృద్ధి కో సం ఎన్నో కార్యక్రమాలను రూపొందించినట్లు గు ర్తు చేశారు. ఆయన ఆశాయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వల హయాంలోనే ప్రజాసంక్షేమం సాధ్యమన్నారు. రాష్ట్రంలో సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి పాటుపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మ ణ్ యాదవ్, డీసీసీ మీడియా సెల్ కన్వీనర్ సీజే బెనహర్, డిసిసి ప్రధా న కార్యదర్శి అబ్దుల్ సిరాజ్ ఖాద్రీ, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు సాయి బాబా , పట్టణ కాంగ్రెస్ వ ర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మత్ అలీ, జిల్లా మైనార్టీ విభా గం అధ్యక్షులు ఫయాజ్, నాయకులు అక్బర్ గు లాం జహీర్, పీర్ సాదిక్ అంతయ్య, నాగరాజు, వెంకటలక్ష్మి , అలీమ్, తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులకు చేరాలి : డికె.అరుణ



**ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ ప్రతినిధి :** కేంద్ర ప్రభుత్వం నిధులతో వివిధ శాఖల అమలు చేస్తున్న అభివృద్ధి పనులు, పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులైన లబ్ధిదారులకు చేరే విధంగా అధికారులు సక్రమంగా అమలు చేయాలని మహబూబ్ నగర్ ఎంపి, దిశ చైర్ పర్సన్ డికె అరుణ అన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లో డికె అరుణ అధ్యక్షతన నిర్వహించి జిల్లాలో కేంద్రం అమలు చేస్తున్న వివిధ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు సమీక్షించారు. కేంద్రం ప్రభుత్వం నిధులతో రాష్ట్ర ప్రభుత్వ వాటా నిధులతో వివిధ పథకాలు ఎటువంటి లోపాలు లేకుండా నిరుపేదలకు, సన్న, చిన్న కారు రైతులకు ప్రయోజనం కలిగేనా పర్యవేక్షించిన పకడ్బందీగా అమలు చేయాలని అన్నారు. ఈ సమావేశం వ్యవసాయ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, మార్కెటింగ్, విద్యాశాఖ, విద్య సంక్షేమం, మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ, పౌర సరఫరాల శాఖ, పశు సంవర్ధక శాఖ, అటవీ శాఖ, విద్యుత్ శాఖ, మహిళా శిశు సంక్షేమం, గిరిజన అభివృద్ధి శాఖల ద్వారా అమలు చేస్తున్న వివిధ పథకాలు సమావేశంలో సమీక్షించారు. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన ద్వారా వ్యవసాయ యంత్రీకీకరణ పరికరాలు 50 శాతం సబ్సిడీ పై పంపిణీ చేయుటకు 252 యూనిట్‌లకు రూ.72 లక్షల 20 వేలు నిధులు కేటాయించినట్లు జిల్లా వ్యవసాయ అధికారి వివరించారు. ఇందులో 13 రకాల వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు ఉన్నట్లు ఆయన తెలిపారు. ఈసందర్భంగా డికె అరుణ మాట్లాడుతూ పథకంపై అర్హులైన లబ్ధిదారులను ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఎటువంటి రాజకీయ జోక్యం, ఒత్తిడులు లేకుండా ఎంపిక చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ స్పందిస్తూ మండల స్థాయిలో జిల్లా స్థాయిలో ఎంపిక కమిటీలు ఏర్పాటు చేయాలని మండల స్థాయిలో పరిశీలన తర్వాత జిల్లా కమిటీ ఎంపికకు పంపాలని ఆదేశించారు. ఈ పథకం కింద అర్హులైన పేదలకు లబ్ధి కలగాలన్నారు.జాతీయ అయిల్ సీడ్ మిషన్ కార్యక్రమం కింద వంట నూనెల ఉత్పత్తికి 2025—26 నుండి వేరు శెనగ సాగుకు కేంద్రం ప్రభుత్వం అమలు చేస్తుందని జిల్లా వ్యవసాయ అధికా రి తెలిపారు. జిల్లాలో 1250 ఎకరాల్లో 3 సంవత్సరాలు పాటు రైతు ఉత్పత్తి సంఘాల ద్వారా వేరు శెనుగ సాగు చేయటానికి రెండు సంస్థలను ఎంపిక చేసినట్లు తెలిపారు. వ్యవసాయ రంగంలో నూతన ధోరణులు, సాగు యాజమాన్య పద్ధతులు గురించి రైతులకు అవగాహన సదస్సులు ద్వారా అవగాహన కలిగించాలని వ్యవసాయ అధికారికి సూచించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ నెలఖరు వరకు వర్షాకా లంలో వచ్చే వ్యాధులు నియంత్రణకు పెద్ద ఎత్తున పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా చెత్త తొలగించడం, మురుగు నీరు నిల్వ లేకుండా డ్రైన్‌లు, మంచి నీటి సోర్స్ వద్ద నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశ్, డిఆర్‌డిఓ నర్సింహులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారి కృష్ణ తదితరులు ఉన్నారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు



**ప్రజాపక్షం/వీపనగండ్ల :** రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే సంబంధిత తమ దుకాణాలపై యాజమానులపై చట్టపరమైన చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి డాకేశ్వర్ గౌడ్ మండల టాస్క్ ఫోర్స్ టీం హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం, భవాని ట్రేడర్ , శ్రీ సాయి ట్రేడర్ , క్రాంతి ఫర్టిలైజర్స్ , దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా విత్తనం స్టాక్ రిజిస్ట ర్లు, బిల్లు బుక్స్ , స్టాకు సంబంధించిన వివరాలు సీడ్స్ బ్యాగులను తనిఖీ చేశా రు. లైసెన్స్ ఉన్న దుకాణాలలోనే విత్తనాలు కొనాలని రైతులకు తెలిపారు. రై తులు విత్తనాలు ,ఎరువులు ఉన్న తర్వాత బిల్లు తప్పనిసరిగా తీసుకొని భద్రపర్చుకోవాలని సూచించారు. రైతులకు బిల్లులు ఇవ్వని ఫర్టిలైజర్ ఎస్టిసైడ్ దు కాణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని , విత్తన దు కాణదారులు రైతులకు, నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలని తెలిపారు.

## ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి



**ప్రజాపక్షం / వీపనగండ్ల :** ఆకాల వర్షాల వల్ల రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు వేగవంతం చేసి ఎప్పటికప్పుడు ధాన్యం సంచులను మార్కెట్ యార్డ్ గోదాం తరలించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని వరి కొనుగోలు కేంద్రాన్ని, మార్కెట్ యార్డ్ గోదాంను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని మార్కెట్ యార్డ్ గోదాంకు ట్రాక్టర్ల ద్వారా కాకుండా లారీల ద్వారా తరలించాలని ,ట్రాక్టర్ ద్వారా తరలించడం వల్ల ఆలస్యమై ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందని నిర్వాహకులకుసూచించారు. ఏ ఒక్క రైతు కూడా ఇబ్బందులు కలిగించకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, తడిచిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాలు సంస్థ డిఎం జగన్మోహన్ , తహసీల్దార్ వరలక్ష్మి , నయాబ్ , తహసీల్దార్ కృష్ణమూర్తి, ఆర్ఐ కురుమూర్తి ఉన్నారు.

## ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరించండి

**ప్రజాపక్షం / పెబ్బేరు :** పెబ్బేరు మండల బిజెపి పార్టీ ఆధ్వర్యంలో రైతుల దగ్గర త్వరితగతిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని తరుగు పేరిట క్వింటాలుకు నాలుగు ఐదు కిలోలు మిల్లర్లు తరుగు తీయటంపై దృష్టి కేంద్రీకరించి ఈ మోసాన్ని నియంత్రించి సేకరించిన వరి ధాన్యం డబ్బులను రైతులు ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గౌని వేమారెడ్డి బిజెపి వనపర్తి నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్ , ఒబిసి మోర్చా జిల్లా అధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్ , బిజెపి పెబ్బేరు రూరల్ మండలాధ్యక్షుడు నాగరాజ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. నూతనంగా పెబ్బేరుకి విచ్చేసిన తహసీల్దార్ మురళికి బిజెపి పార్టీ ఆధ్వర్యంలో సన్మానించడం జరిగింది.



# 30 ఏళ్ళనాటి వక్ఫ్‌చట్టం చెల్లుబాటుపై జవాబివ్వండి

కేంద్రానికి 'సుప్రీం' నోటీసు




న్యూఢిల్లీ: వక్ఫ్ కేసులో సుప్రీంకోర్టు మంగళవారం నాడు కేంద్ర ప్రభుత్వానికి నోటీసు జారీ చేసింది. 1995 నాటి వక్ఫ్ చట్టంలోని కొన్ని నిబంధనల రాజ్యాంగ చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సమాధానం చెప్పాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికీ, ఇతరులకు నోటీసులు ఇచ్చింది. ఈ చట్టాన్ని సవాలు చేస్తూ నిఖిల్ ఉపాధ్యాయ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆయన తరపున ప్రముఖ న్యాయవాది అశ్వనీ ఉపాధ్యాయ వాదనలకు హాజరయ్యారు. వక్ఫ్ సవరణ చట్టం—2025 చెల్లుబాటును సవాలు చేయడానికి సంబంధించి ఏప్రిల్ 17వ తేదీన సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వును అశ్వనీ ఉపాధ్యాయ ప్రముఖంగా ప్రస్తావనకు తెచ్చారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిహ్‌లతో కూడిన ధర్మాసనం మంగవారం నాడు కేంద్ర ప్రభుత్వం సంజాయిషీ కోరుతూ నోటీసు జారీ చేసింది. 1995 నాటి వక్ఫ్ చట్టం, దానికి 2013లో చేసిన సవరణలను అనుబంధ జాబితాలో వేరువేరుగా చూపించాలని ఏప్రిల్ 17న సుప్రీంకోర్టు జారీ చేసిన ఉత్తర్వులో చెప్పడాన్ని ఉపాధ్యాయ ప్రత్యేకంగా ప్రస్తావించారు. 1995 నాటి వక్ఫ్ చట్టాన్ని సవాలు చేస్తూ పిటిషన్ దాఖలు చేస్తే దానిని 2025లో ఇప్పుడు మేం ఎందుకు అనుమతించాలి? అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ పిటిషనర్ తరపు న్యాయవాదిని ప్రశ్నించారు. ఇప్పటికే చాలా దశాబ్దాలు ఆలస్యమైపోయిందనే ప్రాతిపదికపై ఎందుకు ఈ పిటిషన్‌ను తాము తిరస్కరించకూడదని కూడా గవాయ్ ప్రశ్నించారు. 2013లో చేసిన సవరణను తాము సవాలు చేస్తున్నామని దీనికి బదులుగా అశ్వనీ ఉపాధ్యాయ స్పందించారు. 2020లో కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రార్థనాస్థలాల (ప్రత్యేక నిబంధనలు) చట్టాన్ని సవాలు చేయడానికి, 1991లో,1992లో చేసిన జాతీయ మైనారిటీ కమిషన్ చట్టాలను సవాలు చేయడానికి పిటిషన్లను సుప్రీంకోర్టు అనుమతించిందని అశ్వనీ ఉపాధ్యాయ గుర్తుచేశారు. 1995 నాటి వక్ఫ్ చట్టంలో కొన్ని నిబంధనల చెల్లుబాటును సవాలు చేస్తూ, వక్ఫ్‌కు అనుకూలంగా, వక్ఫ్ ఆస్తులకు అనుకూలంగా చట్టాలను పార్లమెంటు చేయలేదని ఆయన అన్నారు. వక్ఫ్ సవరణచట్టం— 2025కు సంబంధించిన కేసులో అనుకూల ప్రతికూల వాదులిద్దరి అభిప్రాయాలను విచారించిన తర్వాత సుప్రీంకోర్టు మే 22వ తేదీన మూడు కీలక సమస్యల పై తాత్కాలిక ఉత్తర్వును ప్రకటించకుం డా (ఉత్తర్వు రిజర్వు) తనవద్దనే ఉంచుకుంది. కోర్టులు గుర్తించిన వక్ఫ్ ఆస్తులను కూడా ఈ చట్టం ద్వారా తిరిగి వెనక్కు తీసుకోడానికి కేంద్ర ప్రభుత్వానికి అధికారాలు ఉండటం ఇం దులో ప్రధానాంశం. సరైన అధికారిక పత్రాలు లేని వారి నుండి కూడా ఆస్తులను స్వాధీనం చేసుకోవచ్చు ననే సవరణ చట్టంలోని మరో అంశం కూడా కోర్టు రిజర్వు చేసిన ఉత్తర్వులలో ఉంది. అదేవిధంగా రాష్ట్రాలలోని వక్ఫ్ బోర్డులలో, కేంద్ర వక్ఫ్ మండలిలో సభ్యులను ఎంపిక చేసే విధా నం కూడా కొత్త చట్టం కింద వివాదాస్పదం కావడంతో దీనిని కూడా పిటిషనర్లు సవాలు చేశారు. ఎక్స్ అఫీషియో సభ్యులు మినహా కేవలం ముస్లిం మతానికి చెందినవారిని మాత్రమే ఈ బోర్డులను నడపడానికి అర్హులుగా ప్రకటించాలనేది పిటిషనర్ల వాదన. ఐతే వక్ఫ్ సవరణచట్టం—2025ను కేంప్రభుత్వం మాత్రం చాలా బలంగా సమర్థించుకుంటున్నది. వక్ఫ్ అనేది సహజసిద్ధ నిర్వచనం ప్రకారం, ఒక లౌకిక భావన అనీ, దానికి అనుకూలంగా రాజ్యాంబద్ధమైన అంచనాలు వేసి స్టే మంజూరు చేయలేరని కేంద్ర ప్రభుత్వం వాదిస్తున్నది.



# స్థానికం

REGIONAL NEWS

నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## ఎకరాకు 115 బస్తాల వడ్లు పండించిన మహిళా రైతు రమాదేవి



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** పోచంపల్లి పట్టణం నారాయణగిరికి చెందిన రమాదేవి అనే మహిళ ఎకరాకు 115 బస్తాల వడ్లు పండించి ఉత్తమ మహిళ రైతుగా నిలిచిన సందర్భంగా పిలాయిపల్లి కాల్వ పరిశీలనలో భాగంగా మంగళవారం భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అభినందించి సన్మానించారు. భవిష్యత్తులో మరింత మెరుగైన వ్యవసాయం చేసి ఫలితాలు ఉత్తమ ఫలితాలు సాధించి రైతులకు ఆదర్శంగా స్ఫూర్తిగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు తడక వెంకటేశ్వర్లు, జిల్లా సీనియర్ నాయకులు సామ మధు సూదన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు అనీరెడ్డి జగన్మోహన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ కొట్టం కరుణాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఉప్పునూతల వెంకటేశం, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు రైతులు తదితరులు ఉన్నారు.



## వేగవంతంగా ధాన్యం బస్తాల తరలింపు

జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

**ప్రజాపక్షం/తుంగతుర్తి(అర్వపల్లి):** ధాన్యం కాంటా వేసిన బస్తాలను మిల్లులకు వేగవంతంగా తరలించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలోని ఐకెపి కొనుగోలు కేంద్రాన్ని, తిమ్మాపురంలోని ఐకెపి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లారీలను సర్దుబాటు చేసి కొనుగోలు కేంద్రాలకు పంపుతామని ఈ రోజు సాయంత్రం లోపు కాంటా వేసిన బస్తాలను మిల్లులకి తరలించాలని సూచించారు. ఆకాల వర్షాలకి వడ్లు తడవకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలని, ఎక్కువ మంది హమాలీలను ఏర్పాటు చేసుకుని వెంటనే ధాన్యం లారీలకు దిగుమతి చేయాలని తెలిపారు. ఆయా కేంద్రంలోని రికార్డులను పరిశీలించి ఎన్ని లోడ్లు తరలించారని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలోని ఐకెపి నుండి 8వేల క్వింటాలు, తిమ్మాపురం నుండి 16950 క్వింటాలు ధాన్యం మిల్లులకు ఎగుమతి చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట సివిల్ సప్లై కార్పొరేషన్ డియం ప్రసాద్, తహసిల్దార్ యాదగిరి, ఎంపిడివో గోపి, సంఘ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు

సిపిఐ మండల కార్యదర్శి పోలె వెంకటయ్య డిమాండ్



**ప్రజాపక్షం/చింతపల్లి :** అర్హులైన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలని సిపిఐ మండల కార్యదర్శి పోలె వెంకటయ్య అన్నారు. మండల పరిధిలోని పికె మల్లేపల్లి గ్రామంలో సోమవారం రాత్రి సిపిఐ గ్రామ శాఖ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం పార్టీలకతీతంగా అర్హులైన పేదలందరికీ సంక్షేమ అందించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చాలని, ఆరుగ్యారంటీలను చిత్తశుద్ధితో అమలు చేయాలన్నారు. వందేళ్ళ సిపిఐ ఉద్యమ ప్రస్థానంలో ప్రజల పక్షాన నిలబడి ఉద్యమ పంథాతో ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడుతుందన్నారు. జూన్ 9న మాల్ వెంకటేశ్వరనగర్‌లో జరిగే సిపిఐ మండల మహాసభను పార్టీ శ్రేణులు జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ కార్యదర్శి అయితపాక సైదులు, మండల కార్యవర్గ సభ్యులు వేముల బుచ్చయ్య, రామకృష్ణ, కిష్టయ్య, పెదరామచంద్రం, అబ్బయ్య, లచ్చయ్య, శివ, కుమార్, అభిలాష్, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయాలకు అతీతంగా అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటేశ్వర్లు డిమాండ్



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఇస్తానన్న ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలకు ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోకల వెంకటేశ్వర్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నానిర్వహించి, అనంతరం డిప్యూటి తహసిల్దార్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో రెండు సంవత్సరాలవుతున్నా ఇంతవరకు మొదలు పెట్టలేదని, మొదలు పెట్టిన గ్యారెంటీలలో ఏ ఒక్క గ్యారంటీని పూర్తిగా అమలు చేయలేదని ఆయన అన్నారు. ప్రజలకు మాటలు చెప్పి మభ్యపెట్టకుండా అర్హులైన పేదవారికి ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు వెంటనే ఇచ్చి ఆదుకోవాలని రాష్ట్రప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కడియాల అప్పయ్య, యడ్ల అంజిరెడ్డి, ప్రతాని సైదులు, డి.అంజి, పంగ ఈదయ్య, కొత్తగూడెం మాజీ సర్పంచ్ హుస్సేన్, గోవిందరెడ్డి, వేణు పాల్గొన్నారు.

## ఇద్దయ్య మరణం బాధాకరం

సిపిఐ మండల కార్యదర్శి భీమనపల్లి రమేష్

**ప్రజాపక్షం/చండూరు /గట్టుప్పల:** సిపిఐ సీనియర్ నాయకులు వరికుప్పల ఇద్దయ్య మరణం చాలా బాధాకరమైన విషయం అని సిపిఐ గట్టుప్పల మండల కార్యదర్శి భీమనపల్లి రమేష్ అన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం సాయంత్రం కామ్రేడ్ వరికుప్పల ఇద్దయ్య గట్టుప్పలలో మరణించారు. మంగళవారం ఇద్దయ్య మృతదేహంపై సిపిఐ పార్టీ శ్రేణులు పార్టీ ఎర్రగుడ్డ కప్పి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ కామ్రేడ్ వరికుప్పల ఇద్దయ్య భారత కమ్యూనిస్టు పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. సిపిఐ పక్షాన ఈ ప్రాంత పేద ప్రజల సమస్యలపై పోరాటాలు నిర్వహించవారిలో ఇద్దయ్య ఒకరని అన్నారు. ఇద్దయ్య ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. అనంతరం నిర్వహించిన ఇద్దయ్య అంతిమ యాత్రలో పాల్గొని జోహర్లు అర్పించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ గట్టుప్పల శాఖ కార్యదర్శి కారింగు శ్రీను, ధనుంజయ్య ,దుబ్బాక బజార్ ,మొద్దు రాములు , కొండపల్లి ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.



# పండగలా రాష్ట్రావతరణ దినోత్సవం

సమీక్ష సమావేశంలో సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అధికారులకు ఆదేశం



**ప్రజాపక్షం/సూర్యాపేటకలెక్టరేట్:** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పండుగలా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ ఆయా శాఖల అధికారులను అదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఎస్పి కె.నర్సింహా, అదనపు కలెక్టర్ రాంబాబుతో కలిసి తెలంగాణ రాష్ట్ర అవతరణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాఖల వారిగా అధికారులు ఈనెల 29 లోపు సంక్షేమ పథకాలు, లబ్ధిదారుల వివరాలు సిపివోకు అందజేయాలని సూచించారు. ప్రముఖులకు అహ్వానం, ప్రొటోకాల్, సిట్టింగ్ ఏర్పాట్లు, స్వాతంత్ర్య సమరయోధులకు సన్మాన కార్యక్రమంలో ఎలాంటి తప్పులు దొర్లకుండా చూసుకోవాలని కోరారు. వేడుకల్లో దేశభక్తి ఉట్టిపడేలా, రాష్ట్ర ప్రగతికి సంబంధించి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. రాజీవ్ యువ వికాసం, ఇందిర మహిళ శక్తి, ఇందిర మహిళలాంటి పథకాలకు సంబంధించిన లబ్ధిదారుల జాబితా తయారు చేసి వేడుకల్లో అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్టాల్స్‌ను శాఖల వారిగా ఏర్పాటు చేస్తూ ఫోటో ఎగ్జిబిషన్ ద్వారా చూపించాలన్నారు. జిల్లా ఎస్పి కె.నర్సింహా మాట్లాడుతూ తమ శాఖ పరిధిలో ఏర్పాటు చేయాల్సిన అన్ని ఏర్పాట్లను అదనపు ఎస్పి జనార్ధన్‌రెడ్డి చూసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఎఫ్‌వో సతీష్‌కుమార్, డిఆర్‌డిఎ పిడి వివి అప్పారావు, ఆర్డీవో వేణుమాదవ్, సూర్యాపేట మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, సిపివో కిషన్, డిఈవో అశోక్, డిపివో యాదగిరి, డిఐఇవో భానునాయక్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

### నూతన పారిశ్రమలకు వెంటనే అనుమతులు మంజూరి చేయాలి

నూతన పారిశ్రమల కోసం అనుమతులు వెంటనే మంజూరి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ తెలిపారు. మంగళవారం సా యంత్రం కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా పెట్టుబడుల ప్రోత్సాహక కమిటి, టిజిఐపాస్ కమిటి కలెక్టర్ అధ్యక్షతన పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ పరిశ్రమలకు సంబంధించిన అనుమతులపై సమీక్షించడం జరిగింది. అలాగే వివిధ శాఖలకు సంబంధించిన అధికారులను సకాలంలో అనుమతులు జారీ చేయాల్సిందిగా కలెక్టర్ సూచించారు. టి ప్రైడ్ పథకం కింద 80 వాహనములకు రాయితీ మంజూరు చేయడం జరిగిందని, నిరుద్యోగులకి ఉపాధి కల్పించడానికి డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఒఫ్ తెలంగాణ (డిఇఇటి) పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. ఈ సమావేశంలో సిటివో బి.యాదగిరి, ఎల్‌డిఎం బాపూజీ, డిటిడివో కె.శంకర్, ఈడి ఎస్‌సి కార్పోరేషన్ ఎల్. శ్రీనివాస్ పాల్గొన్నారు.

## జూన్ 8న సూర్యాపేట జిల్లా నాలుగో మహాసభలు

సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు

**ప్రజాపక్షం/కోదాడ:** భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా నాలుగో మహాసభలు జూన్ 8న సూర్యాపేట జిల్లా కేంద్రంలో జరుగుతాయని ఈ మహాసభలను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం కోదాడ పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో పైడిమర్రి వెంకటనారాయణ, షట్టు పార్వతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడారు. పేద ప్రజలకు, కార్మికులు, కర్షకులు, మద్య తరగతి ప్రజలకు అండగా నిలిచేది భారతకమ్యూనిస్టు పార్టీ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీల పథకాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పేద ప్రజలకు ఇందిరమ్మ ఇండ్లను ప్రభుత్వమే కట్టించి లబ్ధిదారులకు అందజేయాలన్నారు. వ్యవసాయ కార్మికులకు పట్టణాలలో ప్రభుత్వ పని కల్పించాలని, కార్మికులకు కనీస వేతనం 26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల శ్రీనివాస రావు, మండల కార్యదర్శి బత్తినేని హనుమంతరావు, సిపిఐ పట్టణ కార్యదర్శి ఎస్‌కె లతీఫ్, నాయకులు ఉపతల శ్రీనివాస్, కట్టెకోల రమేష్, గోప్రానాయక్, రహిమాన్, సట్టు అంజమ్మ, పాలబోయిన కొండలు, కర్ల కాంతారావు, పంది వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. అనంతరం 21 మందితో మహాసభలో నూతన కౌన్సిల్, ఏడుగురిని కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



## ఉత్తమ ఉద్యోగిగా పేరు తెచ్చుకోవాలి

యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు



**ప్రజాపక్షం/యాదాద్రి :** ప్రతి ప్రభుత్వ ఉద్యోగి ఉత్తమ లక్షణాలను అలవర్చుకోవాలని జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయం లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టరేట్ పర్యవేక్షకులు జగన్ మోహన ప్రసాద్ ఆధ్వర్యంలో 30 మంది జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగికి ఉండవలసిన లక్షణాలపై రెవెన్యూ విశ్రాంత ఉద్యోగి సురేష్‌తో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శిక్షణా కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డితో కలిసి కలెక్టర్ పాల్గొని ప్రభుత్వ ఉద్యోగి విధి విధానాలను తెలియజేసారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉదయం 10.30 గంటలనుండి సాయంత్రం 5 గంటల వరకు విధులు నిర్వర్తించాల్సి ఉన్నా 24 గంటల పాటు ప్రభుత్వ ఆధీనంలో ఉన్నట్లేనని, పనుల విషయంలో నావల్ల కాదు, లేదు, నేను చేయలేను వంటివి మరచిపోవాలన్నారు. నిత్య విద్యార్థిగా ప్రతిదీ తెలుసుకుంటునే, తోటి వారికి కూడా తెలియజేస్తూ పరిణితి సాధించాలని, ఉన్నతాధికారుల మన్ననలు పొందాలన్నారు. రెవెన్యూ అధికారిగా ముద్ర పడాలంటే రెవెన్యూ లోని సెక్షన్స్ అన్ని తెలుసుకొని ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ పి.ఆర్.రిజిస్టర్ నిర్వహించాలని తద్వారా ప్రతి ఫైల్ పై పట్టు సాధించగలుగుతారన్నారు. ప్రభుత్వ ఉద్యోగి హుందాగా ఉంటూ వ్యతిరేక భావనలు విడనాడుతూ, పాజిటివ్ దృక్పథం పెంపొందించు కోవాలన్నారు. రెవెన్యూ act లపై పూర్తి అవగాహన పొందాలని, తెలియని విషయాలు అడిగి తెలుసుకోవాలని, పొరపాట్లు చేయరాదన్నారు.

## పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి



**ప్రజాపక్షం/ తిరుమలగిరిసాగర్:** పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి అన్నారు.మంగళవారం మండల పరిధిలోని కొంపల్లి గ్రామంలో 261 సర్వే నెంబర్ లో గల నాలుగు ఎకరాల 18 గుంటల ప్రభుత్వ భూమిలో 172 మంది లబ్ధిదారులకు ఇండ్ల స్థలాల పట్టాలు ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి చేతులమీదుగా పంపిణీ చేశారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల ప్రజల పక్షమే ఉందని అన్నారు.గత పది సంవత్సరాల పాలనలో ఏ ఒక్క ఇంటి నిర్మాణం కూడా టిఆర్ఎస్ ప్రభుత్వం చేయలేదని అన్నారు, కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో 3500 ఇందరమ్మ ఇండ్లను నాగార్జునసాగర్ నియోజకవర్గ పేద ప్రజలకు ఇప్పటికే మంజూరి చేశామని అన్నారు, అర్హులు ఎవరు ఆదేర్య పడాల్సిన అవసరం లేదు రానివారికి రెండో విడతలో అందిస్తామని అన్నారు.పైలెట్ ప్రాజెక్టులో భాగంగా త్వరలో రాష్ట్ర మొత్తం తిరుమలగిరి సాగర్ మండలం వైపే చూస్తుందన్నారు, బహిరంగ సభను ఏర్పాటు చేసి సీఎం చేతుల మీదుగా భూ పంపిణీ పట్టాలు పదివేల మందికి అందించబోతున్నామని అన్నారు. అల్వాల ఎక్స్ రోడ్డు నుండి ముకుందాపురం వరకు డబల్ రోడ్డును త్వరలోనే ప్రారంభం అవుతుందన్నారు.అనంతరం మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 20 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కలసాని చంద్రశేఖర్, గడ్డం సాగర్ రెడ్డి,మాజీ ఎంపీపీ ఆంగోత్ భగవాన్ నాయక్, తాహసీల్దార్ అనిల్ కుమార్, గాలి చంద్రకళ, కోపరేటివ్ డైరెక్టర్ పాండు నాయక్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# అవినీతిలో రాష్ట్రం అద్భుత ప్రగతి


మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ఎద్దేవా



**ప్రజాపక్షం/సూర్యాపేట:** అవినీతిలో తెలంగాణ రాష్ట్రం అద్భుత ప్రగతి సాధించిందని మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని, అభివృద్ధికి పక్కనపెట్టి పాలకులు దోచుకునేందుకు పోటి పడుతున్నారని అన్నారు. సిరిసిల్లలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కెటిఆర్ క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడిచేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో జరుగుతున్న తప్పులను ప్రశ్నించిన వారికి నోటీసులు ఇవ్వడం, కేసులు బనాయించి భయపెట్టాలని చూస్తోందని అన్నారు. నేషనల్ హెరాయిడ్ కేసులో సిఎం రేవంత్‌రెడ్డి పేరు ఈడి నమోదు చేసిన ప్రధాని మోడిని కలవడానికి ఆయన రెండు రోజుల కిందట వెళ్లాడంటే ఆర్థమవుతుందని అన్నారు. దీంతో రాష్ట్రంలో బిజేపి, కాంగ్రెస్ దోస్తి ఎలా ఉందో ఇట్టే ఆర్ధమవుతుందని చెప్పారు. సిఎం రేవంత్ రెడ్డి చిల్లరశేష్టలతో రాష్ట్ర ప్రతిష్ట దెబ్బతింటుందని అన్నారు. అందాల పోటీల పేరుతో ప్రపంచం ముందు తెలంగాణ పరువు తీశాడని వాపోయారు. ఇంగ్లాడ్‌కు చెందిన ఓ ప్రపంచ సుందరి తెలంగాణలో తనకు జరిగిన అవమానంపై మీడియాకు వెల్లడించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఎసిబి నోటీసులకు, క్యాంపు కార్యాలయంపై దాడులకు తాము భయపడతామనుకుంటే భ్రమేనని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా కెటిఆర్ క్రేజ్ పెరుగుతుందని సిఎం ఏడుపుగొట్టు తనంతో ఇలా చేస్తున్నారని అన్నారు. పాలన చేపట్టి 18 నెలలైన అభివృద్ధిపై దృష్టిపెట్టకుండా బిఆర్ఎస్ మీద ఏడుపు ఎందుకన్నారు. కెసిఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు ఎందుకు కట్టాడో కాంగ్రెస్ వాళ్లకు పూర్తిగా అవగాహన లేదన్నారు. మన నీళ్లు పక్క రాష్ట్రానికి తరలిపోతుంటే కనీసం అడ్డుకునే సోయి కూడా పాలకులకు లేకపోవడం బాధగా ఉందన్నారు. చిల్లరచేష్టలు మానుకొని, చిల్లర రాజకీయాలు మానుకొని అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు.

## రోళ్లు పగలని రోహిణికార్తె....

నైరుతి రాకతో భిన్నవాతావరణం



**ప్రజాపక్షం/సూర్యాపేటప్రతినిధి:** రోహిణి కార్తె వచ్చిందంటే రోళ్లు పగిలే ఎండలు ఉంటాయని పెద్దలు చెబుతుంటారు. ఈనెల 25వ తేదీ నుండి రోహిణికార్తె మొదలైన ఎండ తీవ్రత పూర్తిగా తగ్గి వాతావరణం చల్లబడింది. ఆకాల వర్షాలు, అల్పపీడనం కారణంగా వేసవికాలంలో వర్షాలు కురుస్తుండగా, దీనికితోడు నైరుతి రుతుపవనాలు కూడా ముందే రావడంతో జిల్లాలో వాతావరణం పూర్తిగా మారింది. రోహిణికార్తెలో రోళ్లు పగిలే ఎండలు ఉంటాయని పెద్దలు మొదటి నుండి చెబుతున్నారు. కాని ఈ సంవత్సరం అందుకు భీన్నంగా ఉంది. ఎండలతో అల్లాడాల్సిన ప్రజలు వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులతో సూర్యాపేట జిల్లా పూర్తిగా చల్లబడింది. అల్పపీడనంతో, అకాల వర్షాలు కురుస్తాయని వాతావరణ శాస్త్రవేత్తలు ముందే చెప్పారు. ఇది ఇలా ఉంటే నైరుతి రుతుపవనాలు కూడా 15 రోజుల ముందే రాష్ట్రానికి తాకడంతో వాతావరణంలో భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. ఇన్ని రోజులు వేసవితాపంతో అల్లాడిన జిల్లా వాసులు గత మూడురోజులుగా కురుస్తున్న వర్షాలతో వాతావరణ మార్పు వచ్చి చల్లబడటంతో ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు. ఇది ఇలా ఉంటే రైతాంగం వర్షాలు కురుస్తుండటంతో ఖరీఫ్ సాగు పనులలో నిమగ్నమయ్యారు. వాతావరణంలో వచ్చిన మార్పులతో ఖరీఫ్ పంట సాగుకు విత్తనాలు నాటాలని రైతులు ఉవ్విళ్లు ఊగుతున్నారు. ఇది ఎంత వరకు రైతులకు మేలు చేస్తుందో వేచి చూడాలి.



## లైసెన్స్‌డ్ సర్వేయర్లకు కిట్లు పంపిణీ

**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల ప్రతినిధి :** ఐడీఓసీ తమ ఛాంబర్ నందు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం శిక్షణ పొందుతున్న లైసెన్స్ సర్వేయర్లకు అదనపు కలెక్టర్ శిక్షణ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భూమి హక్కుల రికార్డులను పారదర్శకంగా నిర్వహించేందుకు లైసెన్స్ సర్వేయర్లను ప్రారంభించిందని పేర్కొన్నారు. శిక్షణ పొందుతున్న అభ్యర్థులు ప్రాక్టికల్ పనితీరులో నైపుణ్యం కలిగి ఉండేందుకు ఈ కిట్లు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. శిక్షణ కార్యక్రమంలో థియరీతో పాటు ఫీల్డ్ ట్రైనింగ్ కూడా ఉన్నందున అభ్యర్థులు కష్టపడి నేర్చుకోవాలని సూచించారు. భూ భారతి చట్టం ప్రకారం రిజిస్ట్రేషన్ , మ్యూటేషన్ వంటి ప్రక్రియల్లో సర్వే మ్యాప్‌లు తప్పనిసరిగా ఉండడంతో, గ్రామీణ ప్రాంతాల్లో లైసెన్స్ డ్ సర్వేయర్ల ప్రాధాన్యత గణనీయంగా పెరుగుతుందని తెలిపారు. ఈ శిక్షణ విజయవంతంగా పూర్తి చేసిన అభ్యర్థులకు పరీక్ష అనంతరం లైసెన్స్ డ్ సర్వేయర్ సర్టిఫికెట్ జారీ చేయబడుతుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్సు శాఖ ఏడి రామ్ చందర్, శిక్షణ పొందుతున్న అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

## మహమ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేసిన చిలక ప్రవీణ్‌పై చర్యలు

జమైతే ఉలేమా డిఎస్‌పికి వినతి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మహమ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ యుట్యూబ్‌లో ప్రసారం చేసి ముస్లీంల మనోభావాలు దెబ్బతీసిన చిలక ప్రవీణ్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని, యున్యూస్ యూ ట్యూబ్ ఛానెల్‌ను రద్దు చేయాలని కోరుతూ మిర్యాలగూ డీఎస్పీ రాజశేఖర్ రాజుకు, సబ్ కలెక్టరేట్ డిప్యూటీ తహసీల్దార్ చాంద్‌కు మంగళవారం సమర్పించిన వినతిపత్రంలో మిర్యాలగూడ జమైతే ఉలేమా నియోజకవర్గ బాధ్యులు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యు న్యూస్ ఛాన్‌లో చిలుక ప్రవీణ్ మహమ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ అతని యూ ట్యూబ్ ఛానల్‌ను రద్దు చేయాలని, అతనిపై సెక్షన్ 295 కింద చర్యలు తీసుకోవాలని అన్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 25, 26, 28ను ధిక్కరించారని అన్నారు. కార్యక్రమంలో మౌలాన వలియుల్లా, ముఫ్తీ ఇమ్రాన్, ముఫ్తీ ఉమర్, సలీం, నజ్మొద్దిన్, అబ్దుల్ మన్నాన్, రహమాన్, సయ్యద్ ఫరూక్, మోహసిన్, పాషా, మస్తాన్ తదితరులు ఉన్నారు.



## ప్రైవేట్ పాఠశాలలకు అడ్డుకట్ట వేయాలి

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి:** తెలంగాణ రాష్ట్రంలో అరకొర వసతులతో ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు నిధులు మంజూరు చేసి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని తెలంగాణ పౌర స్పందన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, జిల్లా మాజీ ఎంఎల్‌సి అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. మంగళవారం కొండమల్లేపల్లికి చేరుకున్నటువంటి ప్రచార జాత కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యా శాఖకు బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించి, నూతన విద్యా విధానాన్ని అమలులోకి తీసుకువచ్చి ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసి ప్రైవేట్ పాఠశాలతో దీటుగా ప్రభుత్వ పాఠశాలలను ముందంజలో ఉంచాలన్నారు. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేట్ పాఠశాలలకు అడ్డుకట్ట వేసి కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చదువుల్లో మార్పు రావాలని పౌర స్పందన ఎల్లప్పుడు ముందుకు వెలుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పౌర స్పందన వేదిక రాష్ట్ర నాయకులు ధనమూర్తి, మంగ, యూటీఎఫ్ రాష్ట్ర సాంస్కృతిక కమిటి కార్యదర్శి నల్ల నర్సింహా, టీఎస్ యూటిఎఫ్ జిల్లా కార్యదర్శి గంటెల వెంకటయ్య, మండల ప్రధాన కార్యదర్శి చిన ముత్యాలు, సినియర్ నాయకులు గోవర్ధన్‌రావు, పిఏపల్లి మండల అధ్యక్షుడు చాట్ల వెంకటయ్య, జిల్లా, మండల బాధ్యులు పాల్గొన్నారు.



# క్రీడ

## ఆసియా అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో

# గుల్వీర్‌కు స్వర్ణం




భారత స్టార్ రన్నర్ గుల్వీర్ సింగ్ ఆసియా అథ్లెటిక్ ఛాంపియన్ షిప్‌లో స్వర్ణ పతకం సాధించాడు. పురుషుల 10 వేల మీటర్ల రేసును గుల్వీర్ 28 నిమిషాల 38.63 సెకన్లలో ముగించి మెడల్ అందుకున్నాడు. ఈ క్రమంలోనే గుల్వీర్ జాతీయ రికార్డు కూడా నెలకొల్పాడు. ఇక జపాన్‌కు చెందిన మెబుకి సుజుకీ 10 వేల మీటర్ల రేసును 28 నిమిషాల 43.84 సెకన్లతో ముగించి రజత పతకం సాధించాడు.
అదేవిధంగా బ్రహెయిన్‌కు చెందిన ఆల్బర్ట్ కిబిచి రోప్ 28 నిమిషాల 46.82 సెకన్లతో కాంస్య పతకం గెలుచుకున్నాడు. గుల్వీర్ సింగ్ మరో పతకం సాధించే అవకాశం కూడా ఉంటుంది. మే 30న జరిగే పురుషుల 5000 మీటర్ల ఫైనల్‌లోనూ అతను పాల్గొననున్నాడు. 5 వేల మీటర్ల రేసులో గుల్వీర్‌కు మంచి రికార్డు ఉంది. పురుషుల 20 కిలోమీటర్ల నడకలో సెర్విన్ సెబాస్టియన్ (1 గంట 21 నిమిషాల 13.60 సెకన్లు) కాంస్యం సాధించాడు.
చైనాకు చెందిన వాంగ్ జావోజావో (1 గంట 20 నిమిషాల 36.90 సెకన్లు) స్వర్ణ పతకం అందుకోగా, జపాన్‌కు చెందిన కెంటో యోషికావా (1 గంట 20 నిమిషాల 44.90 సెకన్లు) రజతం దక్కించుకున్నాడు. మహిళల జావెలిన్‌త్రోలో అన్నురాణి త్రుటిలో కాంస్యం పతకం చేజార్చుకుంది. అన్నురాణి బెస్ట్ త్రో 58.30 మీటర్లు కాగా.. 64 సెంటీమీటర్ల తేడాతో నాలుగో స్థానంలో నిలిచి మెడల్‌ను మిస్ చేసుకుంది. జపాన్‌కు చెందిన సే టకేమోటో (58.94 మీటర్లు) కాంస్య పతకం సాధించింది.



# దుమ్మురేపిన సింధు

## రెండో రౌండ్‌లో ప్రణయ్..!

ప్రతిష్ఠాత్మక సింగపూర్ ఓపెనర్ సూపర్ 750లో భారత బ్యాడ్మింటన్ స్టార్లు ముందంజ వేశారు. పీవీ సింధు, హెచ్ ఎస్ ప్రణయ్‌లు రెండో రౌండ్‌కు దూసుకెళ్లారు. మహిళల విభాగంలో దుమ్మురేపిన సింధు అరగంటలోనే కెనడా షట్లర్‌ను చిత్తు చేసింది. తనకంటే మెరుగైన ర్యాంకర్ డెన్మార్క్‌కు చెందిన రస్మస్ జెమ్కేపై ప్రణయ్ అద్భుతంగా పోరాడి విజయం సాధించాడు. అయితే.. మాళవికా బన్సోద్, అన్మోల్ ఖార్బ్, ప్రియాన్ష్ రజావత్, కిరణ్ జార్జ్‌లు పేలవ ఆటతో తొలి రౌండ్‌లోనే ఇంటి దారి పట్టారు.
మలేషియా మాస్టర్స్‌లో తొలి రౌండ్‌లోనే వెనుదిరిగిన పీవీ సింధు ఈసారి అదరగొట్టింది. మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్‌లో కెనాడాకు చెందిన వెన్ యూ ఝూంగ్‌పై తెలుగు తేజం అలవోకగా గెలుపొందింది. అర గంటలోనే ప్రత్యర్థిని 21 14, 219తో మట్టికరిపించింది సింధు. రెండో రౌండ్‌లో టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణం సాధించిన చెన్ యూ ఫెయా(చైనా)తో భారత షట్లర్ తలపడనుంది. గత సీజన్ నుంచి ఒక్క టైటిల్ గెలుపొందని సింధు.. సింగపూర్ ఓపెన్‌లో విజేతగా నిలవాలనే కసితో ఉంది.
పురుషుల సింగిల్స్‌లో ప్రణయ్ అతికష్టమ్మీద గట్టెక్కాడు. డెన్మార్క్ షట్లర్ రస్మస్ జెమ్కేతో పోరులో తొలి సెట్ కోల్పోయిన భారత స్టార్.. ఆ తర్వాత పుంజుకున్నాడు. వరుసగా రెండు సెట్లలో పైచేయి సాధించి విజేతగా మ్యాచ్ ముగించాడు. తదుపరి రౌండ్‌లో ఫ్రాన్స్‌కు చెందిన క్రిస్టోవ్ పాపోవ్‌ను ప్రణయ్ ఎదుర్కోనున్నాడు.




# పంత్ విధ్వంసక శతకం

### ఆర్సీబీ క్వాలిఫయర్ 1 ఆశలు గల్లంతేనా..!

ఐపిఎల్ 18వ సీజన్ చివరి లీగ్ మ్యాచ్‌లో రిషభ్ పంత్(118 నాటౌట్) విధ్వంసక శతకంతో చెలరేగాడు. ఈ సీజన్‌లో రికార్డు ధర పలికిన పంత్ ఆఖరి పోరులో తనదైన షాట్లతో అలరిస్తూ మెరుపు సెంచరీతో విరుచుకుపడ్డాడు. సొంత మైదానంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు బౌలర్లలో దడ పుట్టించిన ఈ లెఫ్ట్ హ్యాండర్.. ఓపెనర్ మిచెల్ మార్ష్(67)తో రెండో వికెట్‌కు కలిసి 152 రన్స్ జోడించాడు. అనంతరం నికోలస్ పూరన్(13) జతగా స్కోర్ బోర్డును ఉరికించిన పంత్.. ఆర్సీబీకి 227 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించడంలో కీలక పాత్ర పోషించాడు. ఈ మ్యాచ్‌లో గెలిచి క్వాలిఫయర్ 1కు అర్హత సాధించాలనుకున్న ఆర్సీబీ ఆశలన్నీ టాపార్డర్ మీదే ఉన్నాయి. చూడాలి.. ఏం జరుగుతుందో. నాకౌట్ పోరుకు ముందు ఆర్సీబీకి అసలైన పరీక్ష ఎదురైంది. చివరి లీగ్ మ్యాచ్‌లో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన లక్నో సూపర్ జెయింట్స్ కొండంత స్కోర్ చేసింది. బెంగళూరు బౌలర్లను ఉతికేసిన లక్నోసారథి రిషభ్ పంత్ (118 నాటౌట్) మునపటిలా చెలరేగి సెంచరీ సాధించాడు. అగ్నికి వాయువుడు తోడైనట్టు అతడికి మిచెల్ మార్ష్(67) జత కలవగా లక్నో స్కోర్ రాకెట్‌లా దూసుకెళ్లింది. అంతే.. ఆర్సీబీ ముందు 228 పరుగుల భారీ లక్ష్యాన్ని నిలిపింది లక్నో. మార్ష్ ఔటైనా లక్నో స్కోర్ వేగం తగ్గలేదు. భువీ వేసిన 18వ ఓవర్లో ఫైన్ లెగ్‌లో బౌండరీతో 95కి చేరువైన పంత్.. ఒంటికాలితో కవర్స్‌లో ఫోర్ బాది సెంచరీ సాధించాడు. అనంతరం జంప్ చేసి సంబరాలు చేసుకున్న అతడు ఆ ఒక్క షాట్‌తో అతడు లక్నో స్కోర్ 200లు దాటించాడు. దయాల్ ఓవర్లో కళ్లుచెదిరే 4, 6 బాదిన పంత్.. షెపర్డ్ వేసిన 20వ ఓవర్లోనూ ఒంటిచేత్తో సిక్సర్ బాదాడు. ఐదో బంతికి నికోలస్ పూరన్() ఔట్ కాగా 3 వికెట్ల నష్టానికి లక్నో 227 పరుగులు కొట్టింది.

# రీల్

# నేడు 'మిరాయ్' టీజర్ రిలీజ్




యంగ్ హీరో తేజా సజ్జ 'హనుమాన్' చిత్రంతో బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి సెన్సేషన్ క్రియేట్ చేశాడో మనం చూశాం. ఇక ఆయన నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'మిరాయ్' ఇప్పటికే శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. ఈ సినిమాను కార్తీక్ ఘట్టమనేని డైరెక్ట్ చేస్తుండగా సూపర్ యోధాగా తేజా ఈ సినిమాలో కనిపిస్తాడు. ఇక ఈ సినిమా నుంచి ఇప్పటివరకు రిలీజ్ అయిన పోస్టర్స్ ఈ సినిమాపై అంచనాలు పెంచుతూ వచ్చాయి. అయితే, తాజాగా ఈ సినిమా నుంచి టీజర్‌ను రిలీజ్ చేసేందుకు చిత్ర యూనిట్ రెడీ అయ్యింది. మిరాయ్ టీజర్‌ను మే 28న ఉదయం 10.08 గంటలకు రిలీజ్ చేస్తున్నట్లు చిత్ర యూనిట్ ప్రకటించింది. ఈ సినిమాలో మంచు మనోజ్ ఓ పవర్‌ఫుల్ విలన్‌గా కనిపిస్తాడు. ఈ సినిమాలోని ఆయన పాత్ర ప్రేక్షకులను స్టన్ చేయడం ఖాయమని చిత్ర యూనిట్ చెబుతోంది. రితికా నాయక్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాను పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టి.జి.విశ్వప్రసాద్ ప్రొడ్యూస్ చేస్తున్నారు.

# ఆగస్టు 27న 'మాస్ జాతర'?




మాస్ రాజా రవితేజ నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'మాస్ జాతర' కోసం ప్రేక్షకులు ఎంత ఆసక్తిగా ఎదురుచూస్తున్నారో అందరికీ తెలిసిందే. ఈ సినిమాను భాను బోగవరపు డైరెక్ట్ చేస్తుండగా పూర్తి మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం రానుంది. ఇక ఇప్పటికే ఈ మూవీ నుంచి రిలీజ్ చేసిన ప్రమోషనల్ కంటెంట్ ఈ సినిమాపై అదిరిపోయే అంచనాలు క్రియేట్ చేశాయి. అయితే, తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన రిలీజ్ డేట్‌ను మేకర్స్ లాక్ చేసినట్లుగా వార్తలు వినిపిస్తున్నాయి. తొలుత ఈ చిత్రాన్ని మే 9న గ్రాండ్ రిలీజ్ చేయాలని మేకర్స్ భావించారు. కానీ కొన్ని కారణాల వల్ల అది సాధ్యం కాలేదు. ఇక ఇప్పుడు ఈ చిత్రాన్ని ఆగస్టు 27న గ్రాండ్ రిలీజ్ చేయాలని చిత్ర యూనిట్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. మరోసారి మాస్ పవర్ ఏమిటో చూపెట్టేందుకు రవితేజ సిద్ధమవుతున్నాడట. ఇక ఈ సినిమాలో యంగ్ బ్యూటీ శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తోండగా భీమ్స్ సిసిరోలియో ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నాడు. మరి ఈ చిత్ర రిలీజ్ డేట్‌ను మేకర్స్ అధికారికంగా ఎప్పుడు ప్రకటిస్తారో చూడాలి.

# ఆ సీన్ తీవ్ర అసౌకర్యానికి గురి చేసింది

### రవీనా టాండన్



90వ దశకంలో బాలీవుడ్‌ను రూల్ చేసిన అగ్రతారల్లో నటి రవీనా టాండన్ ఒకరు. 1991లో 'పత్తర్ కే ఫూల్' సినిమాతో బాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన ఈ అమ్మడు ఆ తర్వాత తన కెరీర్‌లో ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో నటించి స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకుంది. అయితే ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈ స్టార్ నటి తన కెరీర్ ప్రారంభంలో జరిగిన ఒక సంఘటన గురించి తాజాగా పంచుకుంది. తన సహనటుడితో అనుకోకుండా జరిగిన లిప్‌టచ్ వల్ల తాను వాంతులు చేసుకున్నానని సంచలన వ్యాఖ్యలు చేసింది. కెరీర్ ప్రారంభం నుంచీ ముద్దు సన్నివేశాలకు, రొమాంటిక్ సీన్స్‌లకు దూరంగా ఉండాలని నిర్ణయించుకుంది రవీనా. అయితే, ఒక సినిమా షూటింగ్‌లో అనుకోని సంఘటన జరిగిందంటూ రవీనా వివరించారు.
నాకు బాగా గుర్తుంది. ఒక సినిమాలో హీరో నన్ను రఫ్‌గా హ్యాండిల్ చేయాల్సిన సీన్ అది. ఆ సన్నివేశం షూట్ చేస్తుండగా, అనుకోకుండా అతడి పెదవులు నా పెదాలను తాకాయి. అక్కడ ముద్దు పెట్టుకోవాల్సిన అవసరం లేదు, అది కేవలం పొరపాటున జరిగింది అని ఆమె తెలిపారు. ఈ సంఘటన తనను తీవ్ర అసౌకర్యానికి గురి చేసిందని, నాకు వికారంగా అనిపించింది. లైట్ తీసుకోలేకపోయాను. వెంటనే వాష్ రూమ్‌లోకి వెళ్లి వాంతులు చేసుకున్నాను. ఆ తర్వాత బ్రష్ చేసుకొని దాదాపు వంద సార్లు ముఖం కడుక్కున్నాను అంటూ షాకింగ్ విషయాలు వెల్లడించారు.
ఆ నటుడికి ఎలాంటి చెడు ఉద్దేశం లేదని.. ఆ సంఘటన తర్వాత ఆ హీరో వచ్చి తనకు క్షమాపణ కూడా చెప్పాడని, అయినా తనకు అది తట్టుకోలేకపోవడం వల్ల అలా జరిగిందని రవీనా చెప్పుకొచ్చారు.



## ఒయు ప్రొఫెసర్స్ క్వార్టర్స్ భూమి లీజు

# నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

### విద్యార్థి సంఘాలు డిమాండ్

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఆద్య కళ, ఆది ధ్వని స్వచ్ఛంద సంస్థకు కేటాయించిన ఒయు ప్రొఫెసర్స్ క్వాటర్స్ భూమి లీజు నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. ఆద్య కళ, ఆది ధ్వని స్వచ్ఛంద సంస్థలకు కేటాయించినా ఉస్మానియా యూనివర్సిటీ భూములను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఒయు వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఒయు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేష్ రెడ్డి, ఓఎస్‌డి ప్రొఫెసర్ జితేంద్ర నాయక్‌లకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లెనిన్, నెల్లి సత్య (ఎఐఎస్‌ఎఫ్), కలకోట ఉదయ్ కుమార్, దండు అజయ్ కుమార్ (ఎస్‌ఎఫ్‌ఐ), సోనబోయిన రాకేష్ (పిడిఎస్‌యు), వివిధ సంఘాల నాయకులు అశ్విన్, హరీశ్, కృష్ణ, మధు, సాయి ప్రసాద్, అనిల్ మాట్లాడుతూ ఉస్మానియా విశ్వవిద్యాలయం పరిధిలోని ఆర్‌టిసి ఆసుపత్రి ఎదురుగా ఉన్న పి1, పి2, పి3 200 కోట్లకు పైగా విలువైన ప్రొఫెసర్స్ క్వాటర్స్ భూమిని ఆద్య కళ, ఆది ధ్వని సంస్థలకు అప్పనంగా 30 సంవత్సరాలు లీజుకు ఇవ్వడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ఒకవైపు ఒయు భూములు కబ్జాలతో అన్యాక్రాంతమవుతుంటే, వాటికి రక్షణ కల్పించకుండా ఉన్న భూములను లీజుకు ఇవ్వడం పట్ల ఉస్మానియా యూనివర్సిటీ అధికారులకు చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ఒయు భూముల పరిరక్షణకు ఏర్పాటు చేసిన జస్టిస్ చిన్నప రెడ్డి కమిషన్ ప్రకారం ఉస్మానియా యూనివర్సిటీ భూమిని ఎటువంటి ప్రైవేట్ వ్యక్తులకు ఇతర సంస్థలకు ఇవ్వకూడదని, ప్రైవేట్ వ్యక్తులు, స్వచ్ఛంద సంస్థలు ఎటువంటి ఒయు భూములలో నిర్మాణాలు, మరమ్మత్తులు చేయకూడదని స్పష్టం చేశారన్నారు. గత వైస్ ఛాన్సలర్ రవీందర్, గత మాజీ ఇన్‌చార్జ్ విసి దాన కిషోర్ ప్రస్తుత విసి కుమార్ మొలుగారం ముగ్గురు ఒక్కొక్కరు ఒక్కొక్క క్వాటర్స్‌ను లీజుకు ఇచ్చారని విమర్శించారు. కావున ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని, లేకపోతే లెఫ్ట్ విద్యార్థి సంఘాలుగా లీజు నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు పోరాడుతామని యూనివర్సిటీ అధికారులను హెచ్చరించారు.

# స్థానిక సంస్థల ఎన్నికలలో బిసిల రిజర్వేషన్ల పెంపునకు జిఒ తేవాలి

### రాష్ట్ర ప్రభుత్వానికి ఎంపి ఆర్.కృష్ణయ్య డిమాండ్



ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉత్తర్వులు (జిఓ) జారీచేయాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు, ఎంపి ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బిసి రిజర్వేషన్ల పెంపుపై అన్ని రాజకీయ పార్టీలు తమ విధానాన్ని ప్రకటించాలని కోరారు. హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారకభవన్‌లో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం వెంకటేశ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసి రిజర్వేషన్ల పెంపుపై ప్రభుత్వం నుంచి స్పష్టత లేదన్నారు. బిసి రిజర్వేషన్లు 20 నుంచి 42 శాతానికి రిజర్వేషన్లు పెంచుతూ అసెంబ్లీలో చట్టం చేశారని, తర్వాత దానిని పట్టించుకోదని విమర్శించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243–డి6 ప్రకారం స్థానిక సంస్థల్లో బిసి రిజర్వేషన్లను పెంచే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్నదన్నారు. ఒక వేళ ఎవరైనా సుప్రీంకోర్టుకు వెళ్లినా బిసి జనాభా లెక్కలు చూపి, కేసు గెలిచే అవకాశం ఉన్నదన్నారు. సిఎం రేవంత్ రెడ్డి బిసిలకు ఇచ్చిన హామీ మేరకు బిసిలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించనట్లయితే వెయ్యిమంది బిసిలు ఆమరణ నిరాహార దీక్షకు సిద్ధంగా ఉన్నారని కృష్ణయ్య హెచ్చరించారు. సమావేశంలో బిసి సంఘం నేతలు జి.అనంతయ్య, శ్రీనివాస్ చారి తదితరులు పాల్గొన్నారు.



# ఒంటరి పోటీకైనా సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)



నివాళులర్పించారు. ప్రారంభ సభకు మర్రి వెంకటస్వామి అధ్యక్షత వహించారు. కూనంనేని, చాడ మాట్లాడుతూ మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావుతో పాటు వందలాది మంది నక్సలైట్లను ఎన్‌కౌంటర్ పేరుతో హతమార్చి సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటన్నారు. చర్చలకు పిలిచినా ఆయుధాలు వదిలేయడానికి సిద్ధమైనా ఆపరేషన్ కగార్ పేరుతో హతమార్చడం సమంజసం కాదని, చట్టాలున్నప్పటికీ రాక్షసుల్లా, నరహంతకుల్లా బిజెపి ప్రభుత్వం వ్యవహరించిందన్నారు. ప్రశ్నించే వారిని అణగదొక్కడమే లక్ష్యంగా బిజెపి రాక్షస, దుర్మార్గ పాలన కొనసాగిస్తుందన్నారు. సిపిఐ అధికారంలో లేకున్నా సిద్ధాంత బల నిర్మాణంతోనే వందేళ్ల చరిత్ర పూర్తి చేసుకుందన్నారు. రాజకీయంగా, నిర్మాణపరంగా క్రమబద్ధతిలో నడుచుకోవడం కారణంగా వందేళ్ల చరిత్ర ఉందంటే దేశంలో సిపిఐ పార్టీ ఒక్కటేనన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం కాంగ్రెస్ ఆవిర్భవించిందన్నారు. నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి సైతం ఆనాడు లేదన్నారు. ప్రజావ్యతిరేక విధానాలపై సిపిఐ ఉద్యమానికి జాతీయ సదస్సులో నిర్ణయాలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమం చీలిపోయిన తర్వాత అనేక వామపక్ష పార్టీలు పుట్టుకొచ్చినప్పటికీ వర్గ దోపిడీకి, శ్రమదోపిడీకి వ్యతిరేకంగా పనిచేస్తున్నారన్నారు. ఎన్నో పార్టీలు వచ్చి పోయాయాని, వందేళ్లుగా పేదలు, కష్టజీవుల పక్షాన సిపిఐ నిలబడిందన్నారు. మార్గాలు వేరైనా నక్సలైట్లు, కమ్యూనిస్టులదంతా కమ్యూనిజమేనన్నారు. కమ్యూనిస్టులంతా కలిసుంటే ఎప్పుడో ఎర్రకోటపై ఎర్రజెండా ఎగిరేసే వాళ్లమన్నారు. కమ్యూనిస్టులను దూరం చేసుకుని అధికారాన్ని పోగొట్టుకున్నామనే బాధలో బిఆర్‌ఎస్ ఉందన్నారు. బిజెపిని ఓడించేందుకు సిపిఐతో చేతులు కలిపి మునుగోడులో బిఆర్‌ఎస్ గెలిచిన తర్వాత కెసిఆర్ మాట మార్చి అహంకారంతో విర్రవీగిపోయారన్నారు. కమ్యూనిస్టు పార్టీ గెలుపు ఓటములను శాసించే పార్టీ అని, అందుకు ఉదాహరణ రాష్ట్రంలో బిఆర్‌ఎస్‌ను ఓడించడమే ప్రజలు చూసారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి సిపిఐ ఎంత కృషి చేసిందో ప్రజలకు తెలుసన్నారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 సంవత్సరాలు గడుస్తుండగా కార్మిక సంస్కరణల పేరుతో పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను నిర్వీర్యం చేయడానికి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువస్తుందన్నారు. కార్మికులంతా ఏకమై ప్రభుత్వ విధానాలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. మోడీ నియంతృత్వ పాలనకు చరమగీతం పాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజా ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.
మహాసభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్, జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, జిల్లా కార్యవర్గ సభ్యులు పొనగంటి కేదారి, కొయ్యడ సృజన్ కుమార్, బోయిని అశోక్, అందె స్వామి, సమ్మయ్య, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, పెద్దపల్లి సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, బత్తుల బాబు తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ కొకైన్..

(మొదటి పేజీ తరువాయి)

(ఒజికుష్) తీసుక వచ్చి హైదరాద్‌లో తన స్నేహితులకు అమ్మకాలు జరుపుతూ తాను వినియోగిస్తున్న కరణ్ పర్మార్ అనే వ్యక్తి మంగళవారం రంగారెడ్డి ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌కు పట్టుబడ్డాడు. పట్టుబడిన నిందితుడి వద్ద రూ.3లక్షల విలువ చేసే 19.36 గ్రాముల కోకైన్, రూ. 35 వేల విలువ చేసే 6.7 గ్రాముల ఒజికుష్‌ను ఎఇఎస్ జీన్ కిరణ్ టీమ్ పట్టుకున్నారని అసిస్టెంట్ కమిషనర్ ఆర్. కిషన్ తెలిపారు.హైదరాబాద్‌కు చెందిన కరణ్ గోవా నుంచి డ్రగ్స్ తీసుకువచ్చి హైదరాబాద్‌లో విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలోనే మంగళవారం కూడా గోవా నుంచి హైదరాబాద్‌కు డ్రగ్స్ తీసుకువచ్చి బేగంపేట ప్రాంతంలో విక్రయిస్తుండగా సిఐలు బాలరాజ్, సుభాష్ చంద్రారావుతోపాటు ఎస్ఐలు రవి చల్లా, వెంకటేశ్వర్లు, అఖిల్‌లు దాడి చేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితుడిని అతని నుంచి స్వాధీనం చేసుకున్న డ్రగ్స్‌ను బాలనగర్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు.

# అవినీతి నిర్మూలన

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వంలో ఎందరో కార్యకర్తలు ప్రాణత్యాగాలు చేశారు. వారి స్ఫూర్తి టిడిపిలో శాశ్వతంగా ఉంటుందని, వారికి పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. రాజకీయాల్లో సామాజిక న్యాయం టిడిపి తెచ్చిన అతిపెద్ద విప్లవం. అట్టడుగు వర్గాలకు రాజకీయ అవకాశాలు ఇచ్చాం.మన తర్వాత దేశంలో అన్ని పార్టీలు బిసిలను గుర్తించే పరిస్థితి వచ్చిందన్నారు. స్వాతంత్రం వచ్చిన తర్వాత 78 ఏళ్లలో ఎంత అభివృద్ధి జరిగిందో రాబోయే 22 ఏళ్లలో అంతకుమించి రెట్టింపు అభివృద్ధి జరిగి ఎపి కేరాఫ్‌గా మారబోతుందన్నారు. మహానాడులో నదుల అనుసంధానం, పోలవరం పూర్తి చేసి జలహారతి ద్వారా ప్రతి ఎకరాకు నీరిచ్చి తెలుగు ప్రజల రుణం తీర్చేలా తీర్మానం చేస్తామన్నారు. అలాగే గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్‌కు నాంది పలుకుతాం. రోడ్లు, రైల్వే, పోర్టులు, ఎయిర్ పోర్టులు వంటివి చేసి ప్రపంచంలోనే లాజిస్టిక్ కాస్ట్ తగ్గేలా మన ఆలోచనలు ఉంటాయి. అలాగే క్వాంటమ్ వ్యాలీ, ఏఐకి ప్రాధాన్యత ఇచ్చి తెలుగుజాతిని ముందుకు నడిపిస్తాను. అందరూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండటం మన విధానమని స్పష్టం చేశారు. రాబోయే పదేళ్లలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితినే కాదు మనం అనుకున్న విధానాలు అమలు చేసి ప్రపంచంలోనే తెలుగు జాతి నెంబర్ వన్ గా చేసే బాధ్యత మనందరిదీ అని చంద్రబాబు పిలుపునిచ్చారు. పేదల్లో ప్రతి ఒక్కరికీ సంక్షేమం అందించడమే లక్ష్యమని, దీనిలో భాగంగా ఎన్నికల హామీలో పేర్కొన్న మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం ఆగస్టు 15నుంచి ప్రారంభించనున్నట్లు ప్రకటించారు.

# అప్రమత్తం

(మొదటి పేజీ తరువాయి)

పంటల సాగు తదితర అంశాలపై ముఖ్యమంత్రి మంగళవారం సాయంత్రం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మంత్రులు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఎన్.ఉత్తమకుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సి.దామోదర్ రాజనరసింహ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఈఏడాది రుతుపవనాలు 15 రోజుల ముందుగానే వస్తున్నందున వ్యవసాయ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. రైతులకు విత్తనాలు, ఎరువులు సిద్ధంగా ఉన్నాయని, రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవడానికి పంట వివరాలు, స్థానిక అవసరాలను ముందుగానే గుర్తించాలన్నారు. ప్రతి జిల్లాలో పర్యవేక్షణ కోసం ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని ఆయన ఆదేశించారు. ఈ ఏడాది ఇప్పటివరకు అత్యధికంగా 64.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు ఆయన చెప్పారు. ఇప్పటివరకు 90 శాతం ధాన్యం సేకరణ పూర్తయిందని, రుతు పవనాలు సమయానికి ముందే రావడంతో మిగిలిన ధాన్యాన్ని సేకరించడం కష్టంగా మారిందన్నారు. ఇప్పటివరకు, ధాన్యం కొనుగోలు చేసినందుకు రైతులకు రూ.12,184 కోట్లు చెల్లించామన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బు జమ అవుతోందని, తాము ఆ విషయాన్ని ప్రచారం చేయడంలేదన్నారు. దీని కారణంగా చిన్న సంఘటనలు జరుగుతున్నాయని, కొన్ని చోట్ల రాజకీయ ప్రేరేపిత సంఘటనలు జరుగుతున్నాయి. ధాన్యం సేకరణ వివరాలను ప్రజలకు ఎప్పటికప్పుడు అందించాలని, చిన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. అవసరమైతే, వరి ధాన్యాన్ని నిల్వ చేయడానికి స్థానిక గిడ్డంగులను అద్దెకు తీసుకోవాలని సిఎం సూచించారు. మిల్లుల యజమానులు, మధ్యవర్తులు రైతులను వేధిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూభారతి చట్టం పేద రైతులకు చాలా ఉపయోగకరంగా ఉందని ముఖ్యమంత్రి అన్నారు. భూభారతిపై అవగాహన సదస్సులు నిర్వహించాలని, ఈ చట్టం ప్రజలకు చేరువ కావడానికి, జూన్ 3 నుండి 20వ తేదీ వరకు మూడవ దశ రెవెన్యూ సమావేశాలను నిర్వహించాలని సిఎం ఆదేశించారు. ఇందిరమ్మ గృహనిర్మాణ పథకం కూడా చాలా ముఖ్యమైనదని, క్షేత్ర స్థాయిలో తలెత్తే సమస్యలను గుర్తించి పరిష్కరించడం జిల్లా కలెక్టర్ల బాధ్యత అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలని సూచించారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులు ఈ నెల 29, 30 తేదీల్లో వివిధ జిల్లాలకు వెళ్లి ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకాన్ని పరిశీలించి జూన్ 1 నాటికి పూర్తి నివేదికను సమర్పించాలని సిఎం కోరారు. ఈ సందర్భంగా జూన్ 2న జరిగే రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని అన్ని జిల్లాల్లో ఘనంగా నిర్వహించాలని సిఎం అధికారులను ఆదేశించారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com